www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 26-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 221 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి తె. 3.48 తదుపరి ద్వాదశి; నక్షత్రం: హస్త తె. 4.34 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ. 10.54-12.43; దుర్ముహూర్తం: ఉ. 8.42-9.27, రా. 9.49-10.39; అమృతఘడియలు: రా. 9.46-11.35; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అండమాన్ దగ్గర 6 టన్నుల డ్రగ్స్

విలువ రూ. 25 వేల కోట్లు

ఆరుగురు మయన్మార్ జాతీయుల అరెస్టు

2

తీర గస్తీ దళం నిఘా విమానం ద్వారా గుర్తింపు



₹165 కోట్లు మాయం!

కడప విమానాశ్రయం పేరుతో 'కొట్టేశారు'?



పీఏవో స్థాయిలోనే ఆర్థిక అరాచకం

పనులు జరిగాయని తేలకుండానే బిల్లులు

ప్రభుత్వ అనుమతుల్లేకుండానే చెల్లింపులు

ముందుగా ఏపీఐఐసీ బ్యాంకు ఖాతాకు

అక్కడి నుంచి ఎవరి జేబులోకి వెళ్లాయి?

పీఏవో తీరుపై ఏజీ తీవ్ర అభ్యంతరం

బయటపెట్టకుండా దాచేసిన పీఏవో

వైసీపీ హయాం అంటేనే ఆర్థిక అరాచకాల కాలం! అడ్డగోలుగా అప్పులు, ఇష్టానుసారం బిల్లుల చెల్లింపులు! తాజాగా... ఇలాంటి అడ్డగోలు వ్యవహారం మరొకటి బయటికి వచ్చింది. పరిపాలనా అనుమతుల్లేకుండా, పనులు జరిగాయో లేదో తెలుసుకోకుండానే రూ.165 కోట్లను 'మాయం' చేసిన వైనం బయటపడింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సొంత జిల్లా కేంద్రమైన కడప విమానాశ్రయం అభివృద్ధి పేరిట నిధులు గోల్‌మాల్ చేసినట్లు తేలింది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వంలో ఏదైనా బిల్లు పాస్ అయి చెల్లింపులు జరగాలంటే పరిపాలనాపరమైన అనుమతులు ఉండి తీరాల్సిందే! హెచ్ఓడీ, సచివాలయ శాఖ, బడ్జెట్ రిలీజ్ ఆర్డర్(బీఆర్‌వో)లో పేర్కొన్న నిబంధనల ప్రకారం బిల్లుకు ఆమోదం ఉందో లేదో చూసిన తర్వాతే పే అండ్ అకౌంట్స్ కార్యాలయం (పీఏవో) దానిని పాస్ చేయాలి. కానీ... వైసీపీ హయాంలో అంతా గోల్‌మాల్! 2023లో కడప విమానాశ్రయం పనులకు సంబంధించి ఒక బిల్లును పరిపాలనాపరమైన అనుమతులేవీ లేకుండానే పీఏవో పాస్ చేసింది. సీఎఫ్ఎంఎస్‌లో కూడా దీనిపై నియంత్రణ లేకుండా పోయింది. ఆడిటర్ జనరల్ (ఏజీ) తనిఖీలో ఈ తప్పుడు లెక్క బయటపడింది. కడప విమానాశ్రయం పనులను ఏపీఐఐసీ చేపట్టింది. దీనికి సంబంధించి మౌలిక సదుపాయాలు,

మిగతా 14వ పేజీలో...

పీఠముడి

సీఎం ఎవరనేది తేల్చుకోలేకపోతున్న మహాయుతి పక్షాలు

ఢిల్లీలో ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్ మకాం

ఫడణవీస్-శిందే సీఎంలుగా చెరి రెండున్నరేళ్లని ప్రచారం

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం 15వ అసెంబ్లీ ప్రారంభమైనట్లే

మహారాష్ట్రలో రాష్ట్రపతిపాలన ఉండకపోవచ్చు: నిపుణులు



శీతాకాల సమావేశాలకు ముస్తాబవుతున్న నాగ్‌పూర్‌లోని అసెంబ్లీ

ముంబై, న్యూఢిల్లీ, నవంబరు25: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి స్పష్టమైన మెజార్టీ వచ్చినా ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో బీజేపీ, శివసేన, ఎన్సీపీ నేతలు ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఢిల్లీలో బీజేపీ పెద్దలతో సమావేశమై చర్చలు జరిపిన దేవేంద్ర ఫడణవీస్ తిరిగి ముంబైకి వెళ్లిపోయారు. శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ కూడా ఢిల్లీలో బీజేపీ పెద్దలతో సమావేశంలో చర్చలు జరిపాకే తదుపరి

మిగతా 2వ పేజీలో...

తొలి రోజే 'అదానీ' రచ్చ

లంచాల వ్యవహారంపై అట్టుడికిన పార్లమెంటు ఉభయ సభలు

జేపీసీ, చర్చకు విపక్షాల పట్టు.. 2 సభలు రేపటికి వాయిదా

2

గుప్పెడుమంది అరాచకం.. పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడమే వారి లక్ష్యం.. ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ధ్వజం


ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించండి

భారతీయ కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని నేటితరం తెలుసుకోవాలి

చాగంటి కోటేశ్వరరావుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వినతి

12

మంత్రి లోకేశ్‌నూ కలిసిన చాగంటి



13 ఏళ్ల కుర్రాడు కోటిగాడు!

1.10 కోట్లతో రాజస్థాన్ సొంతమైన వైభవ్

అత్యధికంగా భువనేశ్వర్‌కు 10.75 కోట్లు

దీపక్ చాహర్‌కు రూ. 9.25 కోట్లు

ముగిసిన ఐపీఎల్ మెగా వేలం

10

'పెర్త్'లో కంగారెత్తించేసి..

తొలి టెస్ట్‌లో ఆసీస్‌పై భారత్ ఘన విజయం



14

రామ్‌గోపాల్ వర్మ పరారీ!

సోషల్ మీడియాలో పోస్టులపై కేసు

అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి.. ఫోన్ స్విచ్చాఫ్

రెండోసారీ విచారణకు రాకపోవడంతో హైదరాబాద్‌లోని నివాసానికి పోలీసులు

పోలీసులతో వర్మ న్యాయవాది గొడవ

ఇంటికి ఎందుకు వచ్చారని నిలదీత

వర్చువల్‌గా విచారించాలని మెసేజ్

కోయంబత్తూరులో ఉన్నట్టు సమాచారం

ఏం చేసినా స్కామే!

జగన్ జమానాలో అంతా 'నాకేంటి' లెక్కలే

ముడుపులిచ్చిన వ్యాపారవేత్తలకు రెడ్‌కార్పెట్

డీల్ సెట్ అయితే చాలు నిబంధనలేవీ ఉండవు

వేల కోట్ల టెండర్లు అప్పనంగా అప్పగించేయడమే

పోర్టుల నుంచి విద్యుత్తు మీటర్ల వరకు అదే లెక్క

నష్టాల్లో ఉన్న సంస్థలకు పిలిచి మరీ పనులు

అదానీ వ్యవహారం బయటపడటంతో ప్రజల్లో పలు అనుమానాలు

నాటి సర్కార్‌లో కాంట్రాక్టులన్నింటిపై విచారణ జరపాలని డిమాండ్



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రివర్స్ టెండరింగ్ పేరిట కాంట్రాక్టర్లను మార్చేయడం... మద్యం విధానం... ఇసుక పాలసీ... స్మార్ట్ మీటర్ల టెండర్లు... బైజూస్ ట్యాబ్‌లు... తాజాగా 'సెకీ'తో ఒప్పందం పేరిట అదానీ నుంచి సోలార్ విద్యుత్ కొనుగోలు! అన్నీ వివాదాస్పదమే... అన్నింటా 'ఆర్థిక' ఆరోపణలే! వెరసి... ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాల్లో ప్రజా ప్రయోజనం ఎలా ఉన్నా... స్వీయ లాభమే కీలకంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో వివాదాస్పద వ్యాపారవేత్తలకు, ఇంకెక్కడా దిక్కులేని కంపెనీలకు తలుపులు తెరిచి రెడ్ కార్పెట్ పరిచి స్వాగతం పలికారు. ఒప్పందాలు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రజలపై ఎంత భారం పడ్డా లెక్క చేయలేదు. తాజాగా సౌర విద్యుత్ కొనుగోలులో జరిగిన ముడుపుల బాగోతం అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ (సెక్), దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ విచారణలో

మిగతా 13వ పేజీలో...



13

జగన్ ముడుపులపై సీబీఐ దర్యాప్తు జరపాలి

అదానీతో ఒప్పందాలను రద్దు చేయాలి

లంచాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు షర్మిల లేఖ

అదానీ.. వంద కోట్లు వద్దు!

ఆ డబ్బులను బదిలీ చేయవద్దని లేఖ రాశాం

స్కిల్ వర్సిటీ వివాదాస్పదం కావడం ఇష్టంలేకే

వివాదాల్లోకి సర్కారును లాగొద్దు: టీ-సీఎం రేవంత్

2

పర్యాటకాంధ్ర

టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషి

రాష్ట్రంలో పర్యాటకానికి అద్భుత అవకాశాలు

ఏటా పది శాతం వృద్ధికి చాన్స్

ఎకో టూరిజానికి ప్రత్యేక కార్పొరేషన్

ఆలయాల పవిత్రతను కాపాడేందుకు చర్యలు

డ్రెస్‌కోడ్‌పై భక్తులకు అవగాహన కల్పించాలి

హెరిటేజ్ ప్రాంతాలను గత పాలకులు తవ్వేశారు

వాటిని గుర్తించి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది

రాష్ట్రంలో పర్యాటకుల భద్రత చాలా ముఖ్యం



ఆలయ, పర్యావరణ, సాహస, చారిత్రక పర్యాటకంపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, ఏపీని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని చెప్పారు. ఏటా పది శాతం అభివృద్ధికి అవకాశం ఉన్న పర్యాటక రంగాన్ని సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో

మిగతా 14వ పేజీలో...



13

'సెకీ' ఒప్పందంపై నేను సంతకం పెట్టలేదు

నా డిజిటల్ సంతకం వాళ్లే పెట్టేశారేమో

'విద్యుత్' బాంబు పేల్చిన బాలినేని

ఆ ఒప్పందంతో నాకు సంబంధమే లేదు

మంత్రినైన నాతో జగన్ ఎప్పుడూ చర్చించలేదు

నాడు విద్యుత్ శాఖను నడిపింది సీఎంవోనే

ఎన్నికలకు ముందే వైసీపీని వీడుదామనుకున్నా

చంద్రబాబుతోనూ మాట్లాడా.. రమ్మన్నారు

నా రాత బాగోక అప్పుడు పార్టీ మారలేదు

'ఆంధ్రజ్యోతి'తో మాజీ మంత్రి శ్రీనివాసరెడ్డి

పవర్‌హౌస్

ఇంటింటికీ సోలార్.. సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా రాష్ట్రం



విద్యుత్ శాఖపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేయాలి

రాష్ట్ర పరిస్థితులు సౌర విద్యుత్‌కు అనుకూలం

ప్రతి ఇల్లూ, కార్యాలయంలో సౌర విద్యుదుత్పత్తి

ఇంటిపై విద్యుత్ ఉత్పత్తి వల్ల అదనపు ఆదాయం

పూర్తి సోలారే వినియోగించేలా 132 గ్రామాలు

కుప్పంలో వంద శాతం సౌర విద్యుత్తు పథకం అమలు

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమీక్ష

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సౌర విద్యుదుత్పత్తి కేంద్రం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. సోలరైజేషన్ కార్యక్రమంపై అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో ప్రతి ఇల్లూ.. ప్రతీ కార్యాలయంలో సౌరశక్తిని ఒడిసిపట్టాలన్నారు. సోలార్

మిగతా 13వ పేజీలో...



14

సుప్రీంలో విజయపాల్‌కు ఎదురుదెబ్బ

ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

రఘురామపై కస్టోడియల్ హింస కేసు

తుఫాను గండం!

ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం

28 నాటికి తుఫాన్‌గా మారొచ్చని అంచనా

నేటి నుంచి నెలాఖరు వరకూ వర్షసూచన

3

'ఉపాధి'లో అవినీతికి పాల్పడితే జైలే!

12

రూ.లక్ష కంటే ఎక్కువ నిర్ధారణ అయితే ఎఫ్ఐఆర్

జీవో 52కు విజిలెన్స్ పదును

భవన నిర్మాణ అనుమతులు ఈజీ

13

త్వరలో 'సింగిల్ విండో' విధానం

లే అవుట్లలో రోడ్ల పరిధి తగ్గింపు

40 అడుగుల నుంచి 30కి కుదింపు

కోస్తా రోడ్ల పునర్నిర్మాణం!

ఇందుకోసం 650 కోట్ల నాబార్డు నిధులు.. రహదారులపై సమీక్షలో సీఎం హామీ

రిపేర్‌కూ వీల్లేనంతగా రోడ్ల ధ్వంసం.. 1,447 కిమీ మేర తిరిగి వేయాల్సిందే

మంత్రి జనార్దనరెడ్డి ప్రజెంటేషన్.. సంక్రాంతి నాటికి గుంతల రహితంగా రోడ్లు

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి నిధులతో 13 వేల కిమీ అంతర్గత రోడ్లకు ఓకే

13

తొలి రోజే 'అదానీ' రచ్చ

లంచాల వ్యవహారంపై జేపీసీ, చర్చకు విపక్షాల పట్టు.. అట్టుడికిన పార్లమెంటు



న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజే ఉభయసభల్లో గందరగోళం చెలరేగింది. అదానీ గ్రూపు అధినేత గౌతమ్ అదానీ తదితరులపై అమెరికా కోర్టులో లంచాల అభియోగాలు నమోదైన వ్యవహారంపై చర్చ కోసం, పార్లమెంటరీ సంయుక్త బృందం (జేపీసీ) ఏర్పాటుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సభ్యులు పట్టుబట్టారు. ఇందుకు అధికారపక్షం నిరాకరించడంతో వారు ఆందోళనకు దిగారు. ఉదయం రాజ్యసభ ప్రారంభం కాగానే.. అదానీ ముడుపుల అంశంపై చర్చకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ఇచ్చాయి. వీటిని ఛైర్మన్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ఖర్గేకు మాట్లాడే అవకాశమిచ్చారు. సభ ఎజెండాను సస్పెండ్ చేసి చర్చ చేపట్టాలని ఖర్గే డిమాండ్ చేశారు. అదానీ నిర్వాకంతో ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్ఠ మసకబారిందని.. అయినా ప్రధాని మోదీ ఆయనకు మద్దతిస్తున్నారని విమర్శించారు. ఇదే సమయంలో ఈ అంశంపై కూలంకషంగా చర్చించాలని ఇతర విపక్ష ఎంపీలు నినాదాలు మొదలుపెట్టారు. ఛైర్మన్ చివరకు సభను బుధవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో కూడా అదే గందరగోళం తలెత్తింది. సభ మొదలుకాగానే.. చనిపోయిన సభ్యులకు సంతాపం తెలుపుతూ స్పీకర్ ఓం బిర్లా తీర్మానం చదివారు. వెంటనే కాంగ్రెస్ ఎంపీలు వేణుగోపాల్, హిబీ ఈడెన్, మనీశ్ తివారీ, మాణిక్యం ఠాగూర్ అదానీ లంచాలపై చర్చించాలని, ఈ అంశంపై జేపీసీని వేయాలని డిమాండ్ చేస్తూ ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని కోరారు. సభాపతి అంగీకరించకపోవడంతో నినాదాలు చేశారు. దీంతో ఆయన సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు జేపీసీకి పట్టుబట్టడంతో బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. మంగళవారం పార్లమెంటు భవనంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నారు. భారత రాజ్యాంగం 1949 నవంబరు 26న అమల్లోకి వచ్చి 75 ఏళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఇంకోవైపు.. శీతాకాల సమావేశాల్లో 16 బిల్లులు ప్రవేశపెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కీలకమైనది.

ఏకతాటిపైకి..

ఉభయ సభల భేటీకి ముందు ఇండియా కూటమి నేతలు రాజ్యసభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కార్యాలయంలో సమావేశమయ్యారు. అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలపై చర్చకు ఐక్యంగా పట్టుబట్టాలని నిర్ణయించారు. ఉభయసభలూ వాయిదాపడ్డాక ఎంపీలు వేణుగోపాల్, జైరాం రమేశ్, ప్రమోద్ తివారీ తదితరులు మాట్లాడారు. అదానీపై చర్చకు ప్రభుత్వం భయపడుతోందన్నారు.

మహారాష్ట్ర ఓటమిని జీర్ణించుకోలేకే..

ఉభయసభల కార్యకలాపాలను విపక్షాలు స్తంభింపజేయడంపై బీజేపీ మండిపడింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో ఘోరపరాజయాన్ని జీర్ణించుకోలేక అదానీ అంశాన్ని అడ్డుపెట్టుకుని తమపై దాడిచేస్తున్నాయని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. 'ఎన్నికల్లో పరాజయాలతోమీలో నిరాశానిస్పృహలు ఏర్పడి ఉండొచ్చు. దానికి సభలను అడ్డుకుని ప్రతిఘటిస్తారా' అని ప్రశ్నించారు. విపక్షాల చర్య ప్రజలపై దాడేనని గిరిరాజ్‌సింగ్ ఆరోపించారు.

జేపీసీ గడువు పొడిగించాలి

వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన జేపీసీ కాలపరిమితిని పొడిగించాలని ఈ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ ఓం బిర్లాను కోరారు. బిల్లుపై విస్తృతమైన చర్చ జరగాలంటే కమిటీకి సహేతుకమైన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకే కేంద్రప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చిందని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆరోపించింది.

దావూద్ బెదిరింపులతోనే భారత్‌ను వీడా!

» ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం బెదిరింపులు కారణంగానే దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాల్సి వచ్చిందని ప్రస్తుతం విదేశాల్లో ఉన్న ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ చెప్పారు. ఐపీఎల్ పోటీల్లో మ్యాచ్ ఫిక్సింగ్ చేయించాలని దావూద్ తనపై ఒత్తిడి తెచ్చాడని, అందుకు నిరాకరించడంతో చంపేస్తానని బెదిరించాడని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. చివరకు దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని హెచ్చరించాడని చెప్పారు. తనకు హెచ్చరికలు వచ్చిన విషయం పోలీసులకు కూడా తెలుసన్నారు. హిట్‌లిస్టులో ఉన్నావని, 12 గంటల పాటే రక్షణ ఇవ్వగలమని పోలీసులు చెప్పడంతో వెంటనే ముంబైని వీడాల్సి వచ్చిందని తెలిపారు. తాను అవినీతికి పాల్పడినట్టు ఏ కోర్టులోనూ రుజువు కాలేదన్నారు.


ప్రజలు తిరస్కరించిన గుప్పెడుమంది అరాచకం



పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడమే వారి లక్ష్యం..ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ధ్వజం

న్యూఢిల్లీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు 80-90 సార్లు తిరస్కరించిన గుప్పెడుమంది వ్యక్తులు పార్లమెంటును నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారని, తమ రాజకీయ లబ్ధి కోసం అరాచకానికి పాల్పడుతున్నారని ప్రధాని మోదీ విమర్శించారు. సోమవారం ఉదయం పార్లమెంటు కార్యకలాపాల ప్రారంభానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు పురోగతిలో భాగస్వాములవడం కన్నా, దాని కార్యకలాపాలను అడ్డుకోవడమే ప్రతిపక్ష పార్టీల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని మండిపడ్డారు. 'మన రాజ్యాంగ 75వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. రేపు సంవిధాన్ సదన్‌లో ప్రతి ఒక్కరం రాజ్యాంగ 75వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నాం. మన పార్లమెంటు, మన ఎంపీలు కూడా ఇందులో ముఖ్యమైన భాగమే. పార్లమెంటులో ఆరోగ్యకరమైన చర్చలు ఉండాలి. ఈ చర్చల్లో మరింతమంది భాగస్వాములవ్వాలి. దురదృష్టవశాత్తూ ప్రజల తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు తమ రాజకీయ లబ్ధి కోసం అరాచకానికి పాల్పడటం ద్వారా పార్లమెంటును నియంత్రించేందుకు నిరంతరంగా ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను ప్రజలు గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు తప్పక శిక్షిస్తారు' అన్నారు. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందని, దానికి అనుగుణంగా నడుచుకోవాలని ప్రతిపక్షాలకు మోదీ సూచించారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా సభలో అంశాలను లేవనెత్తాలన్నారు.

లోకం తీరు



హిందూ-ముస్లింల మధ్య విభజనకు అధికార దుర్వినియోగం

» సంభాల్ ఘటనపై రాహుల్ ఆగ్రహం

» నగరంలోకి ఇతరులకు నో ఎంట్రీ



లఖ్‌నవూ, నవంబరు 25: "హిందూ-ముస్లింల మధ్య చిచ్చుపెట్టడానికి, విభేదాలను సృష్టించడానికి బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తోంది" అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. సంభాల్‌లో జామా మసీదు సర్వే సందర్భంగా ఆదివారం చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, ఐదుగురి మృతిపై ఆయన సోమవారం ఎక్స్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీ ప్రభుత్వానిది పూర్తిగా పక్షపాత ధోరణి అని విమర్శించారు. "మసీదు సర్వే విషయంలో ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. అన్నివర్గాలతో ఎందుకు చర్చించలేదు? ప్రభుత్వం భారతదేశాన్ని ఐక్యత వైపు తీసుకెళ్లాలి. మతతత్వాన్ని రెచ్చగొట్టకూడదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు, సంభాల్‌లో మరణాల సంఖ్య ఐదుకు చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరి శరీరాల్లో దేశవాళీ తుపాకీ బుల్లెట్లు లభ్యమయ్యాయన్నారు. హింసాత్మక ఘటనలకు సంబంధించి సంభాల్ ఎంపీ జియా-ఉర్-రెహ్మాన్ బార్క్, సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ మహమూద్ కుమారుడు సోహైల్ ఇక్బాల్‌పైనా కేసులు పెట్టినట్లు చెప్పారు. "మొత్తం ఏడు కేసుల్లో 2,750 మందిని నిందితులుగా చేర్చాం. ఇప్పటి వరకు ఇద్దరు మహిళలు సహా.. 25 మందిని అరెస్టు చేశాం" అని పేర్కొన్నారు. సంభాల్‌లో శాంతిభద్రతల నియంత్రణకు అధికారులు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. ఈ నెల 30 వరకు బయటివారు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలెవరూ సంభాల్‌లోకి అడుగుపెట్టకూడదని నిషేధం విధించారు.

అండమాన్ దీవుల దగ్గర 6 వేల కిలోల డ్రగ్స్ స్వాధీనం

పోర్టుబ్లెయిర్, నవంబరు 25: భారత తీర గస్తీ దళం అండమాన్ దీవుల దగ్గర భారీ ఎత్తున మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుందని సోమవారం అధికారులు వెల్లడించారు. ఆరు టన్నుల(6వేల కిలోల) ఈ మాదక ద్రవ్యాల(కాంట్రాబాండ్ మెథంఫెటమైన్) విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.25000 కోట్లు ఉంటుందని అంచనా. వీటిని ఒక్కోటి రెండేసి కేజీల చొప్పున 3000 ప్యాకెట్లుగా తయారుచేసి తరలిస్తున్నారు. ఈ నెల 23న అండమాన్ దీవుల వద్ద పహరా కాస్తున్న తీర గస్తీ దళం విమానం(డార్నియర్) పైలెట్ బ్యారెన్ దీవి దగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తున్న చేపల వేట ట్రాలర్‌ని గుర్తించారు. వెంటనే ఆ ట్రాలర్‌లో ఉన్నవారిని దాన్ని ఆపాలని హెచ్చరించి, అండమాన్, నికోబార్‌లోని తమ కమాండ్‌కి సమాచారం ఇచ్చారు. దీంతో దగ్గరలో ఉన్న తీర గస్తీదళం పడవలు వేగంగా అక్కడికి చేరుకుని ఆ ట్రాలర్‌ని పోర్ట్‌బ్లెయిర్‌కి తీసుకువచ్చాయి. అందులో ఉన్న ఆరుగురు మయన్మార్ జాతీయులను అరెస్టు చేశారు.

సీఎన్‌జీ ధర కిలోకు రూ.2 పెంపు

న్యూఢిల్లీ, నవంబరు 25: సీఎన్‌జీ వాహనదారులకు గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. సీఎన్‌జీ రిటైల్ ధరను కిలోకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించాయి. ముంబై సహా దేశంలోని పలు నగరాల్లో ఈ పెంపు చేపడుతున్నట్లు తెలిపాయి. అయితే త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఢిల్లీకి మాత్రం ధర పెంపు నుంచి మినహాయింపునిచ్చాయి. నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్‌లలో సీఎన్‌జీ ధరను రూ.2 పెంచుతున్నట్లు ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) ప్రకటించింది. ముంబై సహా పరిసర ప్రాంతాల్లో ధర పెంచుతున్నట్లు మహానగర్ గ్యాస్ లిమిటెడ్ (ఎంజీఎల్), అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ తెలిపాయి.

బ్యాలెట్ పేపర్‌తో మళ్లీ ఎన్నికలు జరపాలి

» మహారాష్ట్ర ఎన్నికలపై ఉద్ధవ్ ఠాక్రే శివసేన డిమాండ్

ముంబై, నవంబరు 25: మహారాష్ట్ర ఎన్నికల్లో పరాజయం తర్వాత ఉద్ధవ్ ఠాక్రే శివసేన పార్టీ కొత్త డిమాండ్ తెరపైకి తెచ్చింది. తాజాగా జరిగిన ఎన్నికల ఫలితాలు నిలిపివేసి బ్యాలెట్ పేపర్‌తో మరోసారి ఎన్నికలు నిర్వహించాలని కోరింది. ఈ డిమాండ్‌పై ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్‌రౌత్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఈవీఎంలపై 450 ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా పోలింగ్ కొనసాగించినందువల్ల ఆ ఎన్నికల ఫలితాలు నిలిపివేసి పేపర్ బ్యాలెట్‌తో మరోసారి నిర్వహించాలని కోరుతున్నామన్నారు. అప్పుడు తామే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల విజయాల్లో బీజేపీ ఓ వ్యూహం ప్రకారం వెళుతోందని, పెద్ద రాష్ట్రాల్లో ఆ పార్టీ గెలుస్తూ, చిన్న రాష్ట్రాలను మాత్రం ప్రతిపక్షాలకు ఇచ్చేస్తోందని రౌత్ ఆరోపించారు.

అదానీ.. వంద కోట్లు వద్దు!

» ఆ డబ్బులను బదిలీ చేయవద్దని లేఖ రాశాం

» తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): "ఒక సదుద్దేశంతో ప్రారంభించిన స్కిల్స్ యూనివర్సిటీ వివాదాస్పదం కావడం మాకు ఇష్టం లేదు. అందుకే అదానీ సంస్థ నుంచి రూ.100 కోట్లు స్వీకరించకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మొత్తాన్ని తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేయవద్దని విస్పష్టంగా పేర్కొంటూ అదానీ సంస్థకు పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ లేఖ రాశారు' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అదానీ విషయంలో పక్క దేశాలు, రాష్ట్రాల్లో జరుగుతున్న వివాదానికి, తెలంగాణకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. ఈ వివాదాల్లోకి అనవసరంగా తమను, తమ ప్రభుత్వాన్ని లాగవద్దని కోరారు. సోమవారమిక్కడ తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న స్కిల్స్ వర్సిటీకి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులు ఇచ్చేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయని, అందులో భాగంగా అదానీ సంస్థ కూడా ముందుకు వచ్చిందని తెలిపారు. 'ఆ వంద కోట్లు ఏదో మాకు అప్పనంగా ఇస్తున్నట్లు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారు. స్కిల్స్ వర్సిటీకి అదానీ సహా ఏ సంస్థ నుంచి కూడా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకూ రూపాయి కూడా తీసుకోలేదు. తెలంగాణ ప్రతిష్ఠపైనా.. వ్యక్తిగతంగా నాపైనా అనవసరమైన చర్చ జరగడం నాకు, మంత్రులకు ఇష్టం లేదు. అందుకే, ఆ నిధులు తీసుకోవడానికి సిద్ధంగా లేమంటూ లేఖ రాయించాం' అని వివరించారు. అదానీతో విమానాల్లో ఆడంబరంగా తిరిగింది బీఆర్ఎస్ నాయకులేనన్నారు. ఆయనతో కలిసి కేసీఆర్, కేటీఆర్ దిగిన ఫొటోలనూ ప్రదర్శించారు. కేసీఆర్ వంగి వంగి దండాలు పెట్టారని ఆ ఫొటో చూపిస్తూ విమర్శించారు. అదానీతో అన్ని ఒప్పందాలు చేసుకుని కమీషన్లు మెక్కినవారు.. రాష్ట్ర ప్రయోజనం కోసం స్కిల్ వర్సిటీకి వంద కోట్లు తీసుకుంటే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

కొన్ని వర్గాలకే భూకేటాయింపు రాజ్యాంగ వ్యతిరేకం

» న్యాయమూర్తులు, అధికారులు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ సర్కారు ఇచ్చిన జీవోల్ని రద్దు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రజా ప్రతినిధులు, అఖిల భారత సర్వీసు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాజ్యాంగ కోర్టుల న్యాయమూర్తులు, జర్నలిస్టులను ప్రత్యేక వర్గంగా భావిస్తూ ఇళ్ల స్థలాల కోసం భూమి కేటాయించడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఈ వర్గీకరణకు వీలు కల్పించిన 2005 నాటి జీవో(243, 244)లనే కాక, భూమి కేటాయించేందుకు 2008లో జారీ చేసిన జీవోలు 419, 420, 422 నుంచి 425లను కూడా రద్దు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన సుప్రీం ధర్మాసనం సోమవారం అంతిమ తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కింద సమానత్వ హక్కును ఈ కేటాయింపులు ఉల్లంఘించాయని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు నేపథ్యంలో భూమి కేటాయింపులకోసం ఏర్పడిన సహకార సంఘాలు, వాటి సభ్యులకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము సహా డిపాజిట్ చేసిన మొత్తం డబ్బునూ తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తంపై ఏ మేరకు వడ్డీ చెల్లించాలో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించాలని, అయితే ఆ మొత్తం ఎప్పటికప్పుడు రిజర్వు బ్యాంకు నిర్ణయించే వడ్డీ రేట్లకు మించరాదని తేల్చింది. సహకార సంఘాలు, వాటి సభ్యులతో తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న లీజు ఒప్పందాలు కూడా రద్దయినట్లేనని ప్రకటించింది. సహకార సంఘాలు, సభ్యులు చెల్లించిన డెవలప్‌మెంట్ చార్జీలు, ఖర్చులను కూడా ఆదాయ పన్ను రిటర్నుల్లో సర్దిపై చేసిన తర్వాత తిరిగి చెల్లించాలని తమ తీర్పులో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం తాము వెనక్కు తీసుకున్న భూమిని ఏమి చేయాలో నిర్ణయించుకోవాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. భూకేటాయింపులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం, సహకార సంఘాలు, వాటి సభ్యులు దాఖలు చేసుకున్న అన్ని పిటిషన్లనూ తోసిపుచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలో వివిధ వర్గాలకు చెందిన వారికి భూకేటాయింపులపై విధివిధానాలను నిర్ణయిస్తూ 2010లో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వివిధ వర్గాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ అంతిమ తీర్పు వెలువరించింది.

ఇమ్రాన్‌ఖాన్ విడుదలకు ఇస్లామాబాద్ ముట్టడి



ఇస్లామాబాద్, నవంబరు 25: జైల్లో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను వెంటనే విడుదల చేయాలంటూ ఆయన మద్దతుదారులు సోమవారం ఇస్లామాబాద్ ముట్టడికి యత్నించారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి అలీ అమీన్ గండాపూర్, ఇమ్రాన్ భార్య బుష్రా బీబీ నేతృత్వంలో పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) ఆందోళనకారులు ఇస్లామాబాద్ వైపు దూసుకురావడంతో పోలీసులు మార్గాలన్నీ మూసేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా చెలరేగిన అల్లర్లలో ఓ పోలీసు మృతి చెందగా పలువురు ఆందోళనకారులు గాయపడ్డారు.

'పీఠ' ముడి

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. 288 స్థానాలకుగాను 132 చోట్ల గెలుపొందడంతో ఈసారి బీజేపీ సీఎం ఉండాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నాయి. ఫడణవీస్‌నే సీఎం చేస్తారని, శిందే, అజిత్ పవార్‌లను డిప్యూటీ సీఎంలుగా చేస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే ఫడణవీస్ బ్రాహ్మణ వర్గానికి చెందిన నేత కావడంతో అధిష్ఠానం ఓబీసీ, లేదా దళిత నేపథ్యం ఉన్న నేత కోసం చూస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఎన్నికల్లో శివసేన 57 చోట్ల మాత్రమే నెగ్గినా తన నేతృత్వంలో కూటమి ఘన విజయం సాధించడంతో తనను సీఎంగా కొనసాగించాలని శిందే పట్టుబడుతున్నట్లు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటం, మరాఠా నేపథ్యం శిందేకు కలిసివచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఈ ఎన్నికల్లో 41 చోట్ల గెలిచిన ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ప్రస్తుత తరుణంలో ఫడణవీస్‌కు మద్దతీయాలని నిర్ణయించుకున్నారు. అయితే దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే చెరి రెండున్నరేళ్లు సీఎంగా కొనసాగే అవకాశముందనే ప్రచారం కూడా జరుగుతోంది. బీజేపీకి 21, శివసేనకు 12, ఎన్సీపీకి 10 మంత్రిత్వ శాఖలు ఇవ్వాలని నిర్ణయం జరిగినట్లు సమాచారం.

అసెంబ్లీ గడువు తీరిపోయేది నేడే

మహారాష్ట్రలో ప్రస్తుత 14వ అసెంబ్లీకి నేటితో గడువు తీరిపోనుంది. దీంతో నేడు ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోతే రాష్ట్రపతి పాలన విధిస్తారని ప్రచారం జరిగింది. అయితే ఈ నెల 23న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రావడంతో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను ఎన్నికల సంఘం అధికారులు ఈ నెల 24న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు అందజేశారు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం 73వ సెక్షన్ ప్రకారం 15 అసెంబ్లీ ప్రారంభమైనట్లేనని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. దీని ప్రకారం ఇక రాష్ట్రపతి పాలన ఉండకపోవచ్చని సమాచారం. ఢిల్లీలో జరుగుతున్న మంతనాలు కొలిక్కి వచ్చి, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మరో మూడు, నాలుగు రోజుల సమయం పట్టవచ్చని తెలుస్తోంది.

పాన్ 2.0.. ఎయిమ్ 2.0

క్యూఆర్ కోడ్‌లతో పాన్ కార్డుల ఆధునికీకరణ.. 2028 దాకా అటల్ ఇన్నోవేషన్ మిషన్ పొడిగింపు

» రూ.2,481 కోట్లతో ప్రకృతి వ్యవసాయానికి ఊతం

» కీలక నిర్ణయాలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం



కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, నవంబరు 25: దేశవ్యాప్తంగా కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించేందుకుగాను.. రూ.2,481 కోట్ల విలువైన జాతీయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్)కు ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1,435 కోట్లతో చేపట్టనున్న 'పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) 2.0' ప్రాజెక్టుకు కూడా పచ్చజెండా ఊపింది. స్టార్టప్‌లకు ఊతమిచ్చేందుకు ప్రారంభించిన అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఎయిమ్)ను 2028 మార్చి 31 దాకా పొడిగిస్తూ రూ.2750 కోట్లతో ప్రతిపాదించిన 'ఎయిమ్ 2.0'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' పథకానికి ఆమోదముద్ర వేసింది. క్యాబినెట్ భేటీ అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడారు. మంత్రిమండలి తీసుకున్న పలు కీలక నిర్ణయాల గురించి వివరించారు. పాన్ 2.0 ప్రాజెక్టు కింద ఇప్పటికే జారీచేసిన పాన్‌కార్డులను క్యూఆర్ కోడ్‌తో ఉచితంగా అప్‌గ్రేడ్ చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. పాన్‌ను 'కామన్ బిజినెస్ ఐడెంటిఫయర్'గా చేసేందుకు కేంద్రం ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇక, ఎయిమ్ 2.0తో.. మెరుగైన ఉద్యోగాలు, సృజనాత్మక ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పరిశ్రమ వర్గాల అంచనా. అలాగే, ఈ పథకం కింద 30 ప్రాంతీయ నవకల్పన కేంద్రాలను, 'లాంగ్వేజ్ ఇంక్లూజివ్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇన్నోవేషన్ (లిపి)'లను ఏర్పాటు చేయనున్నారు. 2500 అటల్ టింకరింగ్ ల్యాబులను ఏర్పాటు చేస్తారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన జాతీయ మిషన్ విషయానికి వస్తే.. భూసారాన్ని మెరుగుపరచాల్సిన అవసరం, రసాయనాలు లేని ఆహారం అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తించి ఈ మిషన్‌కు ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా 15 వేల క్లస్టర్లలో 7.5 లక్షల హెక్టార్లలో ఈ మిషన్ కింద రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తారు. రైతులకు ఉపయోగపడే జీవామృతం, బీజామృతం వంటి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు 10 వేల బయో ఇన్‌పుట్ రీసోర్స్ సెంటర్ల (బీఆర్సీల)ను ఏర్పాటు చేస్తారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి 2000 నమూనా సాగు భూములను కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ వర్సిటీలు, రైతుల పొలాల్లో ఏర్పాటు చేస్తారు. ఆసక్తి ఉన్న రైతులకు.. ప్రకృతి వ్యవసాయంలో అనుభవజ్ఞులైన రైతులు, శిక్షకుల ద్వారా అక్కడ శిక్షణ ఇప్పిస్తారు. బీఆర్సీలకు జీవామృతం, బీజామృతం వంటివి అందించడానికి 18.75 లక్షల మందికి ఔత్సాహిక రైతులకు శిక్షణ ఇస్తారు. రైతుల్లో అవగాహన కల్పించేందుకు 30 వేల మంది కృషి సఖులను నియమిస్తారు. ఇక.. 2025, 2026, 2027 సంవత్సరాలకుగాను రూ.6000 కోట్లతో ప్రతిపాదించిన 'ఒకదేశం-ఒకే సబ్‌స్క్రిప్షన్' పథకంలో భాగంగా.. కేంద్రం జాతీయ, అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమయ్యే పరిశోధన వ్యాసాలను మన దేశంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఉన్నత విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు అందుబాటులోకి తెస్తారు. ప్రఖ్యాతిగాంచిన 30 అతి పెద్ద అంతర్జాతీయ జర్నల్ ప్రచురణకర్తలను కేంద్రం ఈ పథకంలో భాగం చేసింది. ఆయా పబ్లిషర్లు ప్రచురించిన 13 వేలకు పైగా ఈ-జర్నళ్లను కేంద్ర ప్రభుత్వ, పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన 6,300కు పైగా ఉన్నత విద్యాసంస్థల్లో అందుబాటులోకి తేనుంది.

పీఠికకు బాసట

సామ్య, లౌకిక వాదాల చేర్పు సరైనదే



» రాజ్యాంగ అవతారికను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది

» మళ్లీ విచారణ అవసరం లేదు: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 25: దేశంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్న తరుణంలో సుప్రీంకోర్టు సోమవారం 'పీఠిక'కు సంబంధించి కీలక తీర్పును వెలువరించింది. 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన అంశాలకు ఆమోదం తెలిపింది. రాజ్యాంగం అవతారికలో 'సామ్యవాదం', 'లౌకికవాదం', 'సమగ్రత' అన్న పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ అంశంపై విచారణ జరపాల్సిన పనిలేదని విస్పష్టంగా తెలిపింది. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, అత్యయిక పరిస్థితి అమల్లో ఉన్న సమయంలో రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో ఈ పదాలను అదనంగా చేర్చారు. దీన్ని సవాలు చేస్తూ తొలిసారిగా 2020లో బలరాం సింగ్ అనే వ్యక్తి న్యాయవాది విష్ణుకుమార్ జైన్ ద్వారా పిటిషన్ వేశారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యుడు, బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి, న్యాయవాది, బీజేపీ నాయకుడు అశ్విన్ కుమార్ ఉపాధ్యాయలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పి.వి. సంజయ్ కుమార్‌ల ధర్మాసనం శుక్రవారం తీర్పును వాయిదా వేసింది. సోమవారం సీజేఐ జస్టిస్ ఖన్నా తీర్పును వెలువరిస్తూ "ఈ విషయమై మరింత లోతుగా విచారణలు, తీర్పులు అవసరం లేదు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారం పీఠికకు కూడా వర్తిస్తుంది" అంటూ స్పష్టత ఇచ్చారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీ సవరణలు చేసేందుకు అడ్డంకి కాబోదని ధర్మాసనం తెలిపింది. ఆ తేదీ సవరణలు చేసేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారాలను తగ్గించలేదని పేర్కొంది. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని తెలిపింది. రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న ఆమోదించగా అనంతరం ఎప్పుడో 1976లో పీఠికను సవరించి 'సామ్యవాదం', 'లౌకికవాదం' అన్న పదాలను ఎలా చేర్చుతారంటూ సుబ్రహ్మణ్యస్వామి ప్రశ్నించారు. అలా చేర్చడం ద్వారా మొదటి నుంచే ఈ భావనలు అమల్లో ఉన్నట్లైందని అభ్యంతరం చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పష్టతనిస్తూ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తేదీ సవరణలకు అడ్డంకి కాబోదని తెలిపింది. "రాజ్యాంగ సవరణకు 368 అధికరణం ద్వారా పార్లమెంటుకు సంక్రమించిన అధికారం నిర్వివాదమైనది. ఆ అధికారాన్ని ఇప్పుడు సవాలు చేయలేదు" అని పేర్కొంది.

సమానత్వ భావనకు మరో రూపం

పిటిషనర్లు ప్రధానంగా అభ్యంతరం తెలిపిన 'సామ్యవాదం', 'లౌకికవాదం' అన్న పదాల చేర్పుపై ధర్మాసనం వివరణ ఇచ్చింది. ఇది రాజ్యాంగం మౌలిక సూత్రమైన 'సమానత్వం' అన్న భావనను మరో రూపంలో చెప్పడమేనని స్పష్టం చేసింది. రాజ్యం 'లౌకికవాద' తరహాలో నడుస్తోందంటే దానర్థం మతంలోని లోపాలను కూడా అంగీకరిస్తున్నట్టు కాదని తెలిపింది. "విశాల ప్రజా ప్రయోజనాలు, సమానత్వ హక్కులకు అడ్డంకిగా మారిన మత విశ్వాసాలు, విధానాలను తొలగించేందుకు 'లౌకికవాదం' అవరోధంగా మారబోదు" అని పేర్కొంది. లౌకికవాద భావనను దేశ పరిస్థితులకు అనుగుణంగానే అర్థం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది.

భారతీయ నేపథ్యంలోనే భాష్యం

'సామ్యవాదం' అన్న భావనకు కూడా భారత దేశ నేపథ్యంలోనే భాష్యం చెప్పాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్థిక విధానాలకు అడ్డంకి అని భావించకూడదని తెలిపింది. "రాజ్యాంగంగానీ, పీఠికగానీ ఏదో ప్రత్యేక ఆర్థిక విధానాన్ని అనుసరించాలని ఎక్కడా చెప్పలేదు. 'సామ్యవాదం' అంటే 'సంక్షేమ రాజ్యా'నికి కట్టుబడి ఉండడం. సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం. 'సామ్యవాదం' అనే పదం ఆర్థిక, సామాజిక ఉన్నతి కోసం పెట్టుకున్న లక్ష్యాలను ప్రతిబింబించేది. అంతేతప్ప ప్రయివేటు రంగాన్ని, వ్యాపార, వాణిజ్యాలు చేసుకునే హక్కును నియంత్రించేది మాత్రం కాదు" అని వివరణ ఇచ్చింది. అయినా 42వ రాజ్యాంగ సవరణ జరిగి 44 ఏళ్లు గడవగా (పిటిషన్ దాఖలు చేసిన 2020నాటికి) ఇప్పుడు ఈ సమస్యను ఎందుకు లేవనెత్తారంటూ పిటిషనర్ల ఉద్దేశాలను ప్రశ్నించింది. "ఈ రెండు పదాలను చేర్చడం వల్ల ఎన్నికైన ప్రభుత్వాలు అనుసరించిన విధానాలకు గానీ, చట్టాలకుగానీ ఆటంకం కలగలేదు. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ హక్కులు, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగించలేదు. ఈ పదాలకు ప్రజామోదం లభించింది" అని పేర్కొంది. తగిన చట్టబద్ధమైన కారణాన్ని చూపకుండా, అస్పష్టంగా ఉన్న ఈ పిటిషన్లను కొట్టివేస్తున్నట్టు ప్రకటించింది.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ సందీప్ మెహతా

శ్రీవారి సేవలో జస్టిస్ సందీప్ మెహతా

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారిని దర్శించుకుని రంగనాయకమండపానికి చేరుకున్న ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

పేదల సంక్షేమాన్ని కాంక్షించిన మహారాజు పీవీజీ

- ఆ పురస్కారాన్ని అందుకోవడం గౌరవంగా భావిస్తున్నా
- ట్రావెన్ కోర్ మహారాణి అశ్వతి తిరుణల్ గౌరీ లక్ష్మీబాయి



ట్రావెన్‌కోర్ మహారాణి అశ్వతి తిరుణల్ గౌరీ లక్ష్మీబాయికి పీవీజీ రాజు ఆధ్యాత్మిక పురస్కారాన్ని అందజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, జస్టిస్ సోమయాజులు, గజల్ శ్రీనివాస్ తదితరులు

విశాఖపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన గొప్ప వ్యక్తి, మనసున్న మహారాజు డాక్టర్ పీవీజీ రాజు అని ట్రావెన్‌కోర్ మహారాణి, కవయిత్రి, పద్మశ్రీ డాక్టర్ అశ్వతి తిరుణల్ గౌరీ లక్ష్మీబాయి పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో సోమవారం ఆంధ్ర సారస్వత పరిషత్, మాన్సాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహారాజా డాక్టర్ పీవీజీ రాజు శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీవీజీ రాజు ఆధ్యాత్మిక పురస్కారాన్ని డాక్టర్ గౌరీ లక్ష్మీబాయికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవీజీ రాజు తొలి పురస్కారాన్ని తనకు ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నానని, ఈ అవార్డును పద్మనాభస్వామి పాదాలకు సమర్పిస్తున్నానని చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ...'నువ్వు ఆలోచించి కరెక్ట్ అనుకున్నది చేయ్యి. ఎవరేమనుకుంటారోనని పట్టించుకోవద్దు' అని తన తండ్రి చెప్పారని, ఆ మాటను ఇప్పటికీ అనుసరిస్తున్నానని తెలిపారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు మాట్లాడుతూ విలువలతో కూడిన జీవనాన్ని తుది వరకు గడపడంతోపాటు, ప్రజల అభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తి పీవీజీ రాజు అని కొనియాడారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఛైర్మన్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీవీజీ రాజుకు పద్మవిభూషణ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గత ఐదేళ్లలో ఆలయాల విధ్వంసం!

- బాబర్ కూడా అలా చేయలేదు
- మళ్లీ ఆ పరిస్థితులు రాకుండా చూసుకోవాలి: అశోక్‌గజపతిరాజు

విశాఖపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల అనేక ఇబ్బందులు పడ్డామని, మరోసారి అటువంటి పరిస్థితులు రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు పేర్కొన్నారు. సోమవారం ఆంధ్ర యూనివర్సిటీ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పాలకుల హయాంలో ఉత్తరాంధ్రలోని రెండు ప్రముఖ దేవాలయాలను ధ్వంసం చేశారని చెప్పారు. వాటిలో ఒకటి పోలిపల్లి గ్రామంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం, రెండోది రామతీర్థంలోని శ్రీరాములవారి ఆలయమని వివరించారు. బాబర్ కూడా ఇలా ఆలయాలను ధ్వంసం చేయలేదన్నారు.

తుఫాను గండం..!

ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం

- నేటికల్లా తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం
- 28వ తేదీ నాటికి తుఫాన్‌గా మారొచ్చని అంచనా
- శ్రీలంక వద్ద తీరం దాటి మళ్లీ నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశం
- 29 లేదా 30న చెన్నై సమీపంలో తీరం దాటే చాన్స్
- నేటి నుంచి నెలాఖరు వరకూ వర్షసూచన
- వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి: వాతావరణ శాఖ

విశాఖపట్నం, అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోస్తాంధ్రకు మరో తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం సోమవారం ఉదయానికి అదే ప్రాంతంలో వాయుగుండంగా బలపడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని హిందూ మహా సముద్రంలోకి ప్రవేశించింది. సోమవారం మధ్యాహ్నానికి తమిళనాడులోని నాగపట్నానికి 810 కి.మీ. ఆగ్నేయంగా, చెన్నైకు 1,000 కి.మీ. దక్షిణ ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. వాయుగుండం మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. తర్వాత రెండు రోజుల్లో ఉత్తర వాయవ్యంగా పయనించి శ్రీలంక, తమిళనాడు తీరాలకు సమీపంగా వస్తుందని, ఈ క్రమంలో 28 నాటికి తుఫాన్‌గా మారుతుందని కొన్ని మోడళ్లు అంచనా వేస్తున్నాయి. తుఫాన్‌గా శ్రీలంక వద్ద తీరం దాటి తిరిగి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అనంతరం ఉత్తరంగా పయనించి వాయుగుండం లేదా తీవ్ర వాయుగుండంగా బలహీనపడి ఈ నెల 29వ తేదీ రాత్రి లేదా 30వ తేదీ తెల్లవారుజామున చెన్నైకు దక్షిణాన తీరం దాటుతుందని పేర్కొంటున్నారు. ఐరోపాకు చెందిన మోడల్, భారత వాతావరణ శాఖకు చెందిన మోడల్, మరో మోడల్ అంచనా మేరకు తీవ్ర వాయుగుండం/వాయుగుండం చెన్నై, పుదుచ్చేరి మధ్య తీరం దాటనుంది. అయితే తీరం దాటే పాయింట్ ఎక్కడ, ఏ సమయంలో.. అన్నదానిపై స్పష్టత లేదు.

ఉత్తరాంధ్రకు భారీ వర్షసూచన

వాయుగుండం ప్రభావంతో బంగాళాఖాతంలో తేమ మేఘాలు ఆవరించాయి. దీంతో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సోమవారం ఒకటి, రెండుచోట్ల వర్షాలు కురిశాయి. మంగళవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయి. ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం నెలకొంటుంది. ఈ నెల 27, 28 తేదీల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, ఉత్తర కోస్తాలో చెదురుమదురుగా వర్షాలు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురుస్తాయి. 29న కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఈ నెల 30, డిసెంబరు ఒకటో తేదీన కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపింది. వాయుగుండం నేపథ్యంలో కోస్తాంధ్రలోని ప్రధాన ఓడరేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మంగళ, బుధ వారాల్లో దక్షిణకోస్తా తీరంలో గంటకు 50 నుంచి 75 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. దక్షిణ కోస్తా జిల్లాల్లో మంగళవారం తర్వాత వరి కోతలు నిలిపివేయాలని సూచించింది. కోసిన, నూర్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని కోరింది. ఉద్యాన తోటల్లో చెట్లు పడిపోకుండా బాదులతో ఊతం అందించాలని, పల్లపు పొలాల్లో నీరు నిలబడకుండా వాతులు చేసుకోవాలని సూచించింది.

మోదీ విశాఖ పర్యటన వాయిదా

న్యూఢిల్లీ/విశాఖపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం పర్యటన వాయిదా పడింది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం ప్రధాని కార్యాలయం నుంచి విశాఖపట్నం జిల్లా అధికారులకు సమాచారం వచ్చింది. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసేందుకు ఈ నెల 29వ తేదీన ప్రధాని విశాఖకు రావాల్సి ఉంది. ఈ సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా ప్రారంభించారు. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఈ నెల 28వ తేదీ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ సమాచారాన్ని జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రధాని కార్యాలయానికి అందించింది. దీంతో పర్యటనను తాత్కాలికంగా వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు ఉంటుందనేది తెలియరాలేదు.

నేడు 75వ రాజ్యాంగ దినోత్సవం

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఉత్తర్వులు

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి ఈ నెల 26 నాటికి 75 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ రాజకీయ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వేడుకల్లో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడంతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న అందరితో రాజ్యాంగ పీఠికను చదివించాలని సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు జరిగే రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు, అధికారులు పాల్గొంటారు. జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో 75వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలను జిల్లా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఘనంగా నిర్వహించనున్నారు.

జనవరి 10 నుంచి 19 వరకు

వైకుంఠద్వార దర్శనాలు

- ఏర్పాట్లపై సమీక్షించిన టీటీడీ అదనపు ఈవో

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించిన ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సోమవారం అధికారులతో సమీక్షించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో వివిధ విభాగాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి కావడంతో ఆ రోజు నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలను భక్తులకు కల్పించనున్నారు. ఈ పదిరోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు (స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా) చేసినట్టు అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. అలాగే, చంటిబిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, డిఫెన్స్, ఎన్ఆర్ఐ దర్శనాలతో పాటు ఆర్జితసేవలు రద్దు చేస్తున్నట్టు చెప్పారు. ఆ రోజుల్లో వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అన్నప్రసాదాల వితరణ చేయాలని అధికారులకు సూచించారు. వైకుంఠ ద్వార దర్శనాల్లో సాధారణ భక్తులకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సాధారణ భక్తులకు ఎక్కువ దర్శన సమయం కల్పించేలా జారీ చేయాల్సిన టికెట్ల కోటా, ఇతర అంశాలపై మరో రెండు వారాల్లో ఇంకోసారి సమీక్షిస్తామన్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జయాపజయాలు

మహారాష్ట్రలో మహాయుతి విజయాన్నే జాతీయ మీడియా కీర్తిస్తున్నదని, జార్ఖండ్‌లో హేమంత్ సోరేన్ ఘనవిజయం దానికి పట్టడం లేదని కాంగ్రెస్ నాయకులకు కోపం. ఎవరే రాష్ట్రాన్ని ఏలుతున్నారో, వారే అక్కడ గెలిచారు తప్ప మహారాష్ట్ర విజయంలో వేరు ఘనత ఏమిటని వారి ప్రశ్న. ఎన్నికలు జరిగిన రెండు రాష్ట్రాల్లో మహారాష్ట్ర అసెంబ్లీ స్థానాల రీత్యా కూడా పెద్దది కనుక దానికి మీడియాలో అధిక గుర్తింపు దక్కినమాట నిజం. దేశ ఆర్థిక రాజధాని ఉన్నందునా, దేశ రాజకీయాలకు వనరులు సమకూర్చ గలిగే సమర్థత ఉండటంతోనూ, అనేక వరుస రాజకీయ విన్యాసాలకు, పరిణామాలకు కేంద్రం కావడంతోనూ మహారాష్ట్ర మీద ఎక్కువ దృష్టి ఉండటం సహజం. మీడియా ఇంతగా దృష్టిపెట్టినప్పటికీ మహాయుతి ఘనవిజయాన్ని ఎందుకోగానీ అది ముందుగా పసిగట్టలేకపోయింది. పార్లమెంట్ ఎన్నికలు జరిగి ఇంకా ఆర్నెల్లు కూడా కాలేదు, అప్పట్లో 48 స్థానాల్లో ముప్పై మూటగట్టి మహా వికాస్ అగాడీకి ఇచ్చిన జనం, ఇప్పుడు ఆ కూటమిని ఇంతలా ముంచేస్తారని ఊహించలేకపోయింది. పోటీచేసిన 17 ఎంపీ స్థానాల్లో పదమూడింటిని అప్పట్లో గెలుచుకోగలిగిన కాంగ్రెస్ సహా అగాడీ పార్టీలన్నీ ఈ పరాభవాన్ని లోతుగా సమీక్షించుకోక తప్పదు.

అగాడీకి ఆయుష్షు తీరినట్టేనని, సమీప భవిష్యత్తులో అది కోలుకోదని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఏక్‌నాథ్ శిందేలను సృష్టిస్తాం, మిమ్మల్ని కూల్చేస్తాం అని వెన్నుపోట్లకూ, చీలికలకూ ఒక నిలువెత్తు నిదర్శనంగా, ఆయుధంగా విపక్షపాలిత రాష్ట్రాల్లో బీజేపీ నాయకులకు ఉపకరించే ఓ వ్యక్తి ఇంత అద్భుతం చేస్తాడని ఎవరూ అనుకోలేదు. దశాబ్దాలుగా మహారాష్ట్రను ఏలిన రెండు రాజకీయ కుటుంబాలనుంచి చీలివచ్చినవారిని ముందుబెట్టి బీజేపీ నెరపిన ఈ రాజకీయాన్ని ప్రజలు ఒప్పుకుంటారనుకోలేదు. అధికార పక్షంలోనూ, విపక్షంలోనూ ఒక ఎన్సీపీ, ఒక శివసేన ఉన్నప్పుడు ఆయా పార్టీల వ్యవస్థాపకులో, వారి వారసులో ఉన్నవైపు ప్రజలుంటారని అనుకుంటాం తప్ప, వారిని దెబ్బకొట్టివచ్చినవారికి బ్రహ్మరథం పడతారని ఎలా అనుకుంటాం? విశ్లేషకులకు అర్థంకాని చిక్కుప్రశ్నలివి. నేరుగా సేన వర్సెస్ సేన యుద్ధం జరిగిన స్థానాల్లో, ఏక్‌నాథ్ శిందే డెబ్బయ్‌శాతం నెగ్గుకొస్తే, బాల్‌థాకరే పుత్రరత్నం రన్‌రేట్ ఇరవైఐదు కూడా లేదు. ఉద్ధవ్ ఠాక్రే, శరద్‌పవార్ పక్షాన ఉన్న వారిని భయపెట్టి, బెదిరించి బీజేపీ తమవైపు తిప్పుకున్నదనీ, ఈ కూటమికి కండబలం, అర్థబలం తప్ప ప్రజాబలం లేదన్న వాదనలను ఈ ఫలితాలు వమ్ముచేశాయి. వ్యూహం ఫలించింది, నిరీక్షణ ముగిసింది కనుక ఇప్పుడు స్టీరింగ్ వీల్ ముందు ఫడ్నవీస్‌ను కూచోబెట్టి బీజేపీ నేరుగా రాజ్యం చేయాలని ప్రయత్నిస్తోంది. ఇంతకాలం బీజేపీని హద్దుల్లో ఉంచగలుగుతున్న శిందే ఏంచేస్తారో చూడాలి.

పెద్దరాష్ట్రం మహారాష్ట్రలో జరిగిన అవమానం నుంచి కాంగ్రెస్‌ను ఆదివాసుల రాజ్యం కాపాడుకొచ్చింది. ఈ విజయంలో జార్ఖండ్ ముక్తిమోర్చాదే అధికవాటా అయినప్పటికీ, కాంగ్రెస్, ఆర్జేడీ ఇత్యాది ఇండియాబ్లాక్ పార్టీల సమష్టి కృషి కారణంగా బీజేపీని సుదూరంలో నిలువరించడం సాధ్యమైంది. ఎస్టీ స్థానాలే కాదు, ఎస్సీ, జనరల్ స్థానాలను సైతం ఈ కూటమి చక్కగా నెగ్గింది. హేమంత్ సోరేన్ మీద అవినీతి కేసులు, అరెస్టు, జైలు, బెయిలు ఇత్యాదివి ప్రజల మీద వ్యతిరేకంగా పనిచేసినట్టు కనిపిస్తోంది. ఈశాన్య జార్ఖండ్‌లోని సంథాల్ పరగణాస్ పూర్తిగా బంగ్లాదేశీ చొరబాటుదారులతో నిండిపోయిందనీ, అసలు ఆదివాసీలకు ఏదో అన్యాయం జరిగిపోతోందనీ బీజేపీ చేసిన ప్రచారం కూడా ఫలించలేదు. ఆదివాసులకు, ముస్లింలకు మధ్య విభజనరేఖ గీయాలన్న ప్రయత్నాన్ని ఓటర్లు తిప్పికొట్టారు. సంథాల్ పరగణాలలో ఐదేళ్ళక్రితం నాలుగుస్థానాలు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు ఒక్కదానికే పరిమితం కావడం, మొత్తం 28 ఎస్టీ స్థానాల్లో ఒకటి మినహా మిగతావన్నీ జెఎంఎం–కాంగ్రెస్ కూటమికి దక్కడం విశేషం. జార్ఖండ్‌లో బీజేపీని నెగ్గించే బాధ్యత భుజానవేసుకున్న హిమంత బిశ్వశర్మ ఇక్కడ కూడా అసోం నమూనా ప్రయోగించాలని చూశారు. జెఎంఎం–కాంగ్రెస్ కూటమిని ముస్లిం అనుకూల, ఆదివాసీ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించిన విడియోలు అనేకం ప్రచారంలోకి వచ్చినప్పటికీ, ఆదివాసులు ఆ మాయలో పడకపోవడం, చంపయ్ సోరేన్ వంటివారి మాటలను నమ్మకపోవడం విశేషం. సంక్షేమ పథకాలతో మళ్ళీ ముఖ్యమంత్రి అవుతున్న హేమంత్ సోరేన్ ఎన్నికల హామీలను నెరవేర్చడంతో పాటు, ఉపాధి అవకాశాలమీద కూడా దృష్టిపెట్టాలి.

సవరణ బిల్లుతో వక్ఫ్ ఆస్తులకు చిల్లు

ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టబోతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఈ అంశంపై ముస్లిం సంఘాలు, వివిధ పార్టీలు, ప్రజాస్వామిక సంస్థలూ తీవ్రంగా అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మొండిగా ముందుకు పోతున్నది.

ఇటీవలి కాలంలో బాగా ప్రచారంలో ఉన్న పదం 'వక్ఫ్'. దీని అర్థం– నిలకడ, ఆపుదల, ధర్మ సొత్తు, ధర్మార్థము అని. షరియత్ పరిభాషలో ఎవరైనా ఒక వ్యక్తి తనకు చెందిన ఆస్తిపై లేక వస్తువుపై తన హక్కును, యాజమాన్యాన్ని పూర్తిగా వదులుకొని దైవానికి దఖలుపరచడాన్ని 'వక్ఫ్' అంటారు. అంటే భూమి, వస్తువు లేక మరి దేన్నయినా వక్ఫ్ చేసిన తరువాత ఇక దానిపై దఖలు పరిచిన వ్యక్తికి గాని, వారసులకు గాని, మరెవరికైనా గాని ఏవిధమైన హక్కూ ఉండదు. అది పూర్తిగా దైవానికే చెందిన ఆస్తి. వక్ఫ్ ప్రధాన ఉద్దేశ్యం దైవాన్ని సంతోషపరచడం, సాటి మానవులపై ప్రేమను, సోదరభావాన్ని వ్యక్తపరచడం.

ప్రవక్త కాలంలో ప్రారంభమైన వక్ఫ్ భావన ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ కొనసాగుతున్నది. భారతదేశాన్ని రమారమి వెయ్యేళ్ళపాటు పాలించిన ముస్లిం రాజులు అసంఖ్యాక మసీదులకు, ఖబ్రస్తాన్‌లకు, దర్గాలకు, విద్యాలయాలకు విలువైన భూములు, ఆస్తులు వక్ఫ్ చేశారు. ఆయా వ్యవస్థలు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సజావుగా నిరాటంకంగా కొనసాగడానికి ఈ ఆస్తులు దోహదపడాలని వాటిని అల్లాహ్ పేర అంకితం చేశారు. కనుక వక్ఫ్ ఆస్తులపై ఎవరికీ ఎటువంటి హక్కూ, అధికారము ఉండదు. వాటినికి కేవలం అర్హత కలిగిన పేద సాదల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలి. కాని ఈ స్ఫూర్తికి భిన్నంగా ఆంగ్లేయుల కాలంలో వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగం మొదలైంది. అప్పుడు ముస్లింలు దీన్ని అడ్డుకోవడంతో వక్ఫ్ యాక్ట్ 1923 ఉనికిలోకి వచ్చింది. 1945లో పూర్తిస్థాయిలో వక్ఫ్ యాక్ట్‌ను ప్రవేశపెట్టారు. అనేక సందర్భాల్లో సవరణలు కూడా చేశారు. ఈ యాక్ట్ ప్రధాన ఉద్దేశ్యం వక్ఫ్ ఆస్తుల్ని సంరక్షించడం, వాటి దుర్వినియోగాన్ని నివారించడం. కాని దురదృష్టవశాత్తూ ఈ యాక్ట్ ఉద్దేశ్యం నెరవేర లేదు. అప్పుడు మళ్ళీ 1985లో మరో కొత్త వక్ఫ్ చట్టం తీసుకువచ్చినా ముస్లింల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. తరువాత 1995లో, 2010లో, 2013లో ఈ చట్టానికి సవరణలు చేశారు. అయినా నిరాశే మిగిలింది. ఇప్పుడు తాజాగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులపై కన్నేసి చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టనుంది.



బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లు ప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ బోర్డు మెంబర్లుగా, సీఈఓలుగా ఉండవచ్చునట. ప్రతిపాదిత చట్టం ప్రకారం ముస్లిమేతరులు తమ ఆస్తుల్ని వక్ఫ్ చేయడానికి అర్హులు కానప్పుడు వారు బోర్డు ఎక్జిక్యూటివ్‌లుగా, సీఈవోలుగా ఎలా అర్హులు అవుతారన్నదానికి సమాధానం లేదు.

ఎలాగైనా వక్ఫ్ ఆస్తుల్ని ముస్లింల దగ్గరి నుంచి లాగేసుకుని, ఇప్పటికే తమ అస్మదీయుల కబ్జాల్లో ఉన్న వేలకోట్ల ఆస్తుల్ని క్రమబద్ధీకరించుకోవాలన్నది మో–షా అండ్ కో దుష్టపన్నాగం. అందుకే ఈ కొత్త బిల్లులో సుమారు నలభై సవరణలు ప్రతిపాదిస్తూ ముస్లింల సంక్షేమం కోసమే ఈ బిల్లు తెస్తున్నామని ఎప్పటిలాగే కపట ప్రేమ ఒలకబోస్తున్నారు. బిల్లును గనక నిశితంగా పరిశీలిస్తే మోదీ ప్రభుత్వ దురుద్దేశం స్పష్టంగా అర్థమవుతుంది.

సరాసరి ముస్లింల ధర్మంలో, వారి వ్యక్తిగత విషయాల్లో వేలుపెట్టడం, ధర్మపరంగా వారికున్నటు వంటి ప్రత్యేకతను దెబ్బతీయడం ఈ సవరణల లక్ష్యంగా కనబడుతోంది. బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లు ప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ బోర్డు మెంబర్లుగా, సీఈఓలుగా ఉండవచ్చునట. ప్రతిపాదిత చట్టం ప్రకారం ముస్లిమేతరులు తమ ఆస్తుల్ని వక్ఫ్ చేయడానికి అర్హులు కానప్పుడు వారు బోర్డు ఎక్జిక్యూటివ్‌లుగా, సీఈవోలుగా ఎలా అర్హులు అవుతారన్నదానికి సమాధానం లేదు. అంటే చట్ట సవరణ ద్వారా సంఘీయులను బోర్డులోకి పంపి వక్ఫ్ ఆస్తుల్ని క్రమక్రమంగా కాజేయడం అసలు ఉద్దేశ్యం. ఈ సవరణల్లో ఉన్న మరో దుర్మార్గం ఏమిటంటే– ఏ ఉద్దేశ్యం కోసం ముస్లింలు తమ ఆస్తుల్ని వక్ఫ్ చేశారో, అది కాకుండా ప్రభుత్వం తన ఇష్టం వచ్చిన పద్దుల్లో వెచ్చిస్తుందట. ఇది వక్ఫ్ మూల సూత్రానికే వ్యతిరేకం. మరో గమ్మత్తయిన విషయం ఏమిటంటే, ఎవరైతే ఇస్లాం ధర్మాన్ని ఐదేళ్ళుగా ఆచరిస్తున్నారో వారే వక్ఫ్ చేయడానికి అర్హులట. ఇస్లాం ధర్మాన్ని స్వీకరించి ఐదేళ్ళు పూర్తికానివారు తమ ఆస్తుల్ని దానం చేస్తామంటే ఈ కొత్త చట్టం ఒప్పుకోదు. ఇది కూడా వక్ఫ్ సూత్రానికి, స్ఫూర్తికి వ్యతిరేకమే. ఎందుకంటే ఇస్లాం ప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ చేయడానికి అర్హులే. కాని ఇదేమి చట్టమో ముస్లిం అయి ఉండి కూడా వక్ఫ్ చేస్తానంటే ఈ చట్టం ఒప్పుకోవడంలేదు. నిజానికిది ఒక ముస్లింను తన ధర్మపరమైన ఆరాధన చేయవద్దని అడ్డుకోవడమే. భారత రాజ్యాంగంలోని 25వ అధికరణ ప్రకారం ప్రతి వ్యక్తీ స్వేచ్ఛగా నచ్చిన మతాన్ని స్వీకరించే, ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కును కలిగి ఉన్నాడు. ఆర్టికల్ 26 ప్రకారం ప్రతి ఒక్కరూ తమ మతం శాఖలను, ధార్మిక కార్యకలాపాల కోసం సంస్థలను స్థాపించుకొని, వాటిని నిర్వహించుకొనే హక్కునూ కలిగి ఉన్నారు. రాజ్యాంగ ప్రసాదితమైన ఈ హక్కును కాలరాసే అధికారం ఎవ్వరికీ లేదు. అలాగే ఈ సవరణ బిల్లులో మరో దుర్మార్గం– వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఏదైనా వివాదం తలెత్తితే నిర్ణయాధికారం జిల్లా కలెక్టర్లకు దఖలుపరచడం. ప్రస్తుతమైతే వివాద పరిష్కారానికి హైకోర్టు న్యాయమూర్తి నియమించిన వక్ఫ్ ట్రిబ్యునల్ ఉంది. దీన్ని కాదని కలెక్టర్లకు నిర్ణయాధికారం కట్టబెడితే వాళ్ళు పాలకులకే వత్తాసు పలికే అవకాశాలు ఎక్కువ. మసీదు, మదర్సా దర్గా, ఈద్గా తదితరాల విషయంలో ఏ చిన్న సమస్య తలెత్తినా దాన్ని ప్రభుత్వ ఆస్తిగా కలెక్టర్లతో రాయించేసుకోవడం ప్రభుత్వాధినేతలకు పెద్ద లెక్క కాదు. ఈ విధంగా కూడా కేంద్ర సర్కారు ముస్లింల ఆస్తుల్ని కొల్లగొట్టాలని చూస్తోంది. మరో కుట్ర ఏమిటంటే, కొత్త బిల్లు ప్రకారం వక్ఫ్ భూమిని ఆక్రమించుకుని పన్నెండేళ్లుగా అనుభవిస్తున్న వ్యక్తులు ఈ సవరణల పుణ్యమా అని ఆ భూమికి యజమానులుగా మారిపోతారు. కాబట్టి వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించడమంటే, నిస్సందేహంగా ముస్లింల విలువైన ఆస్తుల్ని తేరగా కొల్లగొట్టడమే. దాతృత్వం అనే భావనను నిర్వీర్యం చేసి ఆక్రమణదారులను, కబ్జాకోరులను ఆస్తులకు యజమానులుగా మార్చాలనుకుంటున్న ఈ దుర్మార్గపు బిల్లును ప్రతిపక్షాలే గాక, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కూడా వ్యతిరేకించి బిల్లు ఆమోదం పొందకుండా చూడాలి.

• యండి. ఉస్మాన్‌ఖాన్
జర్నలిస్ట్

'మహా' విపక్షాల భవిష్యత్తు ఏమిటి?




▪ రాజ్‌దీప్ సర్దేశాయి

ఈ శతాబ్దం తొలినాళ్ల మాట. మహారాష్ట్రలో బీజేపీ–శివసేన పొత్తుకు ప్రధాన కారకుడు అయిన బీజేపీ నాయకుడు ప్రమోద్ మహాజన్ (ఇప్పుడు కీర్తి శేషుడు)ను, 'కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న భారతీయ జనతా పార్టీ మహారాష్ట్రలో శివసేనకు జూనియర్ భాగస్వామిగా ఉండడానికి ఎందుకు అంగీకరించిందని' ప్రశ్నించాను. ఆయన ఇలా సమాధానమిచ్చారు: 'రాజకీయాలలో ఎవరైనా సరే తమ సమయం వచ్చే దాకా వేచి ఉండాల్సిందే. వాజపేయి ఇప్పుడు దేశ వ్యాప్తంగా అందరి గౌరవాదరాలు పొందుతున్న సమున్నత నేత. అయితే మహారాష్ట్రలో బాలా సాహెబ్ ఠాక్రే నాయకత్వం అవసరం మాకు, ప్రతి ఒక్కరికీ ఉంది. ఏదో ఒక రోజు శివసేన అవసరం మాకు ఉండక పోవచ్చు. ఆ సమయం వచ్చినప్పుడు మేమే అన్నిటినీ నిర్దేశిస్తాం'. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం, శివసేన అధినేత బాలా సాహెబ్ మరణించిన పన్నెండేళ్లకు, ప్రమోద్ మహాజన్ స్వప్నాన్ని బీజేపీ తిరుగులేని రీతిలో సాధించింది: మహారాష్ట్రలో ఇప్పుడు ఎదురే లేని నెంబర్ 1 పార్టీ భారతీయ జనతా పార్టీ. 2024 శాసనసభ ఎన్నికలలో సొంతంగా అత్యధిక మెజారిటీతో గెలుపొంది ఎట్టకేలకు మిత్రపక్షాలను, ప్రత్యర్థి పార్టీలను తన అభీష్టాల ప్రకారం నిర్దేశించగలిగే, నియంత్రించగలిగే ప్రభావ ప్రాబల్యాల విజేతగా ప్రభవించింది.

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అయిన మహారాష్ట్రలో ఈ పెనుమార్పు ఎలా సంభవించింది? 1988లో పొత్తు కుదుర్చుకున్న బీజేపీ, శివసేనలు రాష్ట్ర, జాతీయ ఎన్నికలలో కలసికట్టుగా పోటీ చేసేవి. అయితే 2014లో ఈ మిత్రపక్షాలు మొట్టమొదటిసారి వేటికవే పోటీ చేశాయి. నరేంద్ర మోదీ పలుకుబడితో బీజేపీ 122 సీట్లు గెలుచుకోగా శివసేన 63 స్థానాలను స్వాయత్తం చేసుకున్నది. హిందుత్వ రాజకీయాలలో, ముఖ్యంగా మహారాష్ట్రలో ఏ పార్టీ ప్రధాన శక్తి అన్నది ఆ ఫలితాలతో స్పష్టమయింది. 2019 శాసనసభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్– ఎన్సీపీ కూటమితో శివసేన కలవడంతో రాష్ట్రంలో కాషాయ కూటమి ఏకైక ప్రతినిధిగా బీజేపీ మిగిలిపోయింది. 2022లో శివసేనను చీల్చడం ద్వారా తన ఒకప్పటి మిత్రపక్షమైన శివసేనను మరింతగా బలహీనపరచడంలో బీజేపీ సఫలమయింది. తాజా శాసనసభ ఎన్నికలలో నాలుగింట మూడు వంతుల మెజారిటీతో తిరుగులేని విజేతగా నిలిచిన బీజేపీ మహారాష్ట్ర రాజకీయాలలో గుత్తాధిపత్యం చెలాయించే పరిస్థితి నెలకొన్నది.

మహారాష్ట్రలో తన ఎదుగుదలకు ప్రధాన ప్రతిబంధకం కాంగ్రెస్ కాదని, ప్రాంతీయ పార్టీలే అన్న సత్యం బీజేపీకి మొదటి నుంచీ బాగా తెలుసు. పశ్చిమ మహారాష్ట్రలో అన్ని విధాల ప్రబలంగా ఉన్న సహకార సంఘాలు, వాటి పెత్తందారులపై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి నియంత్రణ ఉండగా మరాఠీ అస్మిత (ఆత్మ గౌరవం)కు శివసేన ప్రతీకగా వెలుగొందుతోంది. ముంబైలో భూమి పుత్రుల ఉద్యమంతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శివసేన మహారాష్ట్రియన్ హిందూ అస్తిత్వం భావోద్వేగాల ఆధారంగా గ్రామీణ మహారాష్ట్రకు కూడా వ్యాపించి వేళ్లూనుకున్నది. మిత్ర పక్షాలుగా ఉన్న కాలంలో కూడా బీజేపీ, శివసేనలు ఒకే (హిందూ) ఓటు బ్యాంకును స్వాధీనం చేసుకునేందుకు పోటీపడవలసివచ్చేది. పంజాబ్‌లో మిత్రపక్షమైన అకాలీదళ్ నుంచి బీజేపీకి ఇటువంటి పోటీ ఉండేది కాదు. బీజేపీ–శివసేన కూటమి పాతిక సంవత్సరాల పాటు ఎత్తు పల్లాలను చూసింది. మహారాష్ట్రలో వేళ్లూనుకోవడానికి శివసేన స్థానిక పలుకుబడి బీజేపీకి ఎంతైనా అవసరమయ్యేది. బీజేపీ మనుగడకు ప్రధాన ఆలంబనగా ఉన్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దశాబ్దాలుగా అగ్రవర్ణ, మరీ ముఖ్యంగా బ్రాహ్మణుల నాయకత్వంలోని పార్టీగా పేరు పడింది. శివసేనతో జతకట్టడం ద్వారా సంఘ్ పరివార్ తన ప్రజాదరణను పెంచుకోగలిగింది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని రాజ్యాధికారం ఆసరాతో బలహీనపరచడంలో బీజేపీ సఫలమయింది. ఆ పార్టీకి చెందిన ఆర్థికంగా, రాజకీయంగా శక్తిమంతులైన నాయకులు అందరిపైన దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం జరిగింది. మరి 2023లో ఎన్సీపీలో చీలిక సంభవించినప్పుడు పార్టీ ఫిరాయించిన నేతలు అందరూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులను ఎదుర్కొంటున్నవారే కావడంలో ఆశ్చర్యమేముంది? నాయకుల వ్యక్తిగత అధికార లాలస, దర్యాప్తు సంస్థల ఒత్తిడి, భావజాలపరమైన విభేదాల కలగలుపు ఫలితంగా శివసేనలో చీలిక సంభవించింది. కాంగ్రెస్‌తో శివసేన పొత్తు పెట్టుకోవడం ఒక ఆశ్చర్యకర పరిణామం. ఎందుకని? బాబ్రీ మసీదును కూల్చివేసిన ఘనత తమదే అని ఘనంగా చాటుకున్న పార్టీ అసలు రాముడి అస్తిత్వాన్నే అంగీకరించని పార్టీతో కలవడమేమిటి? అని శివసేన కార్యకర్తలు సహజంగానే విస్మయం చెందారు. అయోమయంలో పడ్డారు. తమ నాయకులు తమను మోసగించారని అభిప్రాయపడ్డారు. అధికార లాలస అమితంగా ఉన్న ఏక్‌నాథ్ శిందే బీజేపీ ప్రోత్సాహంతో ఉద్ధవ్ ఠాక్రే పార్టీ భావజాలాన్ని ఉపేక్షించడాన్ని ప్రశ్నించారు. ఎదురు తిరిగారు. బాలాసాహెబ్ వారసత్వానికి తానే నిజమైన యోగ్యుడనని చాటుకున్నారు, నిరూపించుకున్నారు. ఈ పరిణామాల మధ్య ఉద్ధవ్ ఠాక్రే పార్టీని కాపాడుకునేందుకు చాలా కష్టాలు పడ్డారు.

శివసేనలో చీలిక బీజేపీ తన ప్రాభవాన్ని పెంచుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పించింది. నరేంద్ర మోదీ–అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ, వాజపేయి–అద్వానీ ద్వయం పాటించిన సమ్మిళిత సంకీర్ణ ధర్మాలను క్రమంగా త్యజిస్తూ ఒక ప్రాంతీయ పార్టీతో ఏర్పాటు చేసుకున్న కూటమిలో తానే ఆధిపత్య పక్షంగా వ్యవహరించడం జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు విజయం సాధించడంతో రాష్ట్ర స్థాయి భాగస్వామ్యపక్షాలు తాను నిర్దేశించిన విధంగా వ్యవహరించేలా చేయడంలో పూర్తిగా సఫలమవుతోంది. అసోంలో అసోం గణ పరిషత్ ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఒక జూనియర్ భాగస్వామిగా ఉన్నది. గోవాలో ఒకప్పుడు సర్వాధిపత్యంతో వ్యవహరించిన మహారాష్ట్ర వాది గోమంతక్ పార్టీ ఇప్పుడు బీజేపీకి ఒక చిన్న అనుబంధ పార్టీ మాత్రమే? కర్ణాటకలో జనతాదళ్ (ఎస్) బీజేపీ నిర్దేశించినట్లు వ్యవహరించాల్సిందే. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్న బిహార్‌లో సైతం తన సమయం కోసం బీజేపీ ఓర్పుతో వేచివున్నది. ఎన్డీఏలోని ఇతర భాగస్వామ్య పక్షాలు చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్ జనశక్తి, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అనివార్యకారణాల వల్లే కూటమిలో ఉన్నాయి కాని భావజాలపరమైన ఏకీభావంతో కాదనేది అందరికీ తెలిసిన విషయమే.

ఇప్పుడు మహారాష్ట్రలో బిగ్‌బాస్ ఎవరు అనేది ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌లకు బాగా తెలుసు. మహిళలకు నేరుగా నగదు బదిలీ చేసే లడ్కీ బహీన్ పథకం ఆలంబనతో తనను తాను సామాన్యమానవుని సంక్షేమానికి మొదటి ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రిగా ప్రజాదరణను పెంచుకోవడానికి సకల ప్రయత్నాలు చేశారు. ఆయనకు ప్రజాదరణ పెరిగిందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ బీజేపీ ప్రాపకం పైనే శిందే ఆధారపడి ఉన్నారన్నది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. అజిత్ పవార్ సైతం తన బాబాయి శరద్ పవార్ నీడ నుంచి బయటపడి సొంతంగా వెలుగొందుతున్నప్పటికీ బీజేపీ ఎప్పుడైనా సరే తనపై కేసులు మోపగలదనే సత్యాన్ని విస్మరించలేరు. ఒక విధంగా మహారాష్ట్ర ప్రాంతీయ పార్టీల నాయకులు అందరూ ఒక జనరల్ ఆదేశాలను పాటించే బెటాలియన్ కమాండర్లు మాత్రమే.

గుజరాత్‌లో మాదిరిగా మహారాష్ట్రలో కూడా ప్రతిపక్షాలు మళ్లీ అధికారానికి రాలేని పరిస్థితి నెలకొంటుందా అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న. గుజరాత్‌లో బీజేపీ తన తిరుగులేని ప్రాబల్యాన్ని చాల తేలిగ్గా సాధించుకోగలిగింది. ఆ రాష్ట్రంలో బీజేపీని సమర్థంగా ఎదుర్కోగల ప్రతిపక్షమేదీ లేకపోవడమే అందుకు కారణమని చెప్పవచ్చు. మహారాష్ట్రలో సాహు–పూలే–అంబేడ్కర్‌ల ప్రగతిశీల సామాజిక వారసత్వం ప్రభావశీలంగా ఉన్నది. వెనుకబడిన కులాల, దళిత వర్గాల ఉద్యమాలు, రాజకీయాలపై మధ్యేవాద శక్తులు, వామపక్షాల ప్రభావం బలంగా ఉన్నది. ఈ కారణంగా సంఘ్ పరివార్ మహారాష్ట్ర సమాజం, రాజకీయాలపై తన పట్టును సాధించుకోవడంలో అనేక ప్రతిబంధకాలనెదుర్కొంటున్నది. 2024 శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆ సుదృఢ ప్రగతిశీల వారసత్వం పరిమితులను బహిర్గతం చేసింది. ధనశక్తి ప్రభావంతో పాటు అవకాశవాద రాజకీయాలు ఆ వారసత్వాన్ని బాగా దెబ్బతీశాయి. శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే ఇరువురూ ఇప్పుడు అనిశ్చిత భవిష్యత్తు నెదుర్కొంటున్నారు. ఇరువురూ తమ తమ పార్టీలపై పట్టు కోల్పోయారు. బీజేపీతో ముఖాముఖి పోటీ చేసిన 75 నియోజకవర్గాలలో కాంగ్రెస్ 62 స్థానాలలో చిత్తుగా ఓడిపోయింది. గత సార్వత్రిక ఎన్నికలలో లభించిన సానుకూలతలన్నిటినీ కాంగ్రెస్ పూర్తిగా కోల్పోయింది. రాబోయే ఐదేళ్ల కాలంలో మహారాష్ట్ర రాజకీయాలపై తన పట్టును ఎటువంటి మినహాయింపులు లేకుండా బిగించేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తుంది. గుజరాత్ వలే మహారాష్ట్ర హిందుత్వకు ప్రయోగశాల కాకపోవచ్చు కానీ మరాఠా భూమిలో ఒక కొత్త వ్యవస్థ ఏర్పడుతుందనడంలో సందేహం లేదు. తన శత వార్షికోత్సవాన్ని జరుపుకొనేందుకు సంసిద్ధమవుతున్న (నాగపూర్ ప్రధాన కేంద్రంగా ఉన్న) రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు మహారాష్ట్ర సంఘ్ పరివార్ పాలనలోకి రావడం కంటే ఉత్తమ కానుక మరేముంటుంది?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మహారాష్ట్రలో సాహు–పూలే–అంబేడ్కర్‌ల ప్రగతిశీల సామాజిక వారసత్వం ప్రభావశీలంగా ఉన్నది. వెనుకబడిన కులాల, దళిత వర్గాల ఉద్యమాలు, రాజకీయాలపై వామపక్షాల ప్రభావం బలంగా ఉన్నది. ఈ కారణంగా సంఘ్ పరివార్ మహారాష్ట్ర సమాజం, రాజకీయాలపై పట్టు సాధించుకోలేకపోతోంది. 2024 శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆ ప్రగతిశీల వారసత్వం పరిమితులను బహిర్గతం చేసింది. గుజరాత్‌లో వలే మహారాష్ట్రలోనూ ప్రతిపక్షాలు మళ్లీ అధికారానికి రాలేని పరిస్థితి నెలకొంటుందా అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్ editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

మన నడతను బట్టే రాజ్యాంగం మంచిచెడ్డలు!

1949లో ఇదే రోజు రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా ప్రతీ ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రచించుకోవడమే కాకుండా ఆ స్ఫూర్తితో దేశం ఏడు దశాబ్దాలుగా శక్తివంతంగా, పటిష్ఠమైన ముందడుగు వేయడం నాటి ప్రపంచ మేధావులెవరూ ఊహించలేనిది. ఇది రాజ్యాంగ నిర్మాతల గొప్పదనం. ఆ ప్రతి గొప్పతనం.

రాజ్యాంగానికి కేంద్ర బిందువు– వ్యక్తి, పౌరుడు. ప్రతీ పౌరుడూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆలంబనగా ఎదగాలని, ఆత్మగౌరవంతో జీవిస్తూ తామే పాలకులుగా దేశ సమగ్రత, ఔన్నత్యం సాధించాలన్నది మార్గదర్శనం. ఈ స్ఫూర్తి, అందులోని నైతికత ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వాలకు పూర్తిగా అర్థం కావాలి. దాన్ని చైతన్యంతో ఆవాహన చేసుకున్నప్పుడే దేశం ప్రగతి సాధించగలదు. లేదంటే ఫలితం ఉండదు. అందుకనే అంబేడ్కర్ చెప్పారు, "రాజ్యాంగం ఎంత మంచిదైనా, చెడ్డవారి చేతిలో ఉంటే చెడ్డది అవుతుంది, అది చెడ్డదైనా మంచివారి చేతిలో ఉంటే మంచి చేస్తుంది" అని.

ప్రస్తుతం ప్రపంచీకరణ నేపథ్యంలో ఆర్థిక అసమానతలు పెరుగుతూ వస్తున్నాయి. చాలా తక్కువ మంది చేతిలో సంపద కేంద్రీకృతమై, అధిక శాతం ప్రజలకు పేదరికమే దిక్కవుతున్నది. దేశ స్థూల జాతీయ ఉత్పత్తికీ తలసరి ఆదాయానికీ పొంతన లేకుండా పోతున్నది. ఈ విధానాన్ని సరిదిద్ది అందరూ ఆర్థికంగా ఎదిగేలా చూడడమే రాజ్యాంగ స్ఫూర్తి. ప్రభుత్వపు విధి.

అలాగే ఒక్కో అధికరణ ఎందుకు ఉన్నది, దాన్ని ఎందుకు సవరణ చెయ్యాలి, ఎంత త్వరగా అది అమలు చేయాలి అన్నది కూడా ముఖ్యమే. ఉదాహరణకు స్థానిక సంస్థల్ని బలోపేతం చేయడానికి 73వ సవరణను పార్లమెంటు 1992లో చేసింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్వయంపాలన దిశగా అడుగులు వేస్తూ అక్కడి ఆదివాసీలకు వనరులపై, వృద్ధిపై నిర్ణయాధికారం పెంచడానికి పీసా చట్టం వచ్చింది. అది 1996లో పార్లమెంటులో, 1998లో ఆంధ్రప్రదేశ్‌లో ఆమోదం పొందింది. అయితే అమలు చెయ్యడానికి నియమాల రూపకల్పన 2011 వరకూ జరగలేదు. అంటే ఒక మంచి చట్టం రూపొందడానికి, అది అమల్లోకి రావడానికి మధ్య 19 ఏళ్లు పట్టాయన్న మాట. ఒక తరం గడిచిపోయినట్టే. అందుకనే రాజ్యాంగం ఒక పుస్తకంగా ఉండడం వేరు, అది పాటించే నిష్ఠ ఉండడం వేరు. అలా పాటింపబడాలంటే అందుకు ప్రజా చైతన్యం అవసరం.

– డి.వి.జి. శంకరరావు

ప్రజాస్వామ్య భారతానికి అండ మన రాజ్యాంగం

"రాజ్యాంగం కేవలం న్యాయవాదుల పత్రం మాత్రమే కాదు, ఇది జీవన వాహనం. దాని ఆత్మ నిత్యం యుగస్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది" అన్న అంబేడ్కర్ మాటలు చెరగని సత్యాలు. మన రాజ్యాంగ నిర్మాతలు వ్యక్తి ఆధారిత వికాసాన్ని ఆశిస్తూ దేశానికి ఆచరణీయ పాలనా నమూనాను రూపొందించారు. గత ఏడున్నర దశాబ్దాలుగా దేశానికి దిక్సూచిగా పనిచేస్తున్న రాజ్యాంగ అమలును పరిశీలిస్తే దీని నిర్మాతల దార్శనికత దేశ ప్రజలకు తెలుస్తుంది.

12 భాగాలు, 395 అధికరణలు, దేశకాలానుగుణంగా కొత్త విషయాల్ని జోడించిన 106 సవరణలతో కూడిన రాజ్యాంగం సుమారు ఏడున్నర దశాబ్దాలుగా భారతదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లేందుకు ప్రధాన భూమికను వహిస్తోంది. స్వాతంత్ర్యోద్యమ ఫలితంగా సాధించిన స్వయం పాలనలోంచి, స్వేచ్ఛావాయువుల్లోంచి ప్రజలే మన రాజ్యాంగాన్ని రాసుకున్నారు. 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన మన రాజ్యాంగం పురాతన భారతీయ సంప్రదాయాల మీద నిర్మితమైనది. నాలుగు వేల సంవత్సరాల చరిత్రలో ఈ దేశ ప్రజల అనుభవాలు రాజ్యాంగంలో నిక్షేపితమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక రాజ్యాంగాలు చాలా విఫలమయ్యాయి. కాని భారత రాజ్యాంగం అలా కాకుండా నిలిచి వెలుగుతున్నది.

ప్రతి భారతీయ పౌరుడూ కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా స్వేచ్ఛగా తన భావాలను, అభిప్రాయాలను వెల్లడించగలుగుతున్నారంటే అది భారత రాజ్యాంగం సాధించిన గొప్ప విజయమనే చెప్పాలి. అధికరణ 19(1)ఎ భారతీయ పౌరుల్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెర్సస్ రాజ్ నారాయణ్‌కి సంబంధించిన కేసులో ప్రతి భారతీయ పౌరుడూ సమాచారాన్ని స్వీకరించడంతో పాటు వ్యాప్తి చేసే హక్కును కలిగివున్నాడని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. భిన్నత్వంలో ఏకత్వం, లౌకికవాదం, మత సహనం, అందరికీ సమాన అవకాశాలు, అట్టడుగు వర్గాల కోసం ప్రత్యేక చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలు భారత రాజ్యాంగం ప్రసాదించింది. రాజ్యాంగ రచనలో కార్యదక్షత వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని ఆకాంక్షించారు. సమ ప్రజాస్వామ్య పద్ధతుల్ని రాజ్యాంగ పరిషత్తు తీసుకొచ్చింది. వ్యత్యాసం లేని ప్రజాస్వామ్యాన్ని తీర్మానించింది. పరిపూర్ణ ప్రజాస్వామ్యానికి రాజ్యంగ రచయితలు పునాదులు వేశారు.

ప్రజల ఆర్థిక, సాంఘిక జీవితంలో విప్లవాత్మక మార్పులను రక్తపాతం లేకుండా తీసుకొచ్చే ప్రక్రియే ప్రజాస్వామ్యం అని ఈ సందర్భంలోనే డాక్టర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. ఇటువంటి రాజకీయ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యాలు రక్తమాంసాల పాత్ర పోషిస్తాయని వివరించారు. కులం ద్వారా వచ్చిన వెనుకబాటుతనంతో ఉత్పత్తి కులాలు అణచివేతకు గురయ్యాయని, వీటిని అధిగమించాలంటే ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థే దివ్యౌషధమనీ ఆయన అన్నారు. ఎటువంటి వాదప్రతివాదాలూ లేకుండానే పరిషత్ దీనిని ఆమోదించింది. ఈ నేపథ్యంలోనే వివిధ వర్గాల ప్రజల మధ్య ఐక్యతను సాధించేందుకు వివిధ సంక్షేమ విధానాలు రూపొందాయి. సహృదయ భావజాలాన్ని పెంపొందించే నిర్ణయాలు కూడా జరిగాయి. రాజ్యాంగ రచనాసంఘం అధ్యక్షునిగా డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రజాస్వామ్య మూలాలు భారతీయుల వారసత్వ సంపద అన్నారు. జె.ఎస్.మిల్, హెరాల్డ్ లాస్కీ, మెకావర్ చెప్పిన పాశ్చాత్య ప్రజాస్వామ్యం భారతదేశానికి సరిపడదని అంబేడ్కర్ పేర్కొన్నారు. భారతదేశ సామాజిక చట్రం అందుకు భిన్నంగా ఉందన్నారు.

వివిధ కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, ప్రాంతాలుగా, భాషలుగా, సంస్కృతులుగా విభజన చెందిన ఈ సమాజం, 'ఏకతా' భావనకు చేరుకోవడానికి అవసరమైన మానసిక పరివర్తనను పెంపొందించే రాజకీయవ్యవస్థ అవసరాన్ని రాజ్యాంగ పరిషత్ తెరమీదికి తీసుకొచ్చింది. ప్రజల మనోభావాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులకు అవకాశం వుండాలని సభ్యులు కోరుకున్నారు. ఇది సమాజ ఆశయాలను, ఆకాంక్షలను ప్రతిబింబించేదిగా ఉండాలి. రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులు నిర్లక్ష్యానికి గురికాకూడదు. దీనిని విస్మరించి పాలకులు స్వప్రయోజనాల కోసమే పనిచేస్తే, బలహీనవర్గాల అభివృద్ధి, సంక్షేమం కుంటుబడుతుంది. ఇక్కడే ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లే పరిస్థితులు ఏర్పడతాయి. అందుకే రచనాసంఘం ప్రజాస్వామ్యమంటే కేవలం ప్రభుత్వ ఏర్పాటు ఒకటే కాదని వివరణ ఇచ్చింది. ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు సంపూర్ణ అవగాహన కలిగినప్పుడే ఓటుహక్కు విలువ తెలుస్తుందని రాజ్యాంగ పరిషత్తు భావించింది. రాజకీయ పార్టీల లక్ష్యాలు, వారి కార్యాచరణను ప్రజలు అంచనా వేయగలగాలనేది వారి ఉద్దేశం. అప్పుడే పారదర్శకంగా ఓటుహక్కు వినియోగించుకోగలుగుతారన్నారు. రాజ్యం – కులం – మత వ్యవస్థల ఉనికి, స్వరూపస్వభావాలు మనిషిని ఏ రకంగా ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకున్నప్పుడే సంపూర్ణ ప్రజాస్వామ్యం మనగలుగుతుందని రచనా సంఘం పేర్కొంది. అందుకే "ఒకవ్యక్తి – ఒకే ఓటు, ఒక ఓటు – ఒకే విలువ" అనే సూత్రానికి అవిశ్రాంతంగా కృషి జరిగింది. ఇది ఆచరణలోకి వచ్చే వరకు డాక్టర్ అంబేడ్కర్ చాలా కృషి చేశారు.


రచనా సంఘం మూడు రకాల ప్రజాస్వామ్యం గురించి చర్చించింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ సిద్ధాంత ప్రాతిపదికగా కలిగిన జీవనవిధానం సామాజిక ప్రజాస్వామ్యం. ప్రజల మధ్య ధనిక, పేద వ్యత్యాసాలు తగ్గిపోయి సామాజిక సహజీవనానికి బాటలు వేసేది ఆర్థిక ప్రజాస్వామ్యం. పెట్టుబడిదారీ ఆర్థిక విధానం కొన్ని సందర్భాల్లో ప్రజాస్వామ్య లక్ష్యాలకు అడ్డంకిగా నిలుస్తుందన్నారు. ఈ విధానంలో వ్యక్తి స్వేచ్ఛ, ఇతర హక్కులకు సైతం రక్షణ కొరవడుతుంది. అందుకే శ్రేయోరాజ్యాన్ని ప్రతిపాదించారు. రాజ్యాంగంలో సంక్షేమ రాజ్యస్థాపనకు తగిన ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. రాజ్యాంగం ద్వారా బలహీనవర్గాలు జీవనోపాధి పొందే విధంగా వీటిని రూపొందించారు. సామాజిక వనరుల మీద యాజమాన్య నియంత్రణ ప్రజలకే వుండాలని పరిషత్ ఆకాంక్షించింది. సంపద, ఉత్పత్తికారకాలు ఏ కొద్దిమంది చేతుల్లోనో కేంద్రీకృతం కాకూడదని, బలహీనవర్గాల విద్య, ఉపాధి ఆర్థిక విషయాలను రాజ్యమే పరిరక్షించాలని ఆశించారు. ఆదేశిక సూత్రాల అమలు ద్వారా ఆదర్శ ప్రజాస్వామ్యాన్ని నిర్మించవచ్చని, ఇటువంటి కార్యాచరణ సాధ్యం కావాలంటే ప్రభుత్వమే ఈ బాధ్యత వహించాలనేది రచనా సంఘం తరుపున అంబేడ్కర్ సూచించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పనితీరు బాగుంటేనే అది వర్ధిల్లుతుంది. దీనికి ప్రధానంగా రెండు విషయాలు మూలస్తంభాలుగా నిలవాలి. ఒకటి సమర్థవంతమైన పాత్ర పోషించగల ప్రతిపక్షం, రెండు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోగల పరిస్థితులు. ఇవి ఉన్నప్పుడే అణగారిన ప్రజానీకం విముక్తి సుసాధ్యమవుతుంది.

ప్రజాస్వామ్యం అంతరించిపోతే ప్రజల ఆకాంక్షలు నీరుగారిపోతాయన్నది రచనా సంఘం హెచ్చరిక. రాజకీయ పార్టీల బాధ్యతాయుతమైన పాలనతోనే రాజ్యాంగం మనగలుగుతుంది. ఈ సందర్భంలోనే దేశీయ రాజనీతి సిద్ధాంతకర్తలు నాడు రాజ్యాంగాన్ని కొనియాడారు. సమైక్య జీవన వేదంగా ఈ ముసాయిదా సాక్షాత్కరిస్తుందన్నారు. అంఖండ భారతాన్ని నిర్మించి పటిష్టపరిచిన రాజ్యాంగం ఆమోదం పొందిన రోజుని ఉత్సవంగా జరుపుకుందాం.

12 భాగాలు, 395 అధికరణలు, దేశకాలానుగుణంగా కొత్త విషయాల్ని జోడించిన 106 సవరణలతో కూడిన రాజ్యాంగం సుమారు ఏడున్నర దశాబ్దాలుగా భారతదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లేందుకు ప్రధాన భూమికను వహిస్తోంది. స్వాతంత్ర్యోద్యమ ఫలితంగా సాధించిన స్వయం పాలన లోంచి, స్వేచ్ఛావాయువుల్లోంచి ప్రజలే మన రాజ్యాంగాన్ని రాసుకున్నారు.



▪ డా. జీకేడీ ప్రసాద్
(నేడు భారత రాజ్యాంగ అమృతోత్సవం)





టీమ్ ఎన్టీఆర్‌తో జిల్లాను నంబర్-1 చేద్దాం

కలెక్టర్‌గా లక్ష్మీశ బాధ్యతల స్వీకరణ

- అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధిని సాధిద్దాం
- ఎన్టీఆర్ జిల్లా అంటే టాప్- 3లో ఉండాలి
- ఏ శాఖలోనూ పెండింగ్ కనిపించవద్దు
- జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

6లో

సీఎం చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపిన కలెక్టర్

• కార్తీక దీపం



కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని దుర్గా ఘాట్‌కు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున కార్తీక స్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు. కృష్ణమ్మకు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

కమిషనరేట్‌కు కొత్త ఏసీపీలు

విజయవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు కొత్త ఏసీపీలు సోమవారం వచ్చారు. సీసీఎస్ ఏసీపీగా సిహెచ్.వెంకటేశ్వర్లు, సీటీసీ ఏసీపీగా బి.ఉమామహేశ్వరరెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీగా కె.లతాకుమారి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

వైసీపీ హయాంలో బూతులతో రెచ్చిపోయిన కొడాలి నాని అక్రమాల పుట్ట బద్దలయ్యే రోజులు దగ్గర పడ్డాయి. అధికారం అండతో అడ్డగోలుగా చేసిన అక్రమాలు ఆయన మెడకు చుట్టుకోనున్నాయి. జగనన్న కాలనీల మెరక పేరుతో భారీ దోపిడీకి తెరదీసిన నాని అక్రమాలపై గత కొన్ని రోజులుగా దృష్టిసారించిన విజిలెన్స్ అధికారులు పూర్తి సాక్ష్యాధారాలతో అన్ని రకాల స్టేట్‌మెంట్లను రికార్డు చేసి కొడాలి నానికి ఉచ్చు బిగించేందుకు సిద్ధం అవుతున్నారు. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)



జగనన్న కాలనీ

కొడాలి మెడకు మెరక ఉచ్చు

జగనన్న కాలనీ మెరక దోపిడీపై విజిలెన్స్ నివేదిక

అధికారం అండతో అడ్డగోలు దోపిడీ

పేదల సొంత ఇంటి కలను ఆసరాగా చేసుకుని వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావు. వైసీపీ హయాంలో గుడివాడ నియోజకవర్గంలో జగనన్న కాలనీలకు మల్లాయపాలెంలో 173.8 ఎకరాలు సేకరించారు. ఎకరా రూ.52 లక్షలు పెట్టి కొనుగోలు చేశారు. ఇంత ఖర్చు పెట్టినా అదంతా లోతట్టు ప్రాంతం. దీంతో దీన్ని మెరక చేయాలన్న నెపంతో కొడాలి నాని అక్రమాలకు తెరదీశారు. గ్రావెల్‌తో మెరక చేయాల్సి ఉండగా స్థానికంగా ఉన్న చెరువుల్లో మట్టిని, సాగునీటి కాల్వలు, డ్రెయిన్లలో మట్టిని తవ్వి మెరకకు ఉపయోగించారు. బిల్లులు మాత్రం ఎక్కడో దూరం నుంచి గ్రావెల్ తరలించినట్లు చూపి కోట్లు కొల్లగొట్టారు. ఈ అవినీతి ఫలితం మల్లాయపాలెంలో సుమారు 7వేల మందికి సెంటు పట్టాలు ఇస్తే అందులో ప్రస్తుతం వంద మంది కూడా నివాసం ఉండలేని పరిస్థితి. చిన్నపాటి వర్షానికే ఈ ప్రాంతం జలమయమై పోతుంది. ప్రజలకు కష్టాలు మిగిల్చిన నాని మాత్రం మల్లాయపాలెం జగనన్న కాలనీ పేరుతో కోట్లాది రూపాయలు ఆర్జించారు.



జగనన్న కాలనీ

రూ.40 కోట్లు స్వాహా అయినట్టు ప్రాథమిక నిర్ధారణ

- జగనన్న కాలనీకి 173.8 ఎకరాలు సేకరణ.. అంతా లోతట్టే
- దాని మెరక పేరుతో అనుచరులకు వర్క్ ఆర్డర్లు
- చేసింది రూ.8 కోట్ల పని.. మింగింది రూ.40 కోట్లు
- అనుచరుల ఖాతాల్లో డబ్బులు పడిన వెంటనే బినామీ ఖాతాల్లోకి మళ్లింపు
- త్వరలో ప్రభుత్వానికి చేరనున్న నివేదిక.. ఆపై రంగంలోకి ఏసీబీ

అధికారులనూ ఇరికించేశారు..

మల్లాయపాలెం జగనన్న కాలనీ మెరక చేసేందుకు గ్రామ పంచాయతీలో సంబంధిత అధికారులతో 2020 ఏప్రిల్ 25న అత్యవసర సమావేశం ఏర్పాటు చేయించారు. అప్పుడున్న ఎంపీడీవో కుమారి వెంకట రమణ సాయంతో చేతిరాతతో వర్క్ ఆర్డర్స్ రాయించి తన అనుచరులు 16 మందికి మెరక పనులు కట్టబెట్టారు. ఇలాంటి వర్క్ ఆర్డర్లు పది వరకు ఇచ్చారు. సుమారు రూ.150 కోట్లు విలువైన వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. వర్క్ ఆర్డర్లు పొందిన వారంతా కొడాలి నాని అనుచరగణానికి తెలిసిన సాదాసీదా వ్యక్తులు. వారి ఖాతాల్లోకి జమ అయిన సొమ్ములు తిరిగి కొడాలి నాని బినామీ ఖాతాల్లోకి చేరిపోయాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని నాని అనుచరులు... దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్, కసుకుర్తి బాబ్జీ(గేదెల బాబ్జీ), కొల్లి విజయ్, తదితరులు నడిపించారు. అప్పటి అధికారులూ అడ్డగోలుగా సహకరించారు. పంచాయతీ సెక్రటరీ మొదలు ఎంపీడీవో, నాటి డ్వామా పీడీ ఇలా అధికారులందరి మెడకూ అవినీతి ఉచ్చు బిగియనుంది.

పక్కా ఆధారాలతో నివేదిక సిద్ధం

విజిలెన్స్ అధికారులు గత కొన్ని నెలలుగా కొడాలి నాని అక్రమాలను వెలికి తీసేందుకు అన్ని రికార్డులను జల్లెడపడుతున్నారు. పక్కా ఆధారాలను సేకరించి నివేదిక సిద్ధం చేశారు. ప్రాథమికంగా సుమారు రూ.40 కోట్ల మేర నిధులు కొడాలి నాని బినామీ ఖాతాలకు బదిలీ అయినట్లు నిర్ధారించారు. ఇంత మొత్తంలో నిధులు బదిలీ అయినా క్షేత్రస్థాయిలో కేవలం రూ.8 కోట్ల విలువైన పని కూడా జరగలేదని విజిలెన్స్ అధికారుల నివేదిక స్పష్టం చేస్తోంది.

- మల్లాయపాలెం గ్రామ పంచాయతీ 2020 ఏప్రిల్ 25న నిర్వహించిన అత్యవసర సమావేశంలో మెరక తోలకానికి 16 మందికి వర్క్ ఆర్డర్లు ఇచ్చింది. వారిలో మందా చటర్జీ ఒకరు. ఈయనకు 0608542090107031 నంబరుతో వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఆయన పని పూర్తి చేసినట్లు నిర్ధారించిన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ 2022 జూలై 21న ఆయన ఖాతాలోకి రూ.1, 12, 25,642 నిధులు జమ చేశారు. ఈ నిధులు నాలుగు రోజులు తిరగక ముందే కొడాలి నాని బినామీ ఖాతాల్లోకి వెళ్లిపోయాయి. 2022 జూలై 28న నాని బినామీ కంపెనీ శ్రీనివాస గార్మెంట్స్‌కి రూ.50 లక్షలు చొప్పున రెండు విడతల్లో కోటి రూపాయలు చెక్ ద్వారా బదిలీ అయ్యాయి. 2022 ఆగస్టు 2న రూ.4లక్షలు శ్రీ సాయిరామ్ ఎంటర్‌ప్రైజెస్‌కు బదిలీ అయ్యాయి. 2022 ఆగస్టు 3న మరో వ్యక్తి ఖాతాలోకి రూ.7 లక్షలు బదిలీ అయ్యాయి.
- మందా చటర్జీ ఖాతాలోకి రెండోసారి 2022 ఆగస్టు 5న ప్రాజెక్టు డైరెక్టర్ డ్వామా నుంచి రూ.48,51,788 జమ అయ్యాయి. మరుసటి రోజే అంటే ఆగస్టు 6న ఈ నిధులు ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితులు ఈ మట్టి మాయాజాలానికి సూత్రధారుడైన సజ్జ శ్రీధర్ ఖాతాలో రూ.14,70,047 జమ అయ్యాయి. అదే రోజు కొల్లి విజయ్

మిగతా 6లో..

ఖరీఫ్ సీజన్‌లో ఎన్టీఆర్ జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ముందుకు కోతలు ప్రారంభించిన తిరువూరు డివిజన్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 872 మంది రైతుల నుంచి 5,979 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. డిసెంబర్ రెండో వారం నాటికి కొనుగోళ్లు ముమ్మరం కానున్నాయి.



ధాన్యం కొనుగోలు లక్ష్యం లక్ష మెట్రిక్ టన్నులు

ఎన్టీఆర్ జిల్లాలో అధికారుల నిర్ణయం

- తొలుత తిరువూరు డివిజన్‌లో కొనుగోళ్లు ప్రారంభం
- డిసెంబర్ రెండో వారం నాటికి ఊపందుకోనున్న కొనుగోళ్లు
- ఇప్పటి వరకు 872 మంది నుంచి 5,979 మెట్రిక్ టన్నుల కొనుగోలు

జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల రెండవ వారం నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. 5వ తేదీ నాటికే విజయవాడ, నందిగామ, తిరువూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 157 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 35,416 హెక్టార్లలో వరి పంట వేశారు. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 2,36,803 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి రావాల్సి ఉంది. ముందుగా తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కోతలు మొదలయ్యాయి. వరి కోతలపై ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ నిధి మీనా సివిల్ సప్లయిస్ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. జేసీ ఆదేశాల ప్రకారం సివిల్ సప్లయిస్ అధికారులు కూడా చాలా వేగంగా కోతల దశలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లకు సంసిద్ధంగా ఉన్నారు.

ముందస్తుగా గోనె సంచులు సిద్ధం

రైతులు ధాన్యం ఎగుమతి చేయటానికి వీలుగా వారికి గోనె సంచులను కూడా ముందస్తుగా సిద్ధం చేశారు. తిరువూరు రెవెన్యూ డివిజన్‌కు 2,88,853 గోనె సంచులు, విజయవాడ రెవెన్యూ డివిజన్‌కు 1,62,000, నందిగామ డివిజన్‌కు రూ.1,10,000 గోనెసంచులను రెడీ చేశారు. గోనె సంచులతో పాటు రైతు సేవా కేంద్రాలలో లేబర్‌తో పాటు 118 జీపీఎస్ ఏర్పాటు చేసిన రవాణా వాహనాలను కూడా అందుబాటులో ఉంచారు. అవసరం అన్న వారికి ముందుగా గోనెసంచులు, రవాణా వాహనాలను అందించారు. రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని తగిన సంఖ్యలో ఏర్పాటు చేశారు. అందరికీ ముందస్తుగా తగిన శిక్షణ కూడా ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరను అంతకంటే ముందుగానే క్వింటా ధాన్యానికి గ్రేడ్ - ఏ కు రూ.2,320, కామన్‌కు రూ.2,300, ధాన్యం 75 కేజీల బస్తా గ్రేడ్ - ఏ రూ.1,740, కామన్ రూ.1,725గా ధర నిర్ణయించినట్టు ప్రకటించారు.

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో 34 రైతు సేవా కేంద్రాలు

తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈ నెల ఒకటిన రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ డివిజన్‌లో అత్యధికంగా 34 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. విజయవాడ డివిజన్‌లో నాలుగు కొనుగోలు కేంద్రాలు, నందిగామ డివిజన్‌లో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సోమవారం నాటికి 872 మంది రైతుల నుంచి 5,979 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం మొత్తం విలువ రూ.13.86 కోట్లు కాగా రైతులకే అంతే వేగంగా ఇప్పటి వరకు రూ. 12.97 కోట్లను చెల్లించటం కూడా జరిగింది. మరో రూ. 89 లక్షలు చెల్లించటానికి సిద్ధంగా ఉన్నాయి.

ఒక్కో రైతు నుంచి 25 ఎకరాల ధాన్యం కొంటాం

రైతుల నుంచి ఒక పంట కాలంలో గరిష్ఠంగా 25 ఎకరాల ధాన్యం కొనుగోలు చేస్తాం. ఎంటీయూ 1282, ఎంటీయూ 1262 రకాలను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించాం. రైతులు దీనిని గమనించి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దు. వాతావరణ ప్రతికూల సమయంలో కూడా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యానికి కనీస ధర దక్కేలా అమ్ముకునే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డబ్బులను కూడా రైతుల ఖాతాలకు జమ చేస్తున్నాం. తిరువూరు డివిజన్‌లో 58 రైతు సేవా కేంద్రాలు, విజయవాడ డివిజన్‌లో 45, నందిగామ డివిజన్‌లో 54 రైతు సేవా కేంద్రాలలో పీఏసీఎస్, డీసీఎస్ఎంల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేయిస్తున్నాం. 112 రైతు సేవా కేంద్రాలలో పీఏసీల ద్వారా, 45 రైతు సేవా కేంద్రాల ద్వారా డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతోంది. తిరువూరు, విజయవాడ డివిజన్ల పరిధిలో రెండోసారి కూడా శిక్షణ ఇచ్చాం. నందిగామ డివిజన్ పరిధిలో ఈ వారంలోనే రెండోసారి శిక్షణ పూర్తి చేయిస్తాం. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తీర్చటానికి, పరిష్కరించటానికి జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా కంట్రోల్ రూమ్ నెంబర్ 7702203571 కు ఫోన్ చేయవచ్చు.

- టీవీ సతీష్,
ఎన్టీఆర్ జిల్లా డీఎం, సివిల్ సప్లయిస్

పత్తి రైతుపై కత్తి

సీసీఐ నిబంధనల గుదిబండ

- నామమాత్రంగా కొనుగోళ్లు
- దెబ్బతీసిన గులాబీ పురుగు
- నిబంధనలు సడలించకపోతే రైతు కోలుకోవడం కష్టం
- ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు



(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల) తెల్ల బంగారంగా పేరొందిన పత్తి పంట నేడు రైతుల పాలిట గుదిబండగా తయారైంది. ఒకవైపు దిగుబడి లేదు. మరోవైపు గిట్టుబాటు ధర లేదు. బాధిత రైతులను అక్కున చేర్చుకుని మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాల్సిన భారత పత్తి సంస్థ (సీసీఐ) నిబంధనల కత్తి ఝులిపిస్తున్నది. తూకంలో, ధరలో ఎడా పెడా కోత విధిస్తోంది. మిల్లుల వద్ద స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనటం లేదు. అధిక వ్యయప్రయాసలకు గురవుతున్న రైతులు, గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు తెగనమ్ముకుంటున్నారు. జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల పరిధిలో దాదాపుగా లక్ష ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. కౌలుతో కలిపి ఎకరానికి సగటున రూ. 50 వేలకు పైగా పెట్టుబడి అయింది. అధిక వర్షాలు, వరదల వల్ల చేలు దెబ్బతిన్నాయి. మహమ్మారి గులాబీ రంగు పురుగు దాడి చేసింది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరానికి ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. దీనికితోడు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోవటంతో రైతులు నిలువునా క్రుంగిపోయారు. సంక్షోభ సమయంలో ఆదుకోవాల్సిన సీసీఐ పరిహాసమాడుతుండటంతో రైతుల బాధలు చెప్పనలవి కావు.

పేర్లు నమోదుకు విముఖత

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సీసీఐ, సీఎం యాప్ ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నది. ఈ క్రాఫ్‌లో నమోదు చేసుకున్న రైతులు, తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లు తీసుకువెళ్లి తమ పేర్లు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాల్సి ఉంది. ప్రత్యేకంగా యాప్‌లో నమోదు చేయించుకున్న రైతుల వద్ద మాత్రమే సీసీఐ పత్తి కొంటున్నది. ఎక్కువ మంది రైతులు ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల్లో ఉన్న వారు తమ పేర్లు నమోదు చేయించుకోవటం లేదు.

వెలవెలబోతున్న మార్కెట్ యార్డులు

వ్యవసాయ మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా తయారయ్యాయి. గతంలో మాదిరిగా పత్తి కొనుగోళ్లు జరగకపోవటంతో యార్డులు వెలవెలపోతున్నాయి. నందిగామ, మైలవరం యార్డుల్లో పక్షం రోజుల క్రితమే సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిచినప్పటికీ, ఒక్క కిలో పత్తి కూడా కొనలేదు. మిగతా యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. నేరుగా మిల్లుల వద్దకు రైతులు తీసుకువచ్చిన పత్తినే సీసీఐ బయ్యర్లు కొంటున్నారు. బయ్యర్లు మాత్రం యార్డుల వైపు చూడటం లేదు. ఈ విషయం తెలియక కొంత మంది రైతులు, యార్డుల చుట్టూ తిరుగుతున్నారు.

తూకం, ధరలోనూ కోత

సీసీఐ నిబంధనల వల్ల రైతులకు ఏలాంటి ప్రయోజనం లేకపోగా, ఎంతో నష్టం జరుగుతున్నది. తేమ 12 శాతానికి మించి ఉందంటూ తూకంలో కోత పెడుతున్నారు. క్వింటాకు మూడు నాలుగు కిలోల వంతున తూకం తగ్గిస్తున్నారు. దీనికితోడు కేంద్రం ప్రకటించిన రూ. 7,521 మద్దతు ధర ఇవ్వటం లేదు. అతి కొద్ది మందికి మాత్రమే మద్దతు ధర దక్కుతుంగా, తేమ పేరుతో 90 శాతం మంది రైతులకు ధరలో కోత విధిస్తున్నారు. తేమ ఎనిమిది శాతం లోపు ఉండాలి. అయితే ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఒక్కొక్క శాతానికి రూ. 75.21ల వంతున ధర తగ్గిస్తున్నారు.

వ్యాపారులకు అమ్ముతున్న రైతులు

సీసీఐ గుంటూరుతో పాటుగా పలు చోట్ల జిన్నింగ్ మిల్లులను అద్దెకు తీసుకున్నది. ఈ మిల్లుల వద్దకు పత్తి తీసుకువెళ్లాల్సి ఉంది. ముఖ్యంగా కంచికచర్ల, నందిగామ ప్రాంతాల నుంచి గుంటూరు తీసుకువెళ్లేందుకు రవాణా, ఇతరత్రా ఖర్చులు కల్పిపి క్వింటాకు నాలుగు వందల వరకు వ్యయమవుతున్నది. అధిక వ్యయ ప్రయాసలు పడినప్పటికీ మద్దతు ధర ఎండమావి కావటంతో ఎక్కువ మంది రైతులు ధర తక్కువైనప్పటికీ ప్రైవేట్ వ్యాపారులకు తెగనమ్ముకుంటున్నారు. వ్యాపారులు పత్తి నాణ్యతను బట్టి క్వింటాకు రూ. 5500 నుంచి రూ. 6500 లోపు ధర ఇస్తున్నారు.

నామమాత్రంగా కొన్న సీసీఐ

మార్కెట్ యార్డులకు దూరంగా ఉంటున్న సీసీఐ మిల్లుల వద్ద కూడా చురుకుగా కొనటం లేదు. నిబంధనల కత్తెరతో ఆచితూచి కొంటున్నది. ఈనెల 24 వరకు జిల్లాలోని 1,556 మంది రైతుల నుంచి సీసీఐ 43,529.28 క్వింటాళ్ల పత్తి కొన్నది. ఈ పత్తి విలువ రూ. 31,21,86,418. సగటున క్వింటాకు రూ. 7,171.87 ధర ఇచ్చింది. ఇకనైనా సీసీఐ నిబంధనలు సడలించి, కోతల్లేకుండా, మద్దతు ధర ఇవ్వాలని, మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు చేయాలని రైతుల కోరుతున్నారు. ఈమేరకు పాలకులు కేంద్ర ప్రభుత్వం, సీసీఐపై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి, గాయాలతో బయటపడ్డ భర్త
- జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఘటన

6లో

గుడ్లవల్లేరులో రహస్య కెమెరాల్లేవ్

- స్నానాల గదుల్లో వీడియోలు తీయలేదు
- ఢిల్లీ, పుణె నిపుణులు నిర్ధారించారు
- అత్యున్నత స్థాయిలో విచారణ జరిగింది
- కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీ వెల్లడి

6లో

క్షణికావేశం!

- దంపతుల ఆత్మహత్యాయత్నం
- భార్య మృతి, ఆసుపత్రిలో భర్త


పిల్లలతో వాసవి (ఫైల్)


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపీకృష్ణ

మచిలీపట్నంటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇరువురిదీ వేర్వేరు కులాలు.. పెద్దలు కాదన్నా ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పదమూడేళ్లు కాపురం చేసారు.. ఇద్దరు పిల్లలు పుట్టారు.. అంతలోనే ఏం జరిగిందో ఏమో.. చిన్నపాటి మనస్పర్థలు.. పిల్లలున్నారని తెలిసీ క్షణికావేశంలో ప్రాణాలను పణంగా పెట్టారు. సూర్యోదయానికి ముందే ఎవరికీ తెలియకుండా ఆత్మహత్య చేసుకుందామనుకున్నారు. దానికి రైలు పట్టాలను ఎంచుకున్నారు. అంతే.. బుద్దాలపాలెంలో వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి పట్టాలపై ఒక్కఉదుటున దూకేశారు. యువతి అక్కడికక్కడే మృతి చెందగా.. యువకుడు రైలు తాకిడికి పట్టాలకు దూరంగా వెళ్లి పడ్డాడు. దీంతో చేతికి బలమైన గాయమైంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈడేపల్లికి చెందిన ఉప్పాల గోపీకృష్ణ(36) 2011లో వాసవి(32)ని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. గోపీకృష్ణ జొమోటో కంపెనీలో పని చేస్తున్నాడు. వాసవి స్వీట్స్ దుకాణంలో పనిచేస్తోంది. వీరికి ఎనిమిదేళ్ల బాలుడు, ఆరేళ్ల బాలిక ఉన్నారు. వీరి మధ్య ఇటీవల తీవ్ర మనస్పర్థలు ఏర్పడ్డాయి. గోపీకృష్ణ తన పెంపుడు కుక్కను తీసుకువెళ్లి చికిత్స చేయాలని మూడు నెలల క్రితం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో గోపీకృష్ణ మానసికంగా ఒత్తిడికిలోనై భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి చెంది క్షణికావేశంలో ఇద్దరూ ఆత్మహత్య చేసుకునేందుకు సోమవారం ఉదయం బైక్‌పై వెళ్లారు. బుద్దాలపాలెం వద్ద ఉదయం 4 గంటలకు గుడివాడ నుంచి వస్తున్న రైలు కింద దూకేందుకు ప్రయత్నించగా భార్య తీవ్రంగా వారించి నచ్చచెప్పింది. గోపీకృష్ణ ససేమిరా అనడంతో ఇద్దరూ రైలుపట్టాలపై దూకారు. వాసవి అక్కడికక్కడే మృతి చెందగా.. పట్టాలకు పక్కగా పడిన గోపీకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిని కోల్పోయిన పిల్లలు వెక్కి వెక్కి ఏడుస్తుంటే ఓదార్చడం బంధువుల వల్ల కాలేదు. వాసవి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీమ్ ఎన్టీఆర్

- సమష్టిగా సమగ్రాభివృద్ధి సాధిద్దాం
- ఎన్టీఆర్ జిల్లా టాప్-3లో ఉండాలి
- ఏ శాఖలోనూ పెండింగ్ కనిపించొద్దు
- పర్యాటకం, స్కిల్ డెవలప్‌మెంట్స్‌పై దృష్టి
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు జిల్లా వేదిక కావాలి
- జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ


సమావేశానికి హాజరైన ఎన్టీఆర్ జిల్లా అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

'టీమ్ ఎన్టీఆర్‌గా జిల్లాను నెంబర్ వన్ చేద్దాం.. జిల్లాలో అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధిని సాధిద్దాం. గత కలెక్టర్లు వేసిన బాటలో.. ప్రజాప్రతినిధుల సహకారం, అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రగతిని సృష్టిద్దాం.. ఎన్టీఆర్ జిల్లా అంటే టాప్-3లో ఉండేలా అంతకు మించి అగ్రస్థానంలో కొనసాగేలా కృషి చేద్దాం' అని జిల్లా నూతన కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం లక్ష్మీశ ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో జేసీ నిధి మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్యల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్న లక్ష్మీశ నేరుగా కార్యాలయానికి వచ్చారు. పురోహితుల ఆశీర్వాదాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ బాధ్యతలు స్వీకరించారు.

జీరో పెండింగ్‌తో సత్ఫలితాలు

జిల్లా యంత్రాంగం పరిధిలో ఏ శాఖలోనూ పెండింగ్ అనేది కనిపించకూడదని చెప్పారు. జీరో పెండింగ్ ద్వారా సత్ఫలితాలు సాధింగలమని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంచేలా అందరం సమష్టిగా పనిచేద్దామన్నారు. టాప్-3లో నిరంతరం ఉండేలా లక్ష్యాలను నిర్దేశించి ఆచరణలో అమలు చేసి చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను విస్తృతంగా ముందుకు తీసుకు వెళ్లాలని, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను నూరుశాతం దిగ్విజయంగా అమలు చేద్దామని చెప్పారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుందామన్నారు.

● గతంలో ఏ కలెక్టర్ చేయని విధంగా జిల్లా యంత్రాంగం అతి ముఖ్యమైన రెవెన్యూశాఖకు సంబంధించి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందరితో ఒకేసారి ఇంటరాక్ట్ అయ్యారు. ప్రతి ఒక్కరి పేరునూ అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయిలో పెండింగ్ లేకుండా ఇకపై సరికొత్త పాలన అందిద్దామని సూచించారు.

హెల్ప్‌డెస్క్ పరిశీలన..

కలెక్టర్ లక్ష్మీశా గ్రీవెన్స్ నిర్వహిస్తూనే అర్జీదారుల హెల్ప్‌డెస్క్ కేంద్రాన్ని పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌లో అర్జీదారులకు ఎలాంటి సహాయం అందుతుంది? అర్జీలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేస్తున్నారు? ఆయా శాఖలకు ఏ విధంగా పంపుతున్నారు? నెట్‌వర్క్ స్పీడ్ ఎలా ఉంది వంటి అంశాలను పరిశీలించారు. వరద బాధితులకు సంబంధించిన దరఖాస్తులను అప్‌లోడ్ చేయాల్సిందిగా సిబ్బందికి సూచించారు.

జిల్లాకు రావటం ఆనందంగా ఉంది

రాష్ట్రంలో కీలకమైన ఎన్టీఆర్ జిల్లాకు కలెక్టర్‌గా రావటం ఆనందంగా ఉంది. కీలకమైన జిల్లాకు కలెక్టర్‌గా ప్రజలకు సేవలందించే అవకాశాన్ని నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పగించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తాం. సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతాం.

సీఎం చంద్రబాబును కలిసి..



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశ గ్రీవెన్స్ అనంతరం సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువచేయాలని లక్ష్మీశాకు ముఖ్యమంత్రి సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు

జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశాను జేసీ నిధి మీనా అభినందించారు. మునిసిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఈవో యూవీ సుబ్బారావు, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ జి.సుమన్, డీఎస్‌వో పాపారావు, డీపీవో పి.లావణ్యకుమారి, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, సీపీవో వై శ్రీలత, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, డీఎం సివిల్ సప్లయిస్ తోట వెంకట సతీష్, మార్క్‌ఫెడ్ డీఎం కె.నాగమల్లిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్ విద్యాసాగర్, ఏపీఎంఐపీసీ పీడీ పీఎం సుభాని తదితరులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

గడువులోగా పరిష్కరించాల్సిందే

- క్షేత్రస్థాయి అధికారులతో నిరంతర సమన్వయం అవసరం
- పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 71 అర్జీలు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనను ప్రజలకు మరింత చేరువచేసే ఉద్దేశ్యంతో, ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమం ద్వారా అందే ప్రతి అర్జీని నిర్దిష్ట గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, డీఆర్ఓ ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీ అందిన వెంటనే క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొంటూ నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. పీజీఆర్ఎస్ అర్జీలతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, నైపుణ్యాభివృద్ధి తదితరాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్య పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందు నిలిపేలా టీం ఎన్టీఆర్ కృషి చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. అర్జీల పరిష్కార ప్రక్రియ పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియతో పాటు హెల్ప్ డెస్క్‌లను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ

మచిలీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపరిష్కార వేదిక అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ప్రజాసమస్యలపై వచ్చిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు.

మచిలీపట్నంనగరం కాలేఖానోపేటకు చెందిన వీరరాఘవులు తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారిని పాఠశాలలో చేర్పించేందుకు ఆధార్‌కార్డులు ఇప్పించాలని కోరుతూ అర్జీఅందజేశారు. పెనమలూరుమండలం గంగూరుకుచెందిన జి.శిరీష తాను దివ్యాంగురాలినని, పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేసింది. ఓబీసీ కులగణన చేయాలని కోరుతూ జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేవీవీ సత్యనారాయణ, అందేజగదీష్, పి నాగరాజు అర్జీ అందజేశారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దత్తత వారోత్సవాలలో భాగంగా మాతృత్వం ఒక వరం, దత్తత దానికి మరోమార్గం అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వివిదశాఖల అధికారులు మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో

రహస్య కెమెరాల్లేవ్

- స్నానాల గదుల్లో వీడియోలు తీయలేదు
- ఢిల్లీ, పుణె నిపుణులు నిర్ధారించారు
- అత్యున్నత స్థాయిలో విచారణ జరిగింది
- కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీ వెల్లడి

గుడ్లవల్లేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ) మహిళా హాస్టల్ స్నానాల గదుల్లో రహస్య కెమెరాలు పెట్టారన్న ఆరోపణల్లో నిజం లేదని కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు. 'మహిళా హాస్టల్ స్నానాల గదుల్లో ఎలాంటి రహస్య కెమెరాలు పెట్టలేదు. ఫొటోలు, వీడియోలు తీయలేదు. అన్నిరకాల అత్యాధునిక టెక్నాలజీతో నిర్వహించిన పరిశోధనల్లో ఈ విషయం తేలింది' అని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్ సోమవారం రాత్రి సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. హాస్టల్ విద్యార్థినులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేసు మెరిట్స్‌పై దర్యాప్తు చేసినట్టు పేర్కొన్నారు. 'ఈ ఏడాది ఆగస్టు 29వ తేదీ రాత్రి ఎస్ఆర్‌జీఈసీ మహిళా హాస్టల్లో నాలుగు, మూడో సంవత్సరం విద్యార్థినులు ఉండే ఫ్లోర్‌లో కామన్ బాత్రూమ్‌లలో ఎవరో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి తమ వీడియోలు తీశారని, అవి బయటికి వస్తున్నట్టుగా తోటి విద్యార్థులు చెప్పారని ఆందోళన చేపట్టారు. యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థినులతో లిఖితపూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. సున్నితమైన అంశం కావడంతో ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్, ఎస్పీ, పలువురు ఎమ్మెల్యేలను అక్కడికి పంపించారు. బాంబ్ డిస్పోజబుల్ టీమ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థినులను టీమ్‌గా ఏర్పాటు చేసి వారందరి సమక్షంలో ఎన్ఎల్‌జేడీ పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేయించారు. ఎలాంటి రహస్య కెమెరాలూ లేవని తేలింది. కేసు తీవ్రత దృష్ట్యా సీఎం చంద్రబాబు... ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌తోపాటు ముగ్గురు ఐపీఎస్‌లతో అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. వారి పర్యవేక్షణలో దర్యాప్తు చేయించారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సీఈఆర్‌టీ-ఐఎన్ (న్యూఢిల్లీ)తో పాటు పుణె నుంచి సీ-డాక్ సైంటిస్టులను పిలిపించి కాలేజీలోని అన్ని కంప్యూటర్ల సంబంధిత డేటాను క్షుణ్ణంగా తనిఖీలు, విశ్లేషణలు నిర్వహించారు. పలువురు విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లను కూడా తనిఖీ చేయించారు. ఎటువంటి పొరపాట్లు జరగలేదని నిర్ధారించారు. పలు యూట్యూబ్, సోషల్ మీడియా చానల్స్‌ను విచారించగా.. మహిళా హాస్టల్ బాత్రూమ్ వీడియోలు, సాక్ష్యాధారాలు తమ వద్ద ఉన్నట్టుగా చెప్పలేదు. ఎక్కడా రహస్య కెమెరాలు వాడలేదని నిర్ధారణ అయింది' అని కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు.


గుడ్లవల్లేరులో మోడ్రన్ అంగన్వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించిన నటుడు కబీర్ బేడి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మోడ్రన్ అంగన్వాడీ పాఠశాల ప్రారంభం


గుడ్లవల్లేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేర్ టు యాక్ట్ ఇటలీ సంస్థ ఆధ్వర్యంలో పేద వర్గాలను ఆదుకొనే మంచి కార్యక్రమాలు నిర్వహిచడం అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు ఇందిరా కాలనీలో ఇటలీకి చెందిన కేర్ టు యాక్ట్ సంస్థ రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన మోడ్రన్ అంగన్వాడీ ప్రీ ప్రైమరీ పాఠశాలను బాలీవుడ్ నటుడు కబీర్ బేడితో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. రాష్ట్రంలో పేద వర్గాలకు ఆర్థిక ప్రగతి చేకూర్చేలా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ మోడ్రన్ అంగన్వాడీ పాఠశాలే ఉదాహరణ అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేసేందుకు ముందుకురావాలని రాము అన్నారు. నటుడు కబీర్ బేడీ మాట్లాడుతూ, ప్రజలకు మంచి చేయాలనుకొనే ఇటువంటి సంస్థలకు ప్రజా ప్రతినిధుల సహకారం ఎనలేనిదని కొనియాడారు. తొలుత ఇటలీ సంస్థ ప్రతినిధులను గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా కబీర్ బేడీ కోలాట నృత్యం చేయగా వారితో ఇటలీ ప్రనిధులు జతకలిశారు. కార్యక్రమంలో ఏపీ వేర్‌హౌసింగ్ సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన గుడివాడ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, వల్లభనేని వెంకట్రావు, వెంకట సుబ్బారావు చౌదరి, చాపరాల బాలాజీ, పొట్లూరి రవికుమార్, జంగం మోహనరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా చాంపియన్ కృష్ణా

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పటమట జడ్పీ ఉన్నతపాఠశాలలో రెండురోజులపాటు జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ అండర్-13 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి కృష్ణా జట్లు చాంపియన్‌షిప్ వశం చేసుకున్నాయి. క్రీడాకారులు తిరుగులేని ఆధిక్యత కనబరిచి విజేతలుగా నిలిచారు. బాలుర ఫైనల్స్‌లో అనంతపురంపై 15-9, 15-11తో, బాలికల ఫైనల్స్‌లో పశ్చిమగోదావరిపై 15-6, 15-2తో జయభేరి మోగించాయి. రెండు విభాగాల్లో మూడో స్థానాల్లో తూర్పుగోదావరి, నెల్లూరు జట్లు నిలిచాయి. ట్రోఫీల ప్రదానోత్సవంలో కేజీబీవీ పాఠశాలల రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానంద్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.రమేష్, హెచ్ఎం ఎం.శాంతి, రాష్ట్ర మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ కోశాధికారి ఎస్.రాఘవులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్టు పరిశీలకుడు ఏపీ రాజు ప్రకటించారు.

బాలురు జట్టు : ఎండీ జాకీర్ అహ్మద్, ఎస్.కార్తీక్(కృష్ణా), ఎం.రేవంత్(అనంతపురం), జి.సందీప్(తూర్పుగోదావరి), కె.అభిలాష్(పశ్చిమగోదావరి), బాలికలు: వి.కావ్య, ఎండీ రెహ్మానా(కృష్ణా), కె.వర్షిణి(పశ్చిమగోదావరి), ఎన్ కవిత(నెల్లూరు), ఎం భానుప్రియ(అనంతపురం).


క్యారమ్స్‌లో విజేతలతో మురళీకృష్ణ

ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ విజేతలు వీరే

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ విజేతలను జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ అభినందించారు. విజేతలను డిసెంబరు 7, 8వ తేదీల్లో చిత్తూరులో జరిగే ఏపీ రాష్ట్ర మూడో ర్యాంకింగ్ టోర్నీకి ఎంపిక చేసినట్టు తెలిపారు. పురుషుల సింగిల్స్‌లో వి.శ్రీనివాసరావు, జి.జార్జి జిజియానంద్, కె.ఉమామహేశ్వరరావు, టి.వంశీ, సీహెచ్ శ్యామ్‌ప్రకాష్, టి.కాలేబురాజు, ఎస్.శ్రీనుబాబు, సీహెచ్ సందేశ్, 50 సంవత్సరాల పైబడిన విభాగంలో జె.దుర్గాప్రసాద్, కె.సుజన్‌కుమార్, సురేష్‌కుమార్, ఎ.సత్యనారాయణలు విజయం సాధించారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్కే అజ్మతుల్లా వ్యవహరించారు.


ఫెర్రీ వద్ద మున్వర్ మృతదేహాన్ని బయటకు తెస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

పోలవరం కాల్వలో గల్లంతైన రెండో యువకుడు మృతి

చిట్టినగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలవరం కాలువలో గల్లంతైన యువకులు ఇద్దరూ మృతిచెందారు. వారిలో శివతేజ(18) మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణానదిలో ఆదివారం గుర్తించగా.. మరో యువకుడు ఎండీ మున్వర్ (18) మృతదేహాన్ని సోమవారం అదే ప్రాంతంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన శివతేజ, మున్వర్‌లు ఈ నెల 22న పోలవరం కాలువ ఆంజనేయస్వామి గుడి ప్రాంతంలో ఫోటోలు మోజులో ప్రమాదవశాత్తు పోలవరం కాలువలో పడి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది 22వ తేదీ రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. 24వ తేదీ సాయంత్రం ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద శివతేజ మృతదేహాన్ని, 25వ తేదీ సోమవారం మున్వర్ మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విజయవాడ - రాయనపాడు రైల్వే లెవల్ క్రాస్ గేట్ మూసివేత

రైల్వేస్టేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-రాయనపాడు మధ్య రైల్వే ట్రాక్ పై అభివృద్ధి పనులు జరుగుతున్నందున గొల్లపూడి టూ జక్కంపూడి రైల్వే లెవల్ క్రాస్ గేట్ (150)ను ఈనెల 27, 28 తేదీలలో మూసివేస్తున్నట్లు సంబంధిత రైల్వే అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు రైల్వే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి

విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించండి.. హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలు, కాలేజీల్లో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేతిరెడ్డి అఖిల శ్రీ గురుతేజ ఈ పిల్ దాఖలు చేశారు. అగ్నిమాపక పరికరాలు ఏర్పాటుకి సంబంధించి జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకాలు అమలు చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. అలాగే పోక్సో చట్టాన్ని అనుసరించి సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలలు, కాలేజీల్లోని బోధన, బోధనేతర సిబ్బంది పూర్వాపరాలకు సంబంధించి పోలీసు వెరిఫికేషన్ చేసేలా ఆదేశించాలని అభ్యర్థించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ, హోంశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శులు, డీజీపీ, ఉన్నత విద్యామండలి చైర్మన్, విపత్తు నిర్వహణ శాఖ డీజీ, తదితరులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల్లో అగ్నిమాపక పరికారాలు ఏర్పాటు చేయాలని 2004లో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. 2017లో ఇదే విషయాన్ని మరోసారి పునరుద్ఘాటించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 59,186 పాఠశాలలు ఉండగా అందులో 23,452 స్కూళ్లలోనే అగ్నిమాపక పరికారాలు ఉన్నాయి.

అగ్నిమాపక శాఖ నుంచి ఏ పాఠశాల కూడా నిరభ్యంతర పత్రం పొందలేదు. ప్రభుత్వ పాఠశాలలు నిరభ్యంతర పత్రం పొందాల్సిన అవసరం లేదని సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన సమాచారంలో అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించేలా అధికారులను ఆదేశించండి అని వ్యాజ్యంలో కోరారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు, ప్రభుత్వ కాలేజీల్లో పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ కోటాలో భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉన్నత విద్యాశాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. సెట్‌లో అర్హత సాధించనివారు, పీజీసెట్‌కు హాజరుకానివారికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించవచ్చని ఉన్నత విద్యామండలికి స్పష్టంచేశారు. ఈ కోటాలో అడ్మిషన్లు పొందేవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదన్నారు.

ఎస్ఎంసీ విధులపై స్పష్టత ఇవ్వాలి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) విధులపై స్పష్టతనిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్ఎంసీలకు నిర్దేశించిన పనుల భారం ఉపాధ్యాయులపై పడకుండా చూడాలన్నారు. అలాగే ఎస్ఎంసీలు మరింత బలోపేతం కావాలంటే వారికి గౌరవ వేతన ఇవ్వాలని సూచించారు.

డీవైఈవో పోస్టుల్లో ఏడీలను రిలీవ్ చేయాలి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలానికి పైగా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల్లో కొనసాగుతున్న అసిస్టెంట్ డైరెక్టర్లను వెంటనే రిలీవ్ చేయాలని నవ్యాంధ్ర టీచర్ల సంఘం అధ్యక్షుడు కరణం హరికృష్ణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఆ స్థానాల్లో నియమించాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలో 22 మంది ఏడీలు... డీవైఈవో పోస్టుల్లో కొనసాగుతున్నారని, ఎక్కువకాలం వారు కొనసాగటం వల్ల విద్యా వ్యవస్థ పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.

కాగ్‌తో సీఆర్‌డీఏ ఆడిట్

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : సీఆర్‌డీఏకు సంబంధించి జమలు, వ్యయంపై ఏప్రిల్ 1, 2019 నుంచి మార్చి 31, 2014 వరకు ఆడిట్ నిర్వహణ బాధ్యతలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జీవో నెం.107లో సూచించిన నిబంధనల మేరకు ఆడిట్ నిర్వహిస్తారని పేర్కొంది.

కొడాలి మెడకు మెరక ఉచ్చు

(5వ పేజీ తరువాయి)

ఖాతాలోకి రెండు విడతలుగా రూ.18,30,047, రూ.13,50,047 జమ అయ్యాయి. అదే రోజు మదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌కి రూ.2,00,014 జమ అయ్యాయి

● బలుసుపాటి రాంప్రసాద్ పేరుతో 060854209010170306 నంబరుతో వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఈయన పనులు పూర్తి చేసినట్లు నిర్ధారించి 2021 జనవరి 25న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆయన ఖాతాలోకి రెండు విడతలుగా రూ.37,25,340 చొప్పున జమ చేశారు. ఆ నిధులు అదే రోజున ఆయన రూ.40 లక్షలు, రూ.34 లక్షలు చొప్పున నగదు రూపంలో డ్రా చేశారు.

● మల్లిపెద్ది అభిషేక్ పేరుతో 060854209010170307/70309 నంబర్లతో రెండు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. ఈయన పని పూర్తి చేసినట్లు నిర్ధారించిన డ్వామా పీడీ 2022 జూలై 21న రూ.1,12,25,642 కోట్లు ఆయన ఖాతాలో జమ చేశారు. ఈ నిధులు మరుసటి రోజే శివ గోల్డ్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.42 లక్షలు, శ్రీలలిత ఫిష్ ప్యాకింగ్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.22 లక్షలు, ఎస్ఎస్ఆర్ ఆక్వాఫీడ్స్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.48 లక్షలు జమ అయ్యాయి.

● మందా దీప్తి పేరుతో వర్క్ ఆర్డర్ తీసుకోగా ఆమె ఖాతాలోకి డ్వామాపీడీ రూ.2.24 కోట్లు 2022 జూలై 15న జమ చేశారు. సరిగ్గా వారం రోజులు తిరగకముందే అంటే జూలై 21న మందా దీప్తి ఖాతా నుంచి రామకృష్ణా టౌన్‌షిప్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.2.15 కోట్లు జమ కావడం గమనార్హం.

ఇవన్నీ కొడాలి నాని, ఆయన అనుచరుల బినామీ ఖాతాలు కావడం గమనార్హం. రామకృష్ణా టౌన్‌షిప్ పేరుతో హైదరాబాద్‌లో కొడాలి నాని ఆయన అనుచరులు ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఖాతాదారుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు

వర్క్ ఆర్డర్లు ఇచ్చిన వారంతా సామాన్యులు కావడం వారి బ్యాంకు ఖాతాల్లో పెద్ద ఎత్తున డబ్బులు వచ్చిపడటంతో జీఎస్టీ విభాగం వీరందరికీ నోటీసులు ఇచ్చి, జీఎస్టీ చెల్లించాలని ఆదేశించింది. ఈ నోటీసులతో బిత్తరపోయిన ఖాతాదారులు తాము ఇంత డబ్బు ఎక్కడి నుంచి తీసుకొచ్చి కడతామని గగ్గోలుపెడుతూ తమ ఖాతాలను ఉపయోగించుకున్న వైసీపీ నేతలకు వద్దకు వెళ్లి నిలదీశారు. అప్పటికే వచ్చిన డబ్బును కాజేసిన వైసీపీ నేతలు తమకు సంబంధం లేదని చేతులు ఎత్తేశారు. దీంతో వారంతా అధికారుల వద్దకు వచ్చి జరిగిన అన్యాయాన్ని వివరించడంతో విజిలెన్స్ అధికారులు వారి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. అలాగే బ్యాంకు స్టేట్‌మెంట్లను సేకరించిన విజిలెన్స్ అధికారులు ఆ ఖాతాల నుంచి ఎవరెవరికి డబ్బులు వెళ్లాయో పరిశీలించగా నాని బినామీల ఖాతాల్లోకి వెళ్లినట్లు తేలింది. ఈమేరకు నివేదిక సిద్ధం చేసిన విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ నివేదిక అందిన తర్వాత ఏసీబీ ద్వారా ప్రాథమిక దర్యాప్తు చేయించి కేసు నమోదు చేయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్ : మహిళా, శిశు సంరక్షణాభివృద్ధిశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి సువర్ణ తెలిపారు. మిషన్ వాత్సల్య కింద అవుట్‌రీచ్ వర్కర్లు 1, మేనేజర్ పోస్టు 1, పార్ట్‌టైం వైద్యులు 1, ఆయా 1, చౌకీదార్ 1, కుక్ 1, హెల్పర్‌కం నైట్‌వాచ్‌మెన్ 1, యోగా ఇన్‌స్ట్రక్టర్ 1, ఎడ్యుకేటర్ 1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిషన్ శక్తి పథకం కింద పారా మెడికల్ 1, సెక్యూరిటీగార్డు 1, నైట్‌గార్డు 3, మిషన్ సాక్ష్యం పథకం కింద బ్లాక్ కో-ఆర్డినేటర్ 1 పోస్టులకు డిసెంబరు 7లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

7న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశాన్ని డిసెంబరు 7న నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని 45వేల పాఠశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించాలన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొనే అవకాశం ఉంది. జిల్లాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో పాల్గొంటారు. పాఠశాలల్లో బోధన మెరుగుపరచడం, వసతుల అభివృద్ధి లక్ష్యాలతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	108, 117, 128
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 595

సైబర్ మోసాలు, బ్యాంకింగ్ సమస్యలపై అవగాహన నేడు

లబ్బీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంక్ వినియోగదారుల సమస్యలు, పరిష్కారాలు, సైబర్ మోసాలు ఇతర బ్యాంకింగ్ సమస్యలపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఫార్చ్యూన్ మురళీలో టౌన్ హాల్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ మెట్రో రీజియన్ ఆర్ఎం సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 4గంటలకు జరుగుతుందన్నారు. బ్యాంక్ కస్టమర్స్ ఈ సదస్సులో పాల్గొని బ్యాంకింగ్ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారాలు తెలుసుకోవచ్చని, వినియోగదారులకు బ్యాంక్ అందించే సౌకర్యాలు తెలుసుకోవడంతో పాటు అవసరమైన సలహాలు, సూచనలు అందించవచ్చని ఆయన తెలిపారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు



ప్రసంగిస్తున్న పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు

గుణదల/లబ్బీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, ప్రేమ పేరుతో మోసం చేసే ఆలోచన చేసినా అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి .రాజశేఖరబాబు హెచ్చరించారు. నగరంలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో మహిళా ఎన్‌పవర్‌మెంట్, తరుణీ తరంగాలు సంయుక్తంగా సోమవారం మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై తీసుకునే చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి చ్చేసిన రాజశేఖరబాబు మాట్లాడుతూ కళాశాలలు వదిలే సమయంలో, ప్రారంభ సమయంలో కొంతమంది ఆకతాయిలు కళాశాలల వద్దకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ నేపథ్యంలో లైవ్ డ్రోన్ కెమెరాలతో పహారా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్య వేక్షిస్తామని చెప్పారు. డ్రోన్ కెమెరాలకు చిక్కకుండానే ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారి వివరాలను తెలియ జేయడానికి 112కు, 100కు కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలో మా సిబ్బంది మీ ముందు ఉంటారన్నారు. ఈవ్‌టీజింగ్ కేసులో పట్టుబడ్డ వారికి మరోమారు అలాంటి ఘటనలకు పాల్పడాలంటే వణుకు పుట్టే లా కఠినమైన కేసులు బనాయించనున్నట్లు హెచ్చరించారు. విద్యార్థినులు ప్రేమ పేరుతో యువకులు చేసే మోసానికి బలైపోకుండా బుద్ధిగా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ, డాక్టర్ ఆర్.మాధవి, తరుణీ తరంగాలు వైస్ ప్రెసిడెంట్ విద్యాఖన్నా, ఉమెన్ సెల్ కన్వీనర్ ఎస్.సుధారాణి పాల్గొన్నారు.

నలుగురికి ఉద్యోగ నియామక పత్రాలు

గుణదల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకం కింద హోంగార్డులుగా నలుగురికి ఉద్యోగ నియామక పత్రాలను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సోమవారం అందజేశారు. నగరంలో పనిచేస్తూ హోంగార్డులుగా ఉన్న వారు మరణించినా, పదవీ విరమణ చేసినా వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా చేయడానికి నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు ఒకరోజు వేతనాన్ని సాయంగా అందజేస్తున్న విషయం విదితమే. ఇదే సమయంలో నగర పోలీస్ కమి షనర్ హోంగార్డు కుటుంబాలకు వెన్నుదన్నుగా ఉండాలన్న సదుద్దేశంతో పలు కారణాలతో మరణించిన హోంగార్డు భార్యలకు హోంగార్డుగా ఉద్యోగావకాశం కల్పించారు. సీపీ తన కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఈ మేరకు పలు కారణాలతో మరణించిన నలుగురు హోంగార్డుల భార్యలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హోంగార్డుల ఆర్ఐ కె.సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా న్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్ర, 11కేవీ కళానగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్ర బాబు తెలిపారు. నాగేంద్రనగర్, 10ఎంజీడీ రోడ్, కళానగర్, ఎలిసమ్మ హోటల్ ప్రాంతం, పూర్ణచంద్ర నగర్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.

భారతీనగర్: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్ స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరి బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ(1,2,3,4,5) రోడ్లల్లో, సీటీవో కాలనీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు.

ముగిసిన సంప్రోక్షణ

లబ్బీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్యాణ మండపంలో గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న సంప్రోక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పండితులు

టీటీడీ కల్యాణ మండపంలో భోగశ్రీనివాసమూర్తి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగు రోజుల నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో సోమవారం ఉదయం 7గంటలకు సుప్రభాత్రం, 7.30 నుంచి 9.30వరకు యాగశాల వైదిక కార్యక్రమాలు, మహాపూర్ణాహుతి నుంచి యాత్రదానం, కుంభ ప్రదక్షిణ, సుముహూర్తం, ఉత్తరా నక్షత్ర యుక్త మకర లగ్నం ఉదయం 11.20 నుంచి 11.50 మధ్య కళావాహన, అక్షతారోహణ, బ్రహ్మఘోష, అర్చక బహుమానం, యజమాన ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ఆలయ ప్రవేశం నిర్వహించగా ఈ కార్యక్రమాన్ని వీక్షించిన భక్తులు పరవశించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రాధాన్యం: ఎమ్మెల్యే గద్దె



సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థిక పురోభివృద్ధి సాధ్యపడుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 12 లక్షల విలువైన 14 చెక్కులను సోమవారం బాధితులకు నేరుగా అందజేశారు. 2, 7, 12 డివిజన్లలో బాధితులకు చెక్కులను అందజేసిన ఆయన స్థానికులతో మాట్లాడుతూ ఆర్థికంగా రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షన్లు, సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధికి నిధుల మంజూరు వి షయంలో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయించు కున్న వారు ఈ తరహా సహాయాన్ని పొందేందుకు ముందుకు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాణిగారితోట: పేద ప్రజలను ఆదుకునేం దుకు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాణిగారితోట 18వ డివిజన్‌లో ఒక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దాంట్లోనే తోటి వారికి సహాయం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలని, తోటి వారికి సాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందన్నారు. అనంతరం పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేముల దుర్గారావు, పీరుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర



అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీల ను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికా రులను ఆదేశించారు. సోమవారం చిట్టినగర్ స ర్కిల్-1 కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరి ష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సర్కిల్-2,3తోపాటు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న ఫిర్యాదుల స్వీకరణను పరిశీలించారు. సర్కి ల్-1లో రెండు ఫిర్యాదులు, ప్రధాన కార్యాల యంలో 11ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్ర మం జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, ఈఈ వెంక టేశ్వరరెడ్డి, డిప్యూటీ సిటీప్లానర్ చంద్రబోస్, ఇన్ చార్జి అసిస్టెంట్ కమిషనర్ హెలెన్, శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు, శివరామ్‌ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి, మరొకరికి గాయాలు

జగ్గయ్యపేట రూరల్: జాతీయ రహదారిపై చిల్లకల్లు సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో విజయవాడ అశోక్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు తీవ్ర గాయాల య్యాయి.బాధితుడిని స్థానికులు జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు.

● బొలేరో వాహనం నుంచి వృద్ధుడు జారిపడి గాయపడ్డాడు. బాధితుడిని తెలంగాణాలోని మధిరకు చెందిన వెంకటేశ్వర్లు (70)గా గుర్తించారు. బాధితుడిని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తర లించారు. వైద్యులు చికిత్స అందించేలోగా మృతి చెందినట్టు తెలిపారు. రెండు ఘటనల్లో కేసు నమోదు చేసి వేర్వేరుగా దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయొద్దు

పాయకాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కండ్రిక ప్రధాన రహదారి వెంబడి ఉన్న 12 బడ్డీ కొట్లను తొలగించి చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయడం సరైన విధానం కాదని సీఐటీయూ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు అన్నారు. 64వ డివిజన్ కండ్రిక రహదారి వెంబడి ఉన్న బడ్డీకొట్లను నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా కె. దుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరంలోని అనేక ప్రాంతాల్లో చిరు వ్యాపారుల ఉపాధిని దెబ్బ తీస్తున్నారని ధ్వజమెత్తారు. తొలగించిన బడ్డీ కొట్ల యథాస్థానంలో వ్యాపారాలు చేసుకొనుటకు అనుమతించాలని అధికారులను కోరారు. జి.ఝాన్సీ, భూపతి రమణారావు, శ్రీనివాస్, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చండి

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు చంద్రబాబు పేద వారి సొంత ఇంటి కల నెరవేరుస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు కోరారు. 58వ డివిజన్‌లోని సీపీఐ కార్యాలయం వద్ద సోమవారం అర్జీలు పూరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాల్లో ఇల్లు లేని వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, నిర్మాణ ఖర్చులకు రూ. 4 లక్షలు అందిస్తామన్న హామీని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలయిందని ఇంటి కల నెరవేర్చే విధంగా సీఎం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 27న కలెక్టర్ కార్యాలయంలో అర్జీలను అందజేస్తామని తెలిపారు.

సేల్స్‌మన్‌పై దాడి

బాధితుడికి తీవ్ర గాయాలు

వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): పాతగొడవల నేపథ్యంలో సేల్స్ మన్‌పై ఇద్దరు దాడిచేసిన ఘటనలో సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మల్లికార్జునపేటలో ఏల్చూరి వెంకటసూర్య ఉంటున్నాడు. ఇతను బ్రాహ్మణవీధిలోని సబ్బుల కంపెనీలో పనిచేస్తున్నాడు. గన్నవరం మండలం పురు షోత్తమపట్నంలో ఆదివారం అమ్మమ్మ వద్దకు వెళ్లి ఇంటికి వెళుతుండగా ముద్దర బోయిన నాగరాజు, పేటేటి మహేందర్ సూర్యను ఆపి అసభ్యకర వ్యాఖ్యలతో చంపుతామని బెదిరించారు. నాగరాజు బీరు సీసాతో సూర్య తలపై కొట్టాడు. మిగిలిన వారు దాడి చేయడంతో తీవ్ర గాయాల య్యాయి. బాధితుడు కిందపడిపోవటంతో స్థానికులు చూసి అతని కుటుంబ సభ్యు లకు సమచారం అందించారు. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నాగరాజు, మహేందర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

హోసన్నా గాస్పెల్ సెంటర్ రోడ్డులో రాళ్లు లేచి అధ్వానం

● రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు



విజయలక్ష్మి కాలనీ హోసన్నా గాస్పెల్ సెంటర్ రోడ్లో లేచిన రాళ్లు

భారతీనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతీనగర్ హైటె న్షన్ రోడ్డు సమీపంలోని విజయల క్ష్మీ కాలనీ హోసన్నా గాస్పెల్ సెంటర్ రోడ్డులో రాళ్లు లేచి ప్రమాదాలకు నిల యంగా మారాయి. ఈ రోడ్డు నిర్మిం చి ఏళ్లు గడిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అధ్వానంగా ఉంది. చిన్న పాటి వర్షం కురిసినా రోడ్డులో నీళ్లు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం ఈ రోడ్లో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కృష్ణా వర్సిటీ చెస్ చాంప్ పీబీ సిద్ధార్థ



పీబీ సిద్ధార్థ జట్టును అభినందిస్తున్న యాజమాన్యం

విజయవాడస్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల చెస్ చాంపియన్‌గా మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల టీమ్ నిలిచింది. ఎ.ఉషా ప్రవల్లిక, ఎస్.సాధన, ఎన్.సరయూ, ఎం. ఆర్తిలు సత్తా చాటగా, వీరిలో త్వరలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ టోర్నీకి ఎ. ఉష ప్రవల్లిక, ఎస్.సాధనలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం జరిగిన అభినందన సభలో ప్రెసిడెంట్ సీ.నాగేశ్వరరావు, సెక్రటరీ పి.లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, పీడీ కృష్ణారెడ్డిలు అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి):ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేప ట్టిన డాక్టర్ జి.లక్ష్మీశను విజయవాడలోని కలెక్టరే ట్‌లో సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛ మిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రా, తెలంగాణా సరిహద్దుల్లో ఉన్న జగ్గయ్యపేట ప్రాంతంలో సమ స్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. తాతయ్య వెంట కృష్ణపవన్ ఉన్నారు.

క్రైస్తవ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి : ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ దేవాలయాలు, పాస్టర్ల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ లూనాసెంటర్‌లోని ఇమ్మానియేల్ బాపిస్ట్ చర్చి గ్రౌండ్ మరమ్మతులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘపెద్దలు బొండా ఉమాను సత్కరించారు. అనంతరం బొండా ఉమా క్రీస్తు విశ్వాసులకు ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సన్నీబాబు, బెజవాడ డేవిడ్, కోలా శ్యామ్, అలపర్తి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రధాన సెంటర్లలో పాదచారులు నడిచే దారేదీ?

● జీబ్రాలైన్ల రంగులు చెరిగి వాహనదారులకు కానరాని వైనం



కొత్త ప్రభుత్వ ఆసుపత్రి సెంటర్లో ఏలూరు రోడ్డు పై

భారతీనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాన సెంటర్లలో ఉన్న జీబ్రా లైన్లు సరిగా కనిపించకపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదవ నెంబరు రోడ్లో గురునానక్ కాలనీ సెంటర్, ఫన్‌టైం రోడ్డు సెంటర్, ఏపీఐఐసీ కాలనీ సెంటర్, ఏలూరు జాతీయ రహదారిపై కొత్తప్రభుత్వ ఆసుపత్రి(మహానాడురోడ్లో) వంటి పలు ప్రధాన సెంటర్లలో జీబ్రాలైన్లు లేవు. ఈ జీబ్రాలైన్లు పాదచారులు రోడ్డు దాటడానికి ఏర్పాటు చేశారు. వీటిని ఏర్పాటు చేసి ఏళ్లు గడిచిపోవడంతో వాహనాల రాకపోకలకు వీటి రంగులు చెరిగి పోయాయి. దీంతో వాహనదారులు వేగంగా వస్తున్నారు. ఈ సెంటర్లలో పాదచారులు రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకో వాలని పాదచారులు కోరుతున్నారు.



ఏపీఐఐసీ సెంటర్లో కనిపించని జీబ్రాలైన్లు

విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

కృష్ణలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబరు 3న జరిగే అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలను నవంబరు 28న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 6 నుంచి 15 ఏళ్లలోపు, 15 ఏళ్లు పైబడిన విభిన్న ప్రతిభావంతులకు, బాలబాలికలకు, పురుషులకు, స్త్రీలకు విడివిడిగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఆసక్తి గల విభిన్న ప్రతిభావంతులు, ఆటల పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి స్టేట్ ఓపెన్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని డీఎస్‌ఏ హాల్లో ఈ నెల 27,28న ఏపీ ఓపెన్ జూనియర్ (అండర్-20) బాలబాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ నాగం సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 2005 జనవరి 1, నుంచి 31 అక్టోబరు 2011 మధ్యలో జన్మించిన, అసోసియేషన్ గుర్తింపు కార్డు కలిగినవారు అర్హులన్నారు. తమ రిజిస్ట్రేషన్‌ను గూగుల్ షీట్ ఆన్‌లైన్ ఫామ్ ద్వారా 27న ఉదయం 8 గంటల్లో నమోదు చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలతో హాజరు కావాలన్నారు.



మాట్లాడుతున్న ఏపీవీఎల్ చైర్మన్‌గా పి.వి.లక్ష్మయ్య

ఏపీవీఎల్ చైర్మన్‌గా పి.వి.లక్ష్మయ్య

సత్యనారాయణపురం, నవంబరు 25: ఏపీవీఎల్ చైర్మన్‌గా ఐఏఎస్ అధికారి డా. పి.వి.లక్ష్మయ్యను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ముత్యాలంపాడు పశుసంవర్థకశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏపీ వెటరనరి కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఏపీ వెటర్నరీ కౌన్సిల్‌లోని అఫిసియో సభ్యులు ముగ్గురు, ఎలక్ట్రోల్ సభ్యులు నలుగురు, నామినేటెడ్ సభ్యులు నలుగురు ఏపీవీఎల్ చైర్మన్‌గా డా.పి.వి.లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెటనరీ చట్టాన్ని అనుసరించి సభ్యులు నడుచుకోవాలని, వెటర్నరీ క్లీనిక్స్, ఏపీ వీసీ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని తీర్మానించారు. డైరెక్టర్ ఆఫ్ యానిమల్ హస్‌బెండరీ డి. దామోదర నాయుడు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జేవీ రమణ, రిజిస్ట్రార్ ఆఫ్ వెటర్నరీ కౌన్సిల్ డా.ఈశ్వర్, ఎలక్ట్రోల్ సభ్యులు డా. సుబ్బారెడ్డి, డా. రాజశేఖర్, డా. లోకేష్ పాల్గొన్నారు.



గాత్రకచేరీ చేస్తున్న మల్లాది సోదరలు

అలరించిన మల్లాది సోదరుల గాత్రకచేరీ

విజయవాడ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రంలో శ్రీ సద్గురు సంగీత సభ 31వ వార్షిక సంగీత మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రముఖ గాత్ర విద్వాంసులు మల్లాది సోదరులుగా ఖ్యాతిగాంచిన శ్రీరాం ప్రసాద్, రవి కుమార్ గాత్ర కచేరీ రక్తిగా సాగింది. ఆదితాళంలో అసావేరి రాగ వర్ణంతో కచేరీని ప్రారంభించిన సోదరులు తరువాత పూరణచంద్రిక రాగంలో ఆదితాళంలో త్యాగరాజ స్వామి రచన పలువవేమి నా దైవమా, హరి కాంభోజి రాగంలో చని తోడి తేవె త్యాగరాజు స్వామి రచన, ఇంకా వివిధ వాగ్గేయకారుల రచనలను భక్తితో ఆలపించారు. వీరికి కుమారి మల్లాది సింధు రాగేశ్వరి, మల్లాది శివానంద యశస్వి, ఎం.హరిబాబు వయోలిన్, మృదంగం, ఘటంలపై సమర్థవంతమైన సహకారమందించారు. 3వ రోజు డా.కె.వాగీష్ గాత్రకచేరీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



హాజరైన సిద్ధార్థ కళాశాల మాజీ డైరెక్టర్ విజయలక్ష్మి, సుంకర రాజేంద్రప్రసాద్

మహిళలపై హింస నిర్మూలనలో సామాజిక కృషి కీలకం

- నాగార్జున వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిత

విజయవాడ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై హింస నిర్మూలన ఇంటి నుంచే ప్రారంభం కావాలని, సమాజంలో స్వేచ్ఛగా సమస్యలు వ్యక్తం చేసి పరిష్కారమయ్యే స్థితి రావాలని నాగార్జున వర్సిటీ జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.అనిత అభిప్రాయపడ్డారు. స్థానిక మొగల్రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం మహిళలపై హింస నిర్మూలనపై అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా సెమినార్ జరిగింది. సేఫ్ కమిటీ, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంయుక్తంగా సెమినార్‌ను నిర్వహించారు. సిద్ధార్థ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ టి.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం సేఫ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుళ్లపల్లి జ్యోత్స్నకు నివాళులర్పించడంతో ప్రారంభమైంది. వక్తగా పాల్గొన్న అనిత మాట్లాడుతూ గృహహింస కరోనా అనంతరం కాలంలో మరింత పెరిగిందన్నారు. తన సమస్యలను స్వేచ్ఛగా చెప్పగలిగినప్పుడు పరిష్కార మార్గాలు ఉంటాయన్నారు. సమాజంలో అవి నెలకొనాలనే మహిళలపై హింస క్షమార్హం కాదని యునెస్కో అంతర్జాతీయంగా నవంబర్ 25ను మహిళలపై హింస నిర్మూలన దినంగా పాటిస్తోందన్నారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం స్త్రీకి అన్నింటా సమాన అవకాశాలు కల్పించిందన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ లింగపరమైన అంతరాల సూచీలో భారతదేశ స్థానం అడుగున ఉందన్నారు. ఈ అంతరం తగ్గాలంటే ప్రభుత్వం ప్రత్యేక విధానాల అవలంబించాలన్నారు. పక్షం రోజులపాటు సేఫ్ కమిటీ, ఆయా కళాశాలలతో సంయుక్తంగా నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థినీ, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తాయని నిర్వాహకులు తెలిపారు. తొలుత విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. సేఫ్ కమిటీ సభ్యులు కె.స్వరూపారాణి, డాక్టర్ నీరజ, వసుంధర, ఎ.సుమ, సేఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హైవే స్థలంపై వైసీపీ నేత కన్ను

- రైతులకు సాగునీరు వెళ్లకుండా తూములు పూడ్చి మరీ కబ్జా
- అధికారుల కన్నుకప్పి కబ్జా



కబ్జా చేసిన స్థలంలో తోలిన గ్రావెల్‌ను చదును చేస్తున్న జేసీబీ

మైలవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వపక్షమైనా, విపక్షమైనా ఇదే నైజమంటున్నారు కొందరు వైసీపీ నేతలు. ప్రతిపక్షంలో ఉన్నా మమ్మల్ని ఆపేదెవరని ఎంచక్క ప్రభుత్వ స్థలాలనే కబ్జా చేస్తున్నారు. మైలవరం పట్టణంలో ఓ వైసీపీ నేత చేసిన కబ్జా పర్వం జనం నోటి మీద వేలేసుకునేలా చేసింది. ప్రజలు, రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తూ కోట్లు విలువ చేసే స్థలాన్ని కబ్జా చేయడమే కాక పట్టపగలు యంత్రాలతో స్థలంలో తోలిన గ్రావెల్‌ను ధైర్యంగా చదును చేయించడం గమనార్హం.

మైలవరం పట్టణంలో చిన్న చెరువు సమీపంలో ఇబ్రహీంపట్నం - చత్తీస్‌ఘడ్ జాతీయ రహదారి-30కి చెందిన కోట్ల విలువైన స్థలంపై ఓ వైసీపీ నేత కన్నేశాడు. అధికారుల కళ్లు గప్పి ఆ స్థలంలో గ్రావెల్ పోసి చిన్న చెరువుకు సాగు నీరు వెళ్లే తూములను పూడ్చి కబ్జా చేశాడు. వైసీపీ నేత కబ్జా చేసిన స్థలం విలువ సుమారు రూ.కోటికి పైనే ఉంటుందని, అయినా తన స్వప్రయోజం కోసం రైతులు ప్రయోజనాలకు విఘాతం కలిగించడం ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వైసీపీ నేత కబ్జా నుంచి ఆ స్థలాన్ని రక్షించాలని, తూములకు అడ్డుగా పోసిన మట్టిని తొలగించి చెరువుకు సాగునీరు అందేలా చేయాలని పలువురు రైతులు, ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ వివరణ: ఈ విషయంపై తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి వివరణ కోరగా కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి బాధ్యుడిపై చర్యలు తీసుకుంటాం.

హర హర మహాదేవ..!

- మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన

వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన సేవ నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్రలింగార్చన నిర్వహించారు. స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. సహస్రలింగార్చన సేవలో స్వామిని పుష్పాలు, బిల్వాలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో నయనమనోహరంగా అలంకరించారు.

దుర్గగుడిలో ఊంజల్ సేవ

కార్తీకమాసం, సోమవారం సందర్భంగా గంగా పార్వతీమల్లేశ్వరుల ఉత్సవమూర్తులకు ఊయల సేవ నిర్వహించి వేదమంత్రాలు, భక్తజనుల కోలాహలం మధ్య సహస్రదీపాలంకరణ చేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు పాల్గొని పూజలు చేసి సహస్రదీపాలంకరణలో దీపాలు వెలిగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని, స్వామిని దర్శించుకున్నారు.

కళావేదికపై హరికథాగానం

దుర్గగుడి కళావేదికపై సోమవారం గుడిపాటి జయరామ సుధాకర్ భక్తమార్కండేయ హరికథా గానాన్ని రమణీయంగా వినిపించారు. భక్త మార్కండేయుడు శివుడిని ఆరాధించిన తీరును కళ్లకు కట్టినట్టు అభివర్ణించారు. చావలి కృష్ణమోహన్ మృదంగంపైన, చావలి శ్రీనివాస్ వయోలిన్‌పైన సహకరించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు సుధాకర్‌ను అభినందించారు.





డీఈవోకు బ్రాస్‌లెట్ అందజేస్తున్న స్వీపర్లు

బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకున్న భక్తురాలు... తమకు దొరికిందని తిరిగిచ్చిన స్వీపర్లు

హైదరాబాద్‌కు చెందిన బోన పూజిత సాయి తన కుటుంబ సభ్యులతో సోమవారం అమ్మవారిని దర్శించుకోవటానికి దుర్గగుడికి వచ్చారు. అమ్మవారి దర్శనానంతరం తిరిగి వెళుతుండగా ఆమె చేతికున్న రూ.2లక్షలు విలువైన బంగారు బ్రాస్‌లెట్ జారిపోయింది. విషయాన్ని వెంటనే మైక్ సమాచార కేంద్రంలో తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు డ్యూటీలో ఉన్న సూపరింటెండెంట్ అమృతరావు స్పందించి వెంటనే హెడ్ కానిస్టేబుల్ డి.శివాజీ, సీటీ ఈశ్వరరావు, వై.సోమేశ్వరరావుతో కలిసి ఆలయ ప్రాంగణంలో వెతికించారు. ఇదే సమయంలో అక్కడ స్వీపర్లుగా పనిచేస్తున్న దుర్గాదేవి, మంగతాయారుకు ఈ బ్రాస్‌లెట్ దొరికింది. దాన్ని వారు వెంటనే అక్కడున్న సెక్యూరిటీ గార్డు సూరిపోయిన శ్రీధర్‌కు అందజేశారు. ఈ విషయాన్ని చెరువు ఆదినారాయణ మైక్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే పూజిత సాయి డిప్యూటీ ఈవో రత్నరాజును కలిసి వివరాలు చెప్పగా, అందరి సమక్షంలో బ్రాస్‌లెట్‌ను ఆమెకు అప్పగించారు. రూ.2లక్షలు విలువైన 30 గ్రాముల బ్రాస్‌లెట్ దొరికినందుకు ఆమె సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు.



డాక్టర్ లక్ష్మీశాకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను సోమవారం ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, ఈఈ కోటేశ్వరరావు, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, తదితరులు ఆలయ మర్యాదలను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేయగా వేదపండితులు ఆశీస్సులందజేశారు.





శాంతి కల్యాణానికి తరలివెళ్తున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి

రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం

విజయవాడ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం వరకు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామి శాంతి కల్యాణం జరిగింది. తదుపరి ప్రత్యేక అలంకరణ చేశారు. భ క్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామిని దర్శించారు. సంధ్యా సమయంలో ఆకాశదీపం వెలిగించారు. అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం చేసి పంచహారతులిచ్చారు. ఉదయం నుంచి భక్తులు దీపారాధనలు ఆలయ ప్రాంగణంలో అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్, అభివృద్ధి దాత సంగా నర్సింహారావు, కార్యనిర్వాహణాధికారి ఎస్.భవాని పాల్గొన్నారు.

సోషల్ మీడియాను ఎదుగుదలకే ఉపయోగించాలి

- మంత్రి కొలుసు పార్థసారథి

గుణదల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత తమ ఎదుగుదలకు మాత్రమే సోషల్ మీడియాను ఉపయోగించుకుని ఇతర విషయాల్లో దానిపై దృష్టి పెట్టకుండా ఉంటే మంచిదని గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సైబర్ నేరాలపై యువతను చైతన్య వంతుల్ని చేసేందుకు స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో సమాచార శాఖ నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి సారథి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ నేడు ఎంతోమంది యువత సోషల్ మీడియా వల్ల భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వచ్చిన మొదట్లో దేశంలో 19శాతం మంది వాడితే నేడు దేశవ్యాప్తంగా సోషల్ మీడియాను 86 శాతం మంది వాడుతున్నారన్నారు. సోషల్ మీడియాను ఆయుధంగా తీసుకున్న కొంతమంది నేరస్థులు యువతను తప్పుదోవలో నడిపించి దేశ ప్రగతిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీంతో ఎంతోమంది ఆర్థికంగా నష్టపోవడమేకాక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో చైతన్యం లేకపోవడమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రహించారన్నారు. అందుకే సైబర్‌క్రైమ్ పట్ల యువతలో చైతన్యం తీసుకొచ్చేలా పలు కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు



మాట్లాడుతున్న సమాచార శాఖ మంత్రి పార్థసారథి

ఆలోచనలు 2047 నాటికి రాష్ట్ర ప్రగతి ఎలా ఉండాలన్నదానిపై పదును పెట్టారన్నారు. అందులో భాగంగానే నేడు సైబర్ క్రైం నేరస్థులపై ఉక్కుపాదం మోపాలన్న ఆలోచన చేయడం జరుగుతోందన్నారు. సైబర్ క్రైం నేరాలపై కేసులు నమోదు చేయకున్నా తమ దృష్టికి తేవాలన్నారు. సోషల్ మీడియా అనేది మంచికి వాడితే మంచిదే కానీ చెడు ఆలోచనతో వాడామా అణుబాంబు కంటే ప్రమాదకరమైందని స్థానిక 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి అన్నారు. సీనియర్ న్యాయవాది చేకూరి శ్రీపతిరావు, నాగార్జున వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ టీడీ విమల, ఉన్నత విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ భరత్ గుప్తా, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ఈఎస్ఎఫ్ ల్యాబ్స్ నుంచి జి.తిరుమలేశ్వరి పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా గాంధీకొండ ప్లానిటోరియం

వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాంధీకొండ వద్ద ఉన్న ప్లానిటోరియం విజయవాడకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం విడుదల చేసిన ప్రకటనలో అన్నారు. వన్‌టౌన్‌లోని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే గాంధీహిల్‌లో అంతరిక్ష పరిజ్ఞానం పెంచేందుకు ఏర్పాటు చేసిన ప్లానెటోరియంను ప్రజలందరూ వీక్షించాల్సిందిగా కోరారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా రూ.40 ప్రవేశ రుసుముగా పెట్టినట్టు తెలిపారు. 63 మంది సిట్టింగ్ కెపాసిటీ గల ప్లానిటోరియంను ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పాఠశాలల నుంచి ప్రత్యేక బుకింగ్ చేసుకున్నవారికి 50 శాతం రుసుములో రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. బుధవారం నుంచి ప్రతిరోజూ సాయంత్రం 4



మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ప్లానిటోరియం

నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రతి అరగంటకు షో వేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల/కళాశాలల నుంచి ప్రత్యేకంగా బుకింగ్స్ చేసుకున్న వారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు బుకింగ్ చేసుకున్న సమయంలో షో వేస్తామన్నారు. ప్రతి మంగళవారం సెలవని చెప్పారు. విజయవాడలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న గాంధీ కొండ ప్లానిటోరియం వీక్షించి అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రజలందరినీ ఆయన కోరారు.

ఐక్యతతోనే స్త్రీలపై జరుగుతున్న హింసకు ముగింపు

- దళిత స్త్రీశక్తి సభలో వక్తలు



ప్రచారోద్యమ ప్రారంభసభలో ప్రసంగిస్తున్న మణికుమార్

గవర్నర్‌పేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్త్రీలపై జరుగుతున్న హింసను రూపుమాపాలంటే స్త్రీలలో ఐక్యతతో పాటు విద్యావంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ట్రైకోర్ జనరల్ మేనేజర్ సీఏ మణి కుమార్ అన్నారు. ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం పిలుపు మేరకు సోమవారం నుంచి 16 రోజుల పాటు స్త్రీలపై జరిగే హింసకు వ్యతిరేకంగా దళిత స్త్రీ శక్తి సంస్థ అంతర్జాతీయ ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా సోమవారం లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐక్య భవన్‌లో ప్రచారోద్యమం ప్రారంభ సభ జరిగింది. మణికుమార్ జెండా ఊపి ప్రచారోద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో పిల్లలు సన్మార్గంలో నడవాలంటే కుటుంబ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషించాలని, ఒంటరిగా ప్రశిస్తే పనికాదనీ, సంఘటిత శక్తి అవసరమన్నారు. సభకు అధ్యక్షత వహించిన దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ ప్రచారోద్యమం 16 రోజుల పాటు గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాలు, మురికివాడలు, పాఠశాలలు, కళాశాలలు, కార్మికులు పనిచేసే కర్మాగారాల్లో నిర్వహిస్తామన్నారు. వీటన్నింటిలోనూ ప్రభుత్వ అధికారులు, మేధావులు, ప్రజా సంఘాల మహిళా నేతలు పాల్గొంటారన్నారు. టెలికం జనరల్ మేనేజర్ తారా చంద్, ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ శైలజ, సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు హేమలత, అనుపమ, భూమిక, జ్ఞానసుందరి, దళిత స్త్రీ శక్తి కో-ఆర్డినేటర్లు రోజా, రాణి, రాజేష్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా కలయిక నేతలు పాల్గొన్నారు.

మహా సాంకేతిక విద్య టీం పర్యటన

పాలిటెక్నిక్ విద్య ప్రోత్సాహక చర్యలను పరిశీలించిన అధికారులు

కృష్ణలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ కార్యాలయాన్ని సోమవారం మహారాష్ట్ర స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ డాక్టర్ ప్రమోద్ నాయక్ బోర్డు అధికారులతో కలిసి సందర్శించారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ విద్య, పరీక్షా కార్యకలాపాలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ప్రమోద్ నాయక్ బృందాన్ని సాంకేతిక విద్య డైరక్టర్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ చైర్మన్ జి.గణేష్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక, శిక్షణ మండలి కలిసి పాలిటెక్నిక్ విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. పాలిటెక్నిక్ సిలబస్‌ను అప్‌డేట్ చేయడానికి, విద్యార్థులకు మరింత ఉపాధి కల్పించడానికి పాఠ్యాంశాలకు సవరణలు చేసినట్టు తెలిపారు. అనంతరం పాఠ్య ప్రణాళిక అభివృద్ధి, అకడమిక్ ఆడిట్, పాఠ్యపుస్తకాల ప్రచురణ, ఆన్‌లైన్ ప్రశ్నా పత్రాల డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ, కోడింగ్ క్యాంప్స్ నిర్వహణ, పాలిటెక్నిక్ విద్య భవిష్యత్తు అవసరాలు, పాలీటెక్ ఫెస్ట్, ప్రాంగణ నియామకాలు తదితరాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను వివరించారు. ఎంబీటీఈ బృందం గుంటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను కూడా సందర్శించింది.



ధర్నాచౌక్‌లో వినూత్న నిరసన తెలియజేస్తున్న నేతలు

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

- ధర్నాచౌక్‌లో ఏఐవైఎఫ్ వినూత్న నిరసన

ధర్నాచౌక్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను కొనసాగించి వారికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లంకా గోవిందరాజులు డిమాండ్ చేశారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. చంద్రబాబు వలంటీర్ల జీవితాలను తలకిందులు చేశారన్న గోవిందరాజులు తాను కూడా తలకిందులుగా నిలబడి వినూత్నంగా నిరసన వ్యక్తం తెలిపారు. ఉగాది పండుగ రోజు శుభవార్త చెబుతానని నమ్మించి వలంటీర్ల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారిని మోసం చేశారని విమర్శించారు. వలంటీర్ల వ్యవస్థ లేదని అసెంబ్లీలో రాష్ట్ర మంత్రి డోల బాల వీరాంజేయ స్వామి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలను ఈ విషయం తెలియదా? అని ప్రశ్నించారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని, రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వారిని కొనసాగించాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నగరాధ్యక్షుడు కంచర్ల భార్గవ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లంకే సాయి, ఏపీ వలంటీర్ అసోసియేషన్ నేతలు జి.మమత, శిరీష, రాజకుమార్, రమేష్ పాల్గొన్నారు.

విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులకు ప్లాట్లు

కృష్ణలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయ విస్తరణకు భూములిచ్చిన రైతులకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశానుసారం రిటర్నబుల్ ప్లాట్లు అందచేసే నిమిత్తం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో చేపట్టిన ఈ-లాటరీ కార్యక్రమం సోమవారం జరిగింది. 2016లో విమానాశ్రయ విస్తరణ నిమిత్తం 12.5315 ఎకరాల భూములిచ్చిన 20 మంది రైతులకు 24 రెసిడెన్సియల్ ప్లాట్లు, 15 కమర్షియల్ ప్లాట్లు మొత్తంగా 39 ప్లాట్లు అందచేశామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) బీఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లను రైతుల సమక్షంలో ఈ లాటరీ విధానంలో అందచేశామన్నారు.ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించామో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బందిని, గ్రామ సర్వేయర్‌లను నియమించామన్నారు. ప్లాట్లు పొందిన రైతులకు సౌకర్యంగా వుండేందుకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజులలోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ క్రతువును పూర్తిచేసుకోవాలని రాజకుమారి సూచించారు. ఈ లాటరీ కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీఎల్ఎన్ రాజకుమారి, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, గన్నవరం తహసీల్దార్ శివయ్య, మరో తహసీల్దార్ కె.అరుణాదేవి, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరావు, ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.లక్ష్మీప్రసన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రైతులకు ప్లాట్లను అందజేస్తున్న ప్రవీణ్‌చంద్

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాచౌక్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ 108 సర్వీస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. 108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించడంతో పాటు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ జీవో 49 అమలును పునరుద్ధరించాలన్నారు. ఈ జీవోను రద్దు చేసి వైసీపీ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర పని ఒత్తిడితో అనేక మంది ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వైద్యారోగ్య శాఖలోని అన్ని శాఖల్లో అమలు అవుతున్నట్టు 108 వ్యవస్థలోనూ రోజుకు మూడు షిఫ్టులల్లో షిఫ్టుకు 8 గంటల పని చొప్పున పని విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కిరణ్‌కుమార్, నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న లక్ష్మణరావు

40, 45 ఏళ్లు దాటిన వాళ్ల ముఖంలో వృద్ధాప్య ఛాయలు నుదురు, కనుబొమలు, కళ్లు, బుగ్గలు, ముక్కు, పెదవులు, గడ్డం, దవడ.. ఇలా ముఖంలోని అన్ని అవయవాల్లో స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ఈ వృద్ధాప్య ఛాయలు వ్యక్తులను బట్టి భిన్నంగా ఉంటాయి. కొందర్లో నుదుటి మీద పెద్ద పెద్ద గీతలు ఏర్పడతాయి. భృకుటి దగ్గర నిలువు ముడతలు ఏర్పడి, ముఖం కోపంగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఇంకొందర్లో ముక్కు లావవుతుంది. ఇంకొందర్లో పెదవులు పలుచబడిపోతాయి. దవడలు వెడల్పవుతాయి. ఇలాంటి ఛాయలను వీలైనంత సహజంగా సరిదిద్ది, 5 నుంచి 10 ఏళ్ల తక్కువ వయస్కుల్లా కనిపించే కాస్మాటిక్ సర్జరీలు ఇవే!

అందం ఇలా సొంతం

అందానికి మెరుగులు దిద్దుకునేటప్పుడు, ఫలితం సాధ్యమైనంత సహజసిద్ధంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే అవి కృత్రిమ అందాలనే విషయం స్పష్టంగా తెలిసిపోతుంది. మరీముఖ్యంగా నడి వయసులో సౌందర్య చికిత్సలను ఆశ్రయించేటప్పుడు, పైపై చికిత్సలను ఆశ్రయించి, ఫలితంతో రాజీపడిపోవడమా లేదంటే సర్జరీలతో సహజసిద్ధమైన ఫలితాన్ని పొందడమా అనే విషయంలో స్పష్టత కలిగి ఉండాలంటున్నారు వైద్యులు.



నుదురు నునుపుగా

నుదుటి మీద లోతైన, స్పష్టమైన గీతలు ఏర్పడినప్పుడు, భృకుటి ముడిపడి, ఉబ్బెత్తు ముడతలు ఏర్పడినప్పుడు 'సర్జికల్ ఫోర్‌హెడ్ లిఫ్ట్' చికిత్సను ఆశ్రయించవచ్చు.

దిద్దుబాటు ఇలా: నుదుటి దగ్గరున్న వెంట్రుకల అడుగుకు చేరుకుని, లోపలి చర్మాన్ని పైకి లాగి బిగిస్తారు.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 10 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో 10 నుంచి 15 ఏళ్ల పాటు ఫలితం నిలిచి ఉంటుంది. బొటాక్స్, ఫిల్లర్స్‌తో 6 నెలల నుంచి ఏడాది పాటు ఫలితం కనిపిస్తుంది.

బుగ్గలు జారితే

వయసు పైబడినప్పుడు బుగ్గల్లోని కొవ్వు కిందకు జారుతుంది. దాంతో ఆ ప్రదేశంలో ముడతలు ఏర్పడి, చర్మం కూడా జారిపోతుంది. దీనికి 'ఫేస్ లిఫ్ట్'ను ఎంచుకోవాలి.

దిద్దుబాటు ఇలా: చర్మం అడుగుకు చేరుకుని జారిన కొవ్వు పొరను మునుపటి స్థానంలో అమర్చే సర్జరీ చేయవలసి ఉంటుంది. ఇలా బుగ్గలను బిగుతుగా మార్చడంతో పాటు అవసరమైతే వదులుగా ఉన్న అదనపు చర్మాన్ని కూడా తొలగిస్తారు.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 10 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. ఫిల్లర్స్ ఫలితం 6 నెలల పాటు ఉంటుంది.

ఆకట్టుకునే పెదవులు

పెదవుల పైన గీతలు, ముడతలు ఏర్పడడంతో పాటు పెదవులు లావుగా ఉండడం, లేదా పలుచబడిపోవడం కూడా జరుగుతుంది. వీటికి వేర్వేరు చికిత్సలుంటాయి.

దిద్దుబాటు ఇలా: నవ్వినప్పుడు మాత్రమే ఏర్పడే గీతలను బొటాక్స్‌తో సరిదిద్దవచ్చు. పలుచబడితే ఫిల్లర్స్‌తో నింపుకోవచ్చు. కానీ లోతైన ముడతలు ఏర్పడినప్పుడు సర్జరీ అవసరమవుతుంది. నవ్వినప్పుడు చిగుళ్లు కనిపిస్తుంటే, బొటాక్స్‌తో పైపెదవి కండరాన్ని బలహీనపరుస్తారు. ఫలితంగా నవ్వినప్పుడు పైపెదవి మరీ పైకి వెళ్లిపోకుండా ఉంటుంది.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 10 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. సమస్య స్వల్పంగా ఉన్నప్పుడు బొటాక్స్, ఫిల్లర్స్‌తో సరిదిద్దుకోవచ్చు. దీంతో ఫలితం 6 నెలల పాటు ఉంటుంది.

విల్లు లాంటి కనుబొమలు

కొందరికి కనురెప్పలు విపరీతంగా జారిపోయి, కళ్లకు అడ్డుపడుతూ ఉంటాయి. ఇంకొందరి కనుబొమల దగ్గర మీద విపరీతంగా ముడతలు ఏర్పడతాయి. ఈ రెండు సమస్యలకూ సర్జరీని ఆశ్రయించవచ్చు.

దిద్దుబాటు ఇలా: కనుబొమల అడుగు కణజాలపు పొరను పైకి లాగి బిగించడం జరుగుతుంది. కోత కనిపించని ఈ సర్జరీతో 15 నుంచి 20 ఏళ్ల క్రితం కనుబొమలు ఏ స్థానంలో ఉండేవో, ఆ స్థానంలోకి చేర్చడం జరుగుతుంది.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 10 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. సమస్య స్వల్పంగా ఉన్నప్పుడు ఫిల్లర్స్‌తో సరిదిద్దుకోవచ్చు. దీంతో ఫలితం 6 నెలల పాటు ఉంటుంది.

జారిపడే కనురెప్పలు

పైకనురెప్పల మీద ముడతలు ఏర్పడి కిందకు జారిపడిపోయినప్పుడు, 'బ్లెఫరోప్లాస్టీ'తో సరిదిద్దవచ్చు. కింది కనురెప్ప దిగువన ఏర్పడే ఉబ్బు, గుంతలకు వేర్వేరు చికిత్సలుంటాయి.

దిద్దుబాటు ఇలా: కనురెప్పల మీద ముడతల రూపంలో ఉండే అదనపు చర్మాన్ని, కొవ్వునూ తొలగించి, చర్మాన్ని పైకి లాగి కుట్టేస్తారు. కంటి దిగువన గుంతలను ఫిల్లర్స్‌తో చక్కదిద్దవచ్చు. కళ్ల కింద ఉబ్బు ఉన్నప్పుడు అదనపు కొవ్వును తొలగించడం, లేదా సరైన స్థానంలో అమర్చడం చేస్తారు.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 7 నుంచి 14 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. ఫిల్లర్స్‌తో సరిదిద్దినప్పుడు, ఫలితం 6 నెలల పాటు ఉంటుంది.

కోటేరు ముక్కు కోసం...

ముక్కు కిందకు వంగిపోవడం, ముక్కు మొన పదునుగా లేకుండా గుండ్రంగా ఉండడం, ముక్కుపుటాలు లావుగా ఉండడం, వంకరగా ఉండడం లాంటి ఇబ్బందులను రైనోప్లాస్టీ'తో సరిదిద్దుకోవచ్చు.

దిద్దుబాటు ఇలా: ముక్కు దూలాన్ని కత్తిరించి, సరైన ఆకారంలో మలచడం, వేరే ప్రదేశం నుంచి ఎముకను సేకరించి ముక్కును పదునుగా మార్చడం

కోలుకునే సమయం: మృదులాస్థిని మాత్రమే సరిదిద్ది ముక్కును సరి చేసినప్పుడు, వారం నుంచి పది రోజుల్లో పూర్తిగా కోలుకుంటారు. ఎముక ప్రమేయం ఉన్నప్పుడు 15 నుంచి 20 రోజులు పట్టొచ్చు. ఈ రెండు సందర్భాల్లో మూడు రోజుల్లోనే కోలుకున్నా, వారం పాటు వాపు కొనసాగుతుంది.

ఫలితం: రైనోప్లాస్టీతో శాశ్వత ఫలితం దక్కుతుంది. స్వల్ప దిద్దుబాట్ల కోసం ఎంచుకునే థ్రెడ్ లిఫ్ట్, ఫిల్లర్స్ ఫలితం ఏడాది పాటే ఉంటుంది.

చుబుకం చక్కగా...

చుబుకాన్ని ఫిల్లర్స్‌తో పదునుగా మార్చుకోవచ్చు. చుబుకం చిన్నదిగా ఉన్నా, కింది దవడ ముందుకు ఉన్నా సర్జరీ అవసరమవుతుంది.

దిద్దుబాటు ఇలా: సిలికాన్ ఇంప్లాంట్స్ సహాయంతో చుబుకానికి చక్కని రూపాన్ని తీసుకురావచ్చు.

కోలుకునే సమయం: ఉదయం సర్జరీ చేయించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోవచ్చు. ఎంతో అరుదుగా 2 నుంచి 3 శాతం మందికి ఈ సర్జరీ విఫలమవుతూ ఉంటుంది.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది.

దవడ వెడల్పుగా ఉంటే...

కొందరికి దవడ కండరాలు పెద్దవిగా ఉంటాయి. ఇంకొందరి దవడ నిర్మాణంలో లోపాలుంటాయి. వీటిని వేర్వేరు చికిత్సలతో సరిచేసుకోవచ్చు.

దిద్దుబాటు ఇలా: కింది దవడ మరీ వెనకకూ లేదా ముందుకూ ఉన్నప్పుడు ఎముకను కత్తిరించి సరిదిద్దవలసి ఉంటుంది. దవడ కండరాలు వెడల్పుగా ఉండడం వల్ల దవడలు వెడల్పుగా కనిపిస్తున్నప్పుడు, ఆరు నెలలకోసారి ఒక ఇంజక్షన్ చొప్పున, 3 నుంచి నాలుగు బొటాక్స్ ఇంజక్షన్లతో దవడ కండరం కుంచించుకుపోయేలా చేసి దవడకు చక్కని ఆకృతి తీసుకురావచ్చు.

కోలుకునే సమయం: కోలుకునే సమయం సర్జరీ తీవ్రత మీద ఆధారపడి ఉంటుంది. ఇంప్లాంట్ అమర్చినప్పుడు 2, 3 రోజుల్లో కోలుకోవచ్చు. ఎముక ప్రమేయం ఉంటే 2 నుంచి 3 వారాల సమయం పడుతుంది.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. బొటాక్స్‌తో దవడల్లో శాశ్వతమైన మార్పు సాధ్యపడుతుంది.

45 ఏళ్ల మహిళ ముఖాన్ని పాతికేళ్ల యువతి ముఖంలా సరిదిద్దడం ఎంతటి సమర్థమైన సర్జన్‌కు అయినా సాధ్యపడదు. ఐదు నుంచి పదేళ్లకు ముందు ఎలా ఉన్నారో ఆ రూపాన్ని తీసుకురాగలిగే వెసులుబాటు మాత్రమే ఉంటుంది. కాస్మటిక్ సర్జరీలతో ప్రకృతి విరుద్ధ ఫలితాన్ని సాధించడం అసాధ్యం. ఈ చికిత్సలతో అందాన్ని మెరుగు పరుచుకోవడం మాత్రమే సాధ్యపడుతుంది.

పైబడే వయసుతో చర్మం బిగుతు సడలి, జారిపోతుంది. ముడతలు, మచ్చలు కూడా ఏర్పడతాయి. వీటిని కప్పిపుచ్చుకోవడం కోసం, చర్మ చికిత్సలను ఆశ్రయించడం నేడు పరిపాటి పోయింది. అయితే ఎంచుకునే చికిత్సలు సమస్య తీవ్రతకు, పైబడిన వయసుకూ తగినవై ఉండాలి. సన్నని గీతలు, ముడతలు, మచ్చలు లాంటి స్వల్ప లోపాలను సరిదిద్దడం కోసం బొటాక్స్, ఫిల్లర్స్, లేజర్స్, కెమికల్ పీల్స్ లాంటివి అందుబాటులో ఉన్నాయి. అయితే వాటితో ఫలితం మెరుగ్గా ఉందనే ఉద్దేశంతో వయసు పైబడుతున్నా, అవే చికిత్సలను ఆశ్రయించడం సరికాదు. అలా చేస్తే, ముఖం ఉబ్బి, కృత్రిమ యవ్వనాన్ని తలపిస్తుంది. సర్జరీ అవసరం ఉన్న చోట తేలికపాటి చికిత్సలను ఎంచుకుంటే ఇదే జరుగుతూ ఉంటుంది. బదులుగా సమర్థమైన వైద్యుల సహాయంతో సరైన సర్జరీని ఎంచుకోగలిగితే, ఫలితం సహజసిద్ధంగా ఉంటుంది.


డాక్టర్ వెంకటేష్ బాబు
ప్లాస్టిక్ రికన్‌స్ట్రక్టివ్ అండ్ ఈస్థటిక్ సర్జన్,
కాస్మోస్యూర్ క్లినిక్,
హైదరాబాద్.


అధిక బరువుకు అదే కారణం

ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గకపోవడానికి కారణం మన కొవ్వు కణాల్లో ఉంటుంది. కొవ్వు కణాలు ఒబేసిటీకి సంబంధించిన జ్ఞాపకాన్ని కలిగి ఉంటాయని ఒక తాజా అధ్యయనంలో వెల్లడైంది.

బరువు తగ్గడం ఒక ఎత్తైతే, తగ్గిన బరువును కొనసాగించడం మరొక ఎత్తు. అధిక బరువు అదుపు ఎందుకింత సమస్యగా మారుతుందో కనిపెట్టడం కోసం పరిశోధకులు అధ్యయనాలు చేపట్టారు. కొవ్వు కణాలు జ్ఞాపకశక్తిని కలిగి ఉంటాయనీ, కష్టపడి బరువు తగ్గినా, మళ్లీ బరువును పెంచేస్తూ ఉంటాయనీ. ఫలితంగా తగ్గిన బరువును కొనసాగించడం కష్టంగా మారుతుందనీ ఆ అధ్యయనంలో పరిశోధకులు కనిపెట్టారు.



అలాగే అధిక బరువు, జన్యువుల పనితీరు మీద ప్రభావం చూపించే రసాయన మార్కర్లలో మార్పులకు కారణమవుతుంది. ఈ మార్పుల వల్ల కొవ్వు కణాల పనితీరు క్రమం తప్పుతుంది. దాంతో కష్టపడి బరువు తగ్గినా, మునుపటి బరువుకు చేరుకునేలా కొవ్వు కణాలు స్పందిస్తాయి. అధిక బరువును కలిగి ఉన్న వ్యక్తులు, సాధారణ వ్యక్తుల నుంచి సేకరించిన కొవ్వు కణజాలాన్ని అధ్యయనం చేసినప్పుడు, ఆ రెండు కోవలకు చెందిన వ్యక్తుల్లో జన్యు కార్యకలాపాలు భిన్నంగా ఉన్నట్టు పరిశోధకులు కనిపెట్టారు. అధిక బరువు కలిగిన వాళ్లలో, ఇన్‌ఫ్లమేషన్ సంబంధిత జన్యువులు మరింత చురుగ్గా ఉన్నట్టు తేలింది. ఫలితంగా తేలికగా బరువు పెరగడం, పెరిగిన బరువును కోల్పోవడం కష్టతరం కావడం, కష్టపడి కోల్పోయిన బరువు తిరిగి పెరిగిపోవడం లాంటి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా ఈ కోవకు చెందిన వ్యక్తులు తగ్గిన బరువును కొనసాగించడం కోసం క్రమం తప్పక వ్యాయామం, ఆహార నియమాలు పాటించక తప్పదని పరిశోధకులు సూచిస్తున్నారు.



పాదాలకు మర్దన మంచిదే!

నిద్రకు ముందు నూనెతో పాదాలకు మర్దన చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందే వీలుంది. అవేంటంటే...

నూనెతో పాదాలకు మర్దన చేయడాన్ని ఆయుర్వేదంలో 'పాద అభ్యంగనం' అంటారు. ఇలా పాదాలను మర్దించడం వల్ల శక్తి ప్రవాహం ఊపందుకుని, శరీరంలోని వాత, పిత్త, కఫ దోషాలు సంతులనమవుతాయి. పాద అభ్యంగనంతో ప్రయోజనాలు ఇవే...

- పాద మర్దన కోసం నువ్వుల నూనె, ఆవ నూనె, కొబ్బరి నూనె, బాదం నూనెలను వాడుకోవచ్చు
- శరీర శక్తిని సంతులనం చేసే ప్రదేశాలు ప్రేరేపితమవుతాయి. ఫలితంగా శరీరం సేద తీరుతుంది
- ఒత్తిడి, కంటి నిండా నిద్ర పడుతుంది
- నాడీ వ్యవస్థ నెమ్మదిస్తుంది. రక్త ప్రసరణ మెరుగై వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది
- పగుళ్లు వదిలిపోయి, పాదాలు కోమలంగా మారతాయి
- రోజంతా శరీర బరువును మోస్తూ అలసిన పాదాల్లోని కండరాలు సేద తీరతాయి
- బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు దరి చేరకుండా ఉంటాయి
- నువ్వులు, లేదా కొబ్బరి నూనెలతో మర్దన చేయడం వల్ల కీళ్లనొప్పి తగ్గుతుంది.

పీసీఓడీకి అడ్డుకట్ట పిండ దశ నుంచే..

టీనేజీ మొదలు పెళ్లీడు వయసు వరకూ యువతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పీసీఓడీ (పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్). అంతర్గతంగా ఆరోగ్యాన్ని హరిస్తూ, దీర్ఘకాల రుగ్మతలకు దారి తీసే ఈ సమస్యకు అడ్డుకట్ట వేయడం సులభమే అంటున్నారు వైద్యులు.



వ్యాయామం లేకపోవడం, కొవ్వులతో కూడిన ఆహారం ఎక్కువగా తీసుకోవడం, వృత్తి, విద్యాపరమైన ఒత్తిళ్లు, పర్యావరణ ప్రభావాలు ఇవన్నీ కలగలిసి, పీసీఓడీ సమస్యను విపరీతంగా పెంచేస్తున్నాయి. గతంలో ఈ సమస్య 5% అమ్మాయిల్లో ఉంటే, ఇప్పుడు 20 నుంచి 30% అమ్మాయిల్లో ఈ సమస్య కనిపిస్తోంది. అలాగని ఈ సమస్యకు మూలాలు గతి తప్పిన మన జీవనశైలిలోనే ఉన్నాయనుకుంటే పొరపాటు. గర్భంలో పిండదశలో ఉన్నప్పుడు మొదలు, పుట్టిన తర్వాత పెరిగే క్రమంలో జరిగే పొరపాట్లు, అలవాట్లలో కూడా పిసిఒడి మూలాలు దాగి ఉంటాయి.

గర్భంలోనే బీజాలు

గర్భిణులు తనతో పాటు గర్భంలో పెరిగే బిడ్డతో కలిపి ఇద్దరికి సరిపడా ఆహారం తినాలనే నమ్మకం సర్వత్రా స్థిరపడిపోయింది. దాంతో గర్భిణులు నచ్చిన ఆహార పదార్థాలను పరిమితం లేకుండా తినేస్తూ ఉంటారు. అవి తీపి పదార్థాలు కావచ్చు, జంక్ ఫుడ్ కావచ్చు, నూనెలో వేయించిన పదార్థాలు కావచ్చు. కానీ నిజానికి ఇలాంటి ఆహార స్వేచ్ఛ వల్ల గర్భిణితో పాటు కడుపులో పెరిగే బిడ్డ బరువులు పెరిగిపోతాయి. ఫలితంగా పుట్టబోయే ఆడపిల్ల భవిష్యత్తులో పీసీఓడీ బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. నాలుగు కిలోల బరువుతో బిడ్డ పుడితే తల్లులు పొంగిపోతూ ఉంటారు. కానీ పుట్టినప్పుడు నాలుగు కిలోల మేరకు బరువున్న పిల్లల్లో భవిష్యత్తులో పీసీఓడీతో పాటు మధుమేహం, అధిక రక్తపోటు మొదలైన జీవనశైలి సంబంధిత రుగ్మతల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలా జరగకుండా ఉండాలంటే గర్భిణి సమతులాహారం తీసుకుంటూ, కొవ్వు పదార్థాలకు, చక్కెర, జంక్ ఫుడ్‌కూ దూరంగా ఉండాలి.

బాల్యంలో తీపి వద్దు

పిల్లలు తీపికి త్వరగా ఆకర్షితులవుతారు. తల్లి దగ్గర పాలు తగ్గిపోయినప్పుడు పోత పాలు పట్టిస్తూ ఉంటాం. ఆ పాలను తాగడానికి బిడ్డ అయిష్టత ప్రదర్శించినప్పుడు, వాటిలో కాస్త చక్కెర కలిపి పట్టించేస్తూ ఉంటారు. ఇలా పసి వయసులోనే చక్కెర రుచిని అలవాటు చేయడం సరి కాదు. పిల్లలకు చాక్లెట్లు, కేకులు, శీతల పానీయాలను అలవాటు చేయకూడదు. తీపి కోసం పండ్లు ఇవ్వొచ్చు. పండ్ల రసాలకు బదులుగా కొబ్బరి నీళ్లు అలవాటు చేయాలి. పండ్ల రసాలకు బదులుగా నేరుగా పండ్లు తినడం అలవాటు చేయాలి.

ఈ లక్షణాలు గమనించాలి

- శరీరంలో పురుష హార్మోన్ టెస్టోస్టిరాన్ పెరగడం
- శరీరం మీద వెంట్రుకలు ఎక్కువగా పెరగడం
- మధుమేహం సూచనలు కనిపించడం (మెడ వెనక నలుపు)
- నెలసరిలో అవకతవకలు
- మానసిక కుంగుబాటు, ఆందోళన

అధిక బరువు, పీసీఓడీ

అధిక బరువు, పీసీఓడీలకు అవినాభావ సంబంధం ఉంటుంది. పీసీఓడీ మూలంగా బరువు పెరిగిపోవడం, అధిక బరువు మూలంగా పీసీఓడీ బారిన పడడం సర్వసాధారణం. కాబట్టి బరువును అదుపులో పెట్టుకోవడంతో పాటు పెరిగిన బరువును ఆరోగ్యకరమైన అలవాట్లతో తగ్గించుకోగలిగితే పీసీఓడీ ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. పీసీఓడీ సమస్యను ప్రారంభంలో గుర్తించడం కోసం మొదటి నెలసరి కనిపించినప్పటి నుంచి ఆడపిల్లల ఆరోగ్యం మీద ఓ కన్నేసి ఉంచాలి. మొదటి మూడేళ్ల వరకూ నెలసరి అస్తవ్యస్తంగా ఉండడం సహజమే! ఆ తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగినా, శరీరం మీద వెంట్రుకలు ఎక్కువగా పెరుగుతున్నా, మొటిమలు ఎక్కువగా వేధిస్తున్నా పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలి.

చికిత్స ఇలా...

ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడమే పీసీఓడీ ప్రధాన చికిత్స. ఈ మార్పులు లేని పీసీఓడీ చికిత్స ఫలితాన్నివ్వదు. కాబట్టి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం గంట పాటు వ్యాయామం చేయడం, జంక్ ఫుడ్ మానేయడం తప్పనిసరి. ఒకవేళ పీసీఓడీ వల్ల శరీరంలో టెస్టోస్టిరాన్ విపరీతంగా పెరిగిపోయినా, శరీరం మీద వెంట్రుకలు ఎక్కువగా పెరిగిపోతున్నా, పీసీఓడీ, గర్భధారణకు అడ్డంకిగా మారేంత తీవ్ర దశకు చేరుకున్నా, అదనంగా మందులు వాడుకోవలసి ఉంటుంది. నెలసరి వస్తోంది కాబట్టి పీసీఓడీని పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు అనే భావనలో ఉండిపోయే వాళ్లూ ఉన్నారు. కానీ ఈ సమస్యతో గర్భం దాల్చినప్పుడు మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు తలెత్తుతాయి. వీటితో గర్భాన్ని కొనసాగించడం ఇబ్బందికరంగా మారుతుంది. నెలసరి అవకతవకలను దీర్ఘకాలం పాటు నిర్లక్ష్యం చేయడం వల్ల ఆ ప్రభావం గుండె మీద పడుతుంది. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ నిరంతరంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ పరిస్థితి అంతర్గత అవయవాలన్నిటికీ హానికరమే!


డాక్టర్ ఎ. మహిత రెడ్డి
అబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్,
అపోలో క్రేడిల్, హైదరాబాద్.

పండ్లలో మాంసకృత్తులు

శాకాహారులకు మాంసకృత్తుల కొరత కొంత ఎక్కువే! అయితే ఆ లోటును భర్తీ చేసే పండ్లు కూడా కొన్ని ఉన్నాయి. అవేంటంటే....



- **జామ:** కప్పు జామ ముక్కల్లో 4.2 గ్రాముల మాంసకృత్తులుంటాయి. జామలో విటమిన్ సి, పీచు కూడా ఎక్కువే కాబట్టి, జామ పండు క్రమం తప్పకుండా తింటూ ఉండాలి.
- **అవకాడో:** కప్పు అవకాడో ముక్కల్లో 3 గ్రాముల మాంసకృత్తులుంటాయి. గుండె, మెదడుకు అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా దీన్లో ఉంటాయి.
- **బ్లాక్‌బెర్రీ:** కప్పు బెర్రీల్లో 2 గ్రాముల మాంసకృత్తులుంటాయి. అదనంగా యాంటీఆక్సిడెంట్లు, పీచు విటమిన్లు కలిగి ఉండే బ్లాక్‌బెర్రీ తరచూ తింటూ ఉండాలి.
- **అప్రికాట్:** ఒక పండులో 0.5 గ్రాముల మాంసకృత్తులుంటాయి. పావు కప్పు ఎండు అప్రికాట్స్‌లో ఎక్కువ మోతాదులో 2 గ్రాముల మాంసకృత్తులుంటాయి.
- **కివి:** కప్పు కివి ముక్కల్లో 2 గ్రాముల మాంసకృత్తులుంటాయి. విటమిన్ సితో పాటు సహజసిద్ధ ఎంజైమ్స్‌ను కూడా కలిగి ఉండే కివి తినడం వల్ల జీర్ణశక్తి మెరుగు పడుతుంది.
- **అరటిపండు:** ఒక అరటిపండులో 1.3 గ్రాముల మాంసకృత్తులుంటాయి. పొటాషియం సమృద్ధిగా కలిగి ఉండే అరటిపండు తక్షణ శక్తినిస్తుంది.
- **పనస:** కప్పు పనస తొనల్లో 3 గ్రాముల మాంసకృత్తులుంటాయి.

నిద్రకు ముందు చక్కెర వద్దు



భోజనం తర్వాత తీపి తినే అలవాటుంటే, రాత్రి భోజనం సమయంలో ఆ అలవాటుకు స్వస్తి పలకాలి. రాత్రి తినే తీపితో కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలుంటాయి. అవేంటో తెలుసుకుందాం!

- తీపి రక్తంలోని చక్కెర మోతాదులను పెంచుతుంది. దాంతో రాత్రి వేళ తరచూ నిద్రాభంగం కలుగుతూ ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే రాత్రి తీపి తినడం మానేయాలి
- రాత్రి వేళ తీపి మానేస్తే, మరుసటి ఉదయం శరీరం మరింత చురుకుదనం పొందుతుంది
- రాత్రి వేళ తీపి తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మీద అదనపు భారం పడుతుంది. కణ మరమ్మతుతో పాటు, విషాలను శరీరం నుంచి వెళ్లగొట్టే అవకాశాన్ని శరీరానికి కల్పించాలంటే నిద్రకు ముందు తీపి తినడం మానుకోవాలి
- అదనపు క్యాలరీలు తగ్గి బరువు పెరిగే ముప్పు తప్పుతుంది
- చక్కెర హార్మోన్ల మీద ఎక్కువ. తీపి మానేస్తే, హార్మోన్ల అసమతౌల్యం సమస్య తొలగిపోతుంది.

ఐవరికోస్ట్.. 7 ఆలౌట్

టీ20ల్లో అత్యల్ప స్కోరుతో చెత్త రికార్డు

లాగోస్ (నైజీరియా): పురుషుల టీ20 ఫార్మాట్‌లో ఐవరికోస్ట్ అత్యంత చెత్త రికార్డు నమోదు చేసింది. నైజీరియాతో జరిగిన టీ20 వరల్డ్ కప్ సబ్ రీజనల్ ఆఫ్రికా గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఐవరికోస్ట్ కేవలం ఏడు పరుగులకే ఆలౌటైంది. తద్వారా అత్యల్ప స్కోరు సాధించిన జట్టుగా నిలిచింది. నైజీరియా స్కోరు 271/4 స్కోరుకు జవాబుగా బరిలో దిగిన కోస్ట్..7.3 ఓవర్లలో చాప చుట్టేసింది. దాంతో 10 పరుగుల గత అత్యల్ప స్కోరు రికార్డును బద్దలుగొట్టింది. సింగపూర్‌పై మంగోలియా, స్పెయిన్‌పై ఐసిల్ ఆఫ్ మ్యాన్ జట్లు ఆ స్కోర్లు చేశాయి. ఇక..ఐవరికోస్ట్ జట్టులో మొహ్మద్ (4) టాప్ స్కోరర్. నైజీరియా బౌలర్లు ఇసాక్, ఉసేని మూడేసి వికెట్లు, పీటర్ రెండు, సిల్వెస్టర్ ఒక వికెట్ పడగొట్టారు.



పేసర్లకు పండగ

ముగిసిన ఐపీఎల్ మెగా వేలం

ఐపీఎల్ మెగా వేలం తొలి రోజున దూకుడు కనబర్చిన పది ఫ్రాంచైజీలు సోమవారం మాత్రం ఆచితూచి స్పందించాయి. అన్ని జట్ల పర్స్‌లు అధిక మొత్తంలో ఖాళీ కావడంతో ఏ ఆటగాడు కూడా రూ.11 కోట్లు దాటలేకపోయాడు. ముఖ్యంగా పేసర్లు పండగ చేసుకున్నారు. వెటరన్ భువనేశ్వర్‌కు అత్యధికంగా రూ.10.75 కోట్లు లభించాయి. గాయాలతో ఇబ్బందిపడే దీపక్ చాహర్ సైతం రూ.9.25 కోట్లతో మంచి ధరే పలికాడు. విదేశీ ఆటగాళ్లలో గతేడాది రూ.18.5 కోట్లతో అదరగొట్టిన సామ్ కర్రాన్‌ను కేవలం రూ.2.4 కోట్లకే సీఎస్‌కే తీసుకుంది. మరోవైపు 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కోటీశ్వరుడే కాకుండా.. ఐపీఎల్ ఆడబోతున్న అతిపిన్న వయస్కుడిగా నిలిచాడు. ఇక ఆయా దేశాల స్టార్ ఆటగాళ్లకు వేలంలో ఈసారి నిరాదరణే ఎదురైంది.

13 ఏళ్లకే కోటీశ్వరుడు



వేలంలో చిన్న వయస్సు ప్లేయర్‌గా నిలిచిన 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ జాక్‌పాట్ కొట్టాడు. ఈసారి పేరున్న ఆటగాళ్లనే ఎవరూ పట్టించుకోకపోగా.. రూ.30 లక్షల కనీస ధర కలిగిన తను ఏకంగా రూ.కోటీ 10 లక్షలకు రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరాడు. దీంతో ఐపీఎల్ కాంట్రాక్ట్ కుదుర్చుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. అయితే ఢిల్లీ జట్టు కూడా ఈ టీనేజర్ కోసం గట్టిగానే ప్రయత్నించింది. ఎడమచేతి బ్యాటర్ అయిన వైభవ్ ఈ ఏడాదే బిహార్ తరఫున రంజీల్లో అరంగేట్రం చేశాడు. అలాగే అండర్-19 యూత్ టెస్టులో భారత్ తరఫున ఆసీస్‌పై 62 బంతుల్లోనే 104 పరుగులు చేసి వార్తలకెక్కాడు. యూత్ టెస్టుల్లో ఇదే ఫాస్టెస్ట్ కావడం విశేషం. ఇక ఐపీఎల్ బరిలోకి దిగి మరెన్ని రికార్డులు నెలకొల్పుతాడో వేచిచూడాల్సిందే.

భళా.. భువీ

సన్‌రైజర్స్‌తో భువనేశ్వర్‌కున్న 11 ఏళ్ల సుదీర్ఘ అనుబంధానికి తెర పడింది. మెగా వేలంలో అతడిని బెంగళూరు జట్టు రూ.10.75 కోట్ల అధిక ధరకు తీసుకుంది. కెరీర్ ఆరంభ 2009, 2010 సీజన్లలో తను ఆర్‌సీబీకే ఆడాడు. సోమవారం వేలంలో పది కోట్లు దాటిన ఏకైక ప్లేయర్ భువీనే కావడం విశేషం. ముందుగా తన కోసం ముంబై, లఖ్‌నవూ దూకుడుగా వెళ్లడంతో రేటు రూ.9 కోట్ల వరకు వెళ్లింది. ఈ దశలో ఆర్‌సీబీ పది కోట్లు దాటించి చివరకు తమ పాత పేసర్‌ను వశం చేసుకోగలిగింది.

దీపక్ ఈసారి ముంబైకి..



చెన్నై సూపర్ కింగ్స్‌తో ప్రత్యేక అనుబంధం కలిగిన పేసర్ దీపక్ చాహర్ ఈసారి ఆ జట్టును వీడాల్సి వచ్చింది. వేలంలో అతడిని ముంబై రూ.9.25 కోట్లకు తీసుకుంది. పంజాబ్ అతడి కోసం పోటీపడినా మధ్యలోనే వైదొలిగింది. అలాగే సీఎస్‌కే మరో పేసర్ తుషార్ దేశ్‌పాండే కూడా రూ.6.50 కోట్ల ధరతో రాజస్థాన్‌కు మారాడు. ఇక ఇతర పేసర్లలో లఖ్‌నవూ ఆకాశ్ దీప్‌ను, ఢిల్లీ ముకేశ్ కుమార్‌ను రూ.8 కోట్ల చొప్పున తీసుకున్నాయి. ముకేశ్‌ను పంజాబ్ 6.5 కోట్లకు తీసుకోగా.. ఆర్‌టీఎం ద్వారా డీసీ దక్కించుకుంది. ఉనాద్కట్‌ను కనీస ధర రూ.కోటికి సన్‌రైజర్స్, వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ రూ.75 లక్షలకు గుజరాత్ కొనుగోలు చేశాయి.

భువనేశ్వర్‌కు రూ.10.75 కోట్లు

దీపక్ చాహర్‌కు రూ.9.25 కోట్లు

ముకేశ్, ఆకాశ్‌లకు చెరో రూ.8 కోట్లు

జెడ్డా: ఐపీఎల్ మెగా వేలం రెండో రోజు కూడా భారత ఆటగాళ్లే ఎక్కువగా లబ్ధి పొందారు. అయితే మొదటి రోజుతో పోలిస్తే సోమవారం ధరల దూకుడు తగ్గింది. అనూహ్యంగా వెటరన్ పేసర్ భువనేశ్వర్ (రూ.10.75 కోట్లు)కు అందరికంటే ఎక్కువ ధర పలికింది. ఆ తర్వాత కూడా వరుసగా పేసర్లే అధిక ధరల రేసులో నిలిచారు. అయితే స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు మాత్రం అంచనాలకు భిన్నంగా తక్కువ ధరే లభించింది. గుజరాత్ అతడిని కేవలం రూ.3.2 కోట్ల ధరకే తీసుకుంది. క్రునాల్ పాండ్యా మాత్రం రూ.5.75 కోట్లకు ఆర్‌సీబీకి ఆడనున్నాడు. మొత్తంగా ఈ మెగా వేలంలో రెండు రోజుల్లో 182 మంది ఆటగాళ్లు కొనుగోలు కాగా ఇందులో 62 మంది విదేశీ ప్లేయర్లున్నారు. వీరి కోసం అన్ని జట్లు రూ.639.15 కోట్ల మొత్తాన్ని వెచ్చించాయి. చెన్నై, గుజరాత్, పంజాబ్ జట్లు గరిష్ఠంగా 25 మంది ఆటగాళ్లను కలిగిఉన్నాయి. ఇక వేలం ముగిశాక ఆర్‌సీబీ దగ్గర అత్యధికంగా రూ.75 లక్షలు మిగిలి ఉండగా సీఎస్‌కే కేవలం రూ. 5 లక్షలు మాత్రమే కలిగి ఉంది.

ముందే డీల్ జరిగిందా?


సోమవారం మెగా వేలంలో ముంబై ఇండియన్స్ యజమాని ఆకాశ్ అంబానీ తీరు పలు సందేహాలకు తావిచ్చినట్టయ్యింది. గత సీజన్‌లో ఆర్‌సీబీకి ఆడిన విల్ జాక్స్ తన విధ్వంసక ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్నాడు. అలాంటి ప్లేయర్‌ను ఆర్‌టీఎం ద్వారా ఆర్‌సీబీ తిరిగి తీసుకుంటుందని అంతా భావించారు. అతడికోసం మొదట పంజాబ్, ముంబై పోటీపడగా రేటు రూ.5.25 కోట్ల దగ్గర ఆగింది. అయితే ఈ దశలో ఆర్‌సీబీ నుంచి ఎలాంటి స్పందన లేకపోగా.. ముంబై వైపు చూస్తూ అతడు మీకే అన్నట్టుగా సైగ చేశారు. దీంతో సంతోషం పట్టలేని ఆకాశ్ వెంటనే ఆర్‌సీబీ స్టాఫ్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ తీరును నిరసిస్తూ ముంబైతో ముందే ఒప్పందం కుదుర్చుకున్నారా? అంటూ ఆర్‌సీబీపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ సాగుతోంది.

ఢిల్లీకి సిక్సర్ల వీరుడు



ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదిన ప్రియాన్ష్ ఆర్యకు అదృష్టం పండింది. రూ.30 లక్షల కనీస ధర కలిగిన అతడిపై పంజాబ్ కింగ్స్ రూ.3.8 కోట్లు వెచ్చించింది. ఆర్‌సీబీ కూడా అతడి కోసం చివరి వరకు ప్రయత్నించింది. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 222 రన్స్‌తో ఢిల్లీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

'విదేశీ'లో జాన్సెన్ టాప్



విదేశీ ఆటగాళ్లలో పేస్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ రూ.7 కోట్ల ధరతో టాప్‌లో నిలిచాడు. ఇటీవల భారత్‌లో జరిగిన టీ20 సిరీస్‌లో విశేషంగా రాణించడంతో మంచి రేటే పలికింది. ఇక డుప్లెసీ అతడి కనీస ధర రూ.2 కోట్లకే ఢిల్లీ తీసుకుంది. టిమ్ డేవిడ్‌ను రూ.3 కోట్లకు ఆర్‌సీబీ, స్పెన్సర్ జాన్సన్‌ను రూ.2.80 కోట్లకు కేకేఆర్ తీసుకుంది. అలాగే రూ.75 లక్షల కనీస ధర కలిగిన అఫ్ఘాన్ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్‌ను ముంబై రూ.4.80 కోట్లకు తీసుకోవడం విశేషం.

రెండో రోజు టాప్-5 ఆటగాళ్లు

భువనేశ్వర్	బెంగళూరు	రూ.10.75 కోట్లు
దీపక్ చాహర్	ముంబై	రూ.9.25 కోట్లు
ఆకాశ్‌దీప్	లఖ్‌నవూ	రూ.8 కోట్లు
ముకేశ్ కుమార్	ఢిల్లీ	రూ.8 కోట్లు
తుషార్	రాజస్థాన్	రూ.6.50 కోట్లు

రెండోసారి అదృష్టం

వేలంలో మొదట అన్‌సోల్డ్‌గా మిగిలిన ఆటగాళ్లలో పలువురికి చివర్లో అదృష్టం దక్కింది. వీరిలో దేవ్‌దత్‌ను ఆర్‌సీబీ, మొయిన్ అలీని కేకేఆర్, గ్లెన్ ఫిలిప్స్‌ను గుజరాత్ జట్లు వారి కనీస ధర రూ.2 కోట్లకు కొనుగోలు చేశాయి. అలాగే అజింక్యా రహానె కోటీ 50 లక్షలకు కేకేఆర్ దక్కించుకుంది. సన్‌రైజర్స్‌కు ఆడిన పేసర్ ఉమ్రాన్‌ను రూ.75 లక్షలకు కేకేఆర్ తీసుకోగా, ఇక సచిన్ తనయుడు అర్జున్‌ను ఎప్పటిలాగే ముంబై రూ.30 లక్షలకు తీసుకుంది.

వీరిని పట్టించుకోలే..

స్వదేశీ ఆటగాళ్లు: మయాంక్, సర్ఫరాజ్, పృథ్వీ షా, శార్దూల్, కేఎస్ భరత్, ఉమేశ్ యాదవ్, సైనీ, శివమ్ మావి, చేతన్ సకారియా. **విదేశీ ఆటగాళ్లు:** వార్నర్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్, మిచెల్, బ్రేస్‌వెల్, ఫిన్ అలెన్, క్యారీ, బెహ్రెన్‌డార్ఫ్, జోర్డాన్, హోప్, అల్జారి జోసెఫ్, కేశవ్ మహరాజ్, బ్రెవిస్, సికిందర్ రజా, నవీనుల్ హక్, ముజీబుర్, ముస్తాఫిజుర్,

---

కఠినమైన ఆసీస్ టూర్‌ను భారత్ అపూర్వ విజయంతో ఆరంభించింది. బుమ్రా ముందుండి నడిపించగా... జైస్వాల్, కోహ్లీ శతకాలతో దుమ్మురేపడంతో.. ఆప్టస్ స్టేడియంలో ఆతిథ్య జట్టుకు టీమిండియా తొలిసారి ఓటమి రుచి చూపించింది. తొలి ఇన్నింగ్స్ కష్టంగా 150 పరుగులకే కుప్పకూలినా.. పేస్‌దళం నిప్పులు చెరగడంతో పైచేయి సాధించిన భారత్.. ప్రత్యర్థికి కోలుకొనే అవకాశం ఇవ్వలేదు. కొత్తగా టీమ్‌లోకి వచ్చిన కుర్రాళ్లు నితీశ్, హర్షిత్ తమ ఎంపికపై ఎదురైన విమర్శలకు తగిన సమాధానం ఇచ్చారు. మొత్తంగా రోహిత్, జడేజా, అశ్విన్ లాంటి సీనియర్లు లేకుండా బరిలోకి దిగిన టీమిండియా.. చిరస్మరణీయ విజయంతో సిరీస్‌లో ఘనంగా బోణీ చేసింది.



సిరాజ్ (3/51)

పెర్త్ పాదాక్రాంతం



తొలి టెస్ట్‌లో భారత ఘన విజయం

కంగారూల పనిబట్టిన బుమ్రా

295 పరుగులతో ఆస్ట్రేలియా చిత్తు

హెడ్ పోరాటం వృథా

హెడ్ (89) బుమ్రా (3/42)

పెర్త్: సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో క్లీన్‌స్వీప్‌కు గురైన భారత్.. బలంగా పుంజుకొంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని అద్భుత విజయంతో మొదలెట్టింది. బుమ్రా అండ్ కో దుమ్మురేపడంతో.. తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియాను 295 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మరో రోజు ఆట మిగిలుండగానే మ్యాచ్‌ను సొంతం చేసుకొన్న టీమిండియా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో పైచేయి సాధించింది. 534 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా.. ఆటకు నాలుగో రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 12/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్ 238 పరుగులకే కుప్పకూలింది. ట్రావిస్ హెడ్ (89), మిచెల్ మార్ష్ (47), అలెక్స్ క్యారీ (36) కొంత పోరాటం కనబర్చారు. బుమ్రా, సిరాజ్ తలో మూడు వికెట్లు పడగొట్టగా.. వాషింగ్టన్ సుందర్ 2 వికెట్లు కూల్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులు చేసిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌ను 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు కుప్పకూలింది. ప్రత్యర్థి వెన్ను విరిచిన స్టాండిన్ కెప్టెన్ బుమ్రా (8/72) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్ట్ (డే/నైట్) వచ్చేనెల 6నుంచి అడిలైడ్‌లో జరగనుంది.

బ్యాటర్ల వైఫల్యం..

కొండంత లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆసీస్.. టీమిండియా పేసర్ల దెబ్బకు విలవిల్లాడింది. హెడ్, మార్ష్ మినహా మిగతా బ్యాటర్లు కనీస పోరాటాన్ని కూడా ప్రదర్శించలేదు. ముందు రోజు మూడు టాపార్డర్ వికెట్లు చేజార్చుకొన్న కంగారూలను తొలి సెషన్‌లో సిరాజ్ వణికించాడు. ఓవర్‌నైట్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా (4)ను క్యాచవుట్ చేశాడు. అయితే, స్మిత్ (17), హెడ్ ఐదో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, స్మిత్‌ను కూడా సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న హెడ్‌కు మార్ష్ జత కలవడంతో స్కోరు వేగం పుంజుకొంది. వీరిద్దరూ వన్డే తరహాలో షాట్లు ఆడడంతో లంచ్ సమయానికి ఆసీస్ 104/5తో నిలిచింది. తిరిగి వచ్చిన తర్వాత కూడా ఇద్దరూ అటాకింగ్ ఆటనే ప్రదర్శించారు. ఈ దశలో మరోసారి బంతిని అందుకొన్న బుమ్రా.. ధాటిగా ఆడుతున్న హెడ్‌ను క్యాచవుట్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు క్రీజులో పాతుకుపోవాలని చూసిన మార్ష్‌ను నితీశ్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చింది. స్టార్క్ (12)ను సుందర్ అవుట్ చేయడంతో.. ఆసీస్ 227/8తో టీకి వెళ్లింది. ఆఖరి సెషన్‌లో కేవలం ఐదు ఓవర్లలోనే భారత బౌలర్లు లాంఛనాన్ని ముగించారు. లియోన్ (0)ను సుందర్ అవుట్ చేయగా.. క్యారీని బౌల్డ్ చేసిన హర్షిత్ ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150 ఆలౌట్
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 104 ఆలౌట్
భారత్ రెండో ఇన్నింగ్స్: 487/6 డిక్లేర్డ్
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 0, ఖవాజా (సి) పంత్ (బి) సిరాజ్ 4, కమిన్స్ (సి) కోహ్లీ (బి) సిరాజ్ 2, లబుషేన్ (ఎల్బీ) బుమ్రా 3, స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 17, హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 89, మార్ష్ (బి) నితీశ్ 47, క్యారీ (బి) హర్షిత్ 36, స్టార్క్ (సి) జురెల్ (బి) సుందర్ 12, లియోన్ (బి) సుందర్ 0, హాజెల్‌వుడ్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 58.4 ఓవర్లలో 238 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-9, 3-12, 4-17, 5-79, 6-161, 7-182, 8-227, 9-227; **బౌలింగ్:** బుమ్రా 12-1-42-3, సిరాజ్ 14-2-51-3, హర్షిత్ 13.4-1-69-1, సుందర్ 15-0-48-2, నితీశ్ 4-0-21-1.

మళ్లీ టాప్‌లోకి..

పెర్త్‌లో విజయంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకొంది. టీమిండియా 61.11 విజయాల శాతంతో నెం:1 ర్యాంక్‌ను సొంతం చేసుకోగా.. ఆస్ట్రేలియా రెండో స్థానానికి దిగజారింది. ఎటువంటి సమీకరణాలు అవసరం లేకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే టీమిండియా ఈ సిరీస్‌ను 4-0తో నెగ్గాల్సి ఉంటుంది. శ్రీలంక, న్యూజిలాండ్ మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి.

నా కుమారుడికి చెప్పుకోవడానికి ఎన్నో కథలు

"కెప్టెన్‌గా తొలి విజయం నాకు ఎంతో ప్రత్యేకం. ఈ సమయంలో నా కొడుకు కూడా ఉండడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ప్రస్తుతం అతడు చిన్న పిల్లాడే కానీ.. పెరిగి పెద్ద వాడైన తర్వాత చెప్పుకోవడానికి ఎన్నో అపురూప జ్ఞాపకాలు, కథలు నాకు మిగిలుంటాయి. టీ20 వరల్డ్‌కప్ గెలిచినప్పుడు కూడా వాడు స్టాండ్స్‌లో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌటైనప్పుడు కూడా జట్టు సభ్యులు ఏమాత్రం డీలా పడకపోవడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచిం ది. యువ ఆటగాళ్ల నితీశ్, హర్షిత్ ఆకట్టుకొన్నారు. తొలిసారి ఆసీస్‌లో ఆడుతున్నామనే బెరుకు వారిలో కనిపించలేదు. ఇద్దరూ తమతమ బాధ్యతలను అద్భుతంగా నిర్వర్తించారు."
-బుమ్రా

1 ఆప్టస్ స్టేడియంలో ఆడిన ఐదు టెస్ట్‌లో ఆస్ట్రేలియాకు ఇది తొలి ఓటమి.

పెర్త్‌లో టెస్ట్ మ్యాచ్ గెలిచిన రెండో ఆసియా, భారత కెప్టెన్‌గా బుమ్రా. 2008లో అనిల్ కుంబ్లే ఈ ఘనతను అందుకొన్నాడు.

2 గత 40 ఏళ్లలో సొంతగడ్డపై పరుగుల పరంగా కంగారూలకు (295 రన్స్) ఇది రెండో అతిపెద్ద ఓటమి. 2012లో వాకాలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఆసీస్ 309 పరుగుల తేడాతో ఓడింది.

భారత్ చేతిలో ఆసీస్‌కు ఇది రెండో అతిపెద్ద ఓటమి. 2008లో మొహాలీ టెస్ట్‌లో 320 పరుగుల తేడాతో చిత్తయింది.

4 కెప్టెన్‌గా టెస్టుల్లో బుమ్రా (8/72)ది నాలుగో అత్యుత్తమ ప్రదర్శన. 1983లో అహ్మదాబాద్‌లో వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో కపిల్‌దేవ్ (10/135), 1977 పెర్త్‌లో బిషన్ సింగ్ బేడి (10/194), 1976లో చెన్నైలో న్యూజిలాండ్‌తో టెస్ట్‌లో బేడీ (9/70) ఈ ఘనతను సాధించారు.

ఢిల్లీ
మొత్తం ఆటగాళ్లు: 23
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, స్టబ్స్, అభిషేక్ పొరెల్.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: స్టార్క్, కేఎల్ రాహుల్, బ్రూక్, మెక్‌గర్క్, నటరాజన్, కరుణ్ నాయర్, రిజ్వీ, అశుతోష్, మోహిత్, డుప్లెసీ, ముకేశ్ కుమార్, మల్కండే, నిగమ్, చమీర, ఫెరీరా, అజయ్ మండల్, మన్వంత్, త్రిపురన విజయ్, మాధవ్ తివారి.

బెంగళూరు
మొత్తం ఆటగాళ్లు: 22
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: కోహ్లీ, పటిదార్, యశ్ దయాల్.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: లివింగ్‌స్టోన్, సాల్ట్, జితేశ్, హాజెల్‌వుడ్, రసిక్‌దార్, సుయాశ్ శర్మ, క్రునాల్ పాండ్యా, భువనేశ్వర్, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, షఫర్డ్, తుషార, మనోజ్, బెతెల్, పడిక్కళ్, స్వస్తిక్, ఎంగిడి, అభినందన్, మోహిత్ రాఠి.

కోల్‌కతా
మొత్తం ఆటగాళ్లు: 21
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: రింకూ సింగ్, వరుణ్‌చక్రవర్తి, నరైన్, రస్సెల్, హర్షిత్ రాణా, రమణ్‌దీప్.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: వెంకటేశ్ అయ్యర్, డికాక్, గుర్బాజ్, నోకియా, రఘువంశీ, మార్కండే, వైభవ్, రోమన్ పొవెల్, మనీష్ పాండే, స్పెన్సర్ జాన్సెన్, సిసోడియా, రహానె, అనుకూల్ రాయ్, మొయిన్ అలీ, ఉమ్రాన్ మాలిక్.

రాజస్థాన్
మొత్తం ఆటగాళ్లు: 20
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: సంజూ శాంసన్, జైస్వాల్, పరాగ్, జురెల్, హెట్‌మయెర్, సందీప్ శర్మ.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: ఆర్చర్, తీక్షణ, హసరంగ, ఆకాశ్, కార్తికేయ, నితీష్ రాణా, తుషార్, శుభమ్ దూబే, యుధ్‌వీర్, ఫరూఖి, వైభవ్ సూర్యవంశీ, మఫాఖ, కునాల్ రాథోడ్, అశోక్ శర్మ.

ముంబై
మొత్తం ఆటగాళ్లు: 23
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: హార్దిక్, రోహిత్, సూర్యకుమార్, తిలక్, బుమ్రా.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: బౌల్ట్, నమన్, రాబిన్, కర్ణ్‌శర్మ, రికెల్టన్, దీపక్ చాహర్, విల్‌జాక్స్, అశ్వనీ కుమార్, శాంట్నర్, టోప్లే, క్రిష్ణన్, రాజ్ బవా, సత్యనారాయణరాజు, జేకబ్స్, అర్జున్, లిజార్డ్, విఘ్నేష్.

పంజాబ్
మొత్తం ఆటగాళ్లు: 25
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: శశాంక్ సింగ్, ప్రభ్‌సిమ్రన్.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: శ్రేయాస్ అయ్యర్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, మార్కో జాన్సెన్, అజ్మతుల్లా, ఆరోన్ హార్డీ, సూర్యాంశ్, చాహల్, బ్రార్, ప్రవీణ్ దూబే, అర్షదీప్ సింగ్, యశ్ ఠాకూర్, ఫెర్గూసన్, వైశాఖ్, నేహల్ వధేరా, కుల్దీప్ సేన్, గ్జేవియర్ హర్నూర్, ప్రియాన్ష్ ఆర్య, ముషీర్ ఖాన్, పైలా అవినాష్, విష్ణు వినోద్, ఇన్‌గ్లిస్,

సన్‌రైజర్స్
మొత్తం ఆటగాళ్లు: 20
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: కమిన్స్, అభిషేక్ శర్మ, నితీశ్‌కుమార్, క్లాసెన్, హెడ్.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: షమి, హర్షల్, ఇషాన్ కిషన్, రాహుల్ చాహర్, జంపా, అథర్వ, అభినవ్, సిమర్‌జీత్, జీషన్, ఉనాద్కట్, బ్రైడన్, కమింగు, అనికేత్, ఎషాన్ మలింగ, సచిన్ బేబి.

లఖ్‌నవూ
మొత్తం ఆటగాళ్లు: 24
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: నికోలస్ పూరన్, బిష్ణోయ్, మయాంక్ యాదవ్, మొహిసిన్, బదోని.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: రిషబ్ పంత్, మిల్లర్, మార్‌క్రమ్, మార్ష్, అవేశ్ ఖాన్, సమద్, ఆర్యన్, ఆకాశ్‌దీప్, హిమ్మత్‌సింగ్, సిద్దార్థ్, దిగ్వేష్, షాబాజ్ అహ్మద్, ఆకాశ్‌సింగ్, షమార్ జోసెఫ్, ప్రిన్స్ యాదవ్, యువరాజ్, రాజ్‌వర్ధన్, హర్షిల్ కులకర్ణి, బ్రీట్జ్కే.

గుజరాత్
మొత్తం ఆటగాళ్లు: 25
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: రషీద్, గిల్, సాయి సుదర్శన్, తెవాటియా, షారుక్.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: రబాడ, బట్లర్, సిరాజ్, ప్రసిద్ధ్ క్రిష్ణ, నిశాంత్, లోమ్రోర్, కుశాగ్ర, అనూజ్, మానవ్‌సుతార్, వాషింగ్టన్, కొట్జీ, హర్షద్, గుర్నూర్, రూథర్‌ఫర్డ్, సాయి కిషోర్, ఇషాంత్ శర్మ, జయంత్, ఫిలిప్స్, కరీం, కుల్వంత్.

చెన్నై
మొత్తం ఆటగాళ్లు: 25
అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: రుతురాజ్, పతిరణ, శివమ్ దూబే, జడేజా, ధోనీ.
కొనుగోలు చేసిన ఆటగాళ్లు: కాన్వే, త్రిపాఠి, రచిన్, అశ్విన్, ఖలీల్, నూర్ అహ్మద్, విజయ్ శంకర్, కర్రాన్, షేక్ రషీద్, అన్షుల్ కాంబోజ్, ముకేశ్ చౌదరి, దీపక్ హుడా, గుర్‌జప్నీత్, ఎల్లిస్, ఓవర్టన్, నాగర్‌కోటి, రామకృష్ణ, శ్రేయాస్ గోపాల్, వన్ష్‌బేడి, ఆండ్రీ సిద్దార్థ్.

వేలంలో తెలుగు వెలుగులు



రషీద్

ఐపీఎల్ రెండో రోజు వేలంలో నలుగురు తెలుగు క్రికెటర్లను ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఈ నలుగురు క్రికెటర్లను కనీస ధర రూ.30 లక్షలకు కొన్నాయి. 2022 అండర్-19 వరల్డ్‌కప్ నెగ్గిన టీమిండియా వైస్ కెప్టెన్, గుంటూరు యువ బ్యాటర్ షేక్ రషీద్‌ను చెన్నై జట్టు వరుసగా మూడో ఏడాది వేలంలో దక్కించుకుంది. రషీద్‌తో పాటు విశాఖకు చెందిన పైల అవినాష్‌ను పంజాబ్, కాకినాడ ఆటగాడు పెన్మెత్స వెంకట సత్యనారాయణను ముంబై ఇండియన్స్, టెక్కలి క్రికెటర్ త్రిపురన విజయ్‌ను ఢిల్లీ జట్లు తీసుకున్నాయి. తొలి రోజు వేలంలో తళుక్కుమన్న హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్, ముంబై, సన్‌రైజర్స్ రిటైన్ చేసుకున్న తిలక్‌వర్మ, నితీశ్‌రెడ్డితో కలిపి ఈసారి ఐపీఎల్‌లో ఆడే తెలుగు క్రికెటర్ల సంఖ్య ఏడుకి చేరింది. విశాఖకు చెందిన వెటరన్ వికెట్‌కీపర్ కేఎస్ భరత్, సిరిసిల్ల యువ క్రికెటర్ అరవెల్లి అవనీష్ పేర్లు వేలంలో వచ్చినా వీరిని కొనడానికి ఫ్రాంచైజీలు ఆసక్తి చూపలేదు. రికీ భుయ్, అశ్విన్ హెబ్బర్, తనయ్ త్యాగరాజన్, తన్మయ్ అగర్వాల్ సహా మొత్తంగా ఈసారి వేలంలో ఆంధ్ర నుంచి పన్నెండు, తెలంగాణ నుంచి ఏడుగురు క్రికెటర్లు పాల్గొన్నారు.

తొలి గేమ్ లిరెన్‌దే..

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ మొదటి గేమ్ అత్యంత ఆసక్తికరంగా సాగింది. అయితే మధ్య గేమ్‌లో తడబాటుకు లోనైన భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ మూల్యం చెల్లించుకున్నాడు. దాంతో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. నల్ల పావులతో ఆడిన చైనా గ్రాండ్‌మాస్టర్ ఈ విజయంతో 14 గేముల తుది పోరులో 1-0తో పైచేయి సాధించాడు. గుకేష్ తెల్ల పావులతో కింగ్ పాన్ ఓపెనింగ్‌తో ఆశ్చర్యపరిచాడు. 2001లో అలెక్సీ షిరోవ్‌తో వరల్డ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో దిగ్గజ ఆటగాడు ఆనంద్ ఇదే ఓపెనింగ్‌ను ఎంచుకొని గెలవడం విశేషం. 17 ఏళ్ల గుకేష్ అటాకింగ్ ఓపెనింగ్‌ను లిరెన్ ఫ్రెంచ్ డిఫెన్స్‌తో ఎదుర్కొన్నాడు. 12వ ఎత్తు వచ్చేసరికి 30 నిమిషాల సమయంతో గుకేష్ మెరుగైన స్థితిలోనే నిలిచాడు. కానీ మరో ఎనిమిది ఎత్తుల తర్వాత రెండు నిమిషల అదనపు సమయంతో లిరెన్ పైచేయి ప్రదర్శించాడు. అంటే..గుకేష్ ఓపెనింగ్‌ను లిరెన్ సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు మిడిల్ గేమ్ వచ్చేసరికి లిరెన్ పటిష్ఠ స్థితిలో ఉంటాడని తేలిపోయింది. 33వ ఎత్తుకు వచ్చేసరికి గుకేష్ చిక్కుల్లో పడ్డాడు. 45 సెకన్లలో ఏడు ఎత్తులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఒక సెకనే సమయం ఉండగా 40వ ఎత్తు వేశాడు. ఈ ఎత్తుతో భారత జీఎం అదనపు సమయం దక్కించుకున్నా అప్పటికే రెండు పావులను కోల్పోయాడు. దాంతో ఒత్తిడికి లోనైన గుకేష్ 42 ఎత్తుల్లో ఓటమిని అంగీకరించక తప్పలేదు.

టైటిల్ కరువు తీరేనా?

బరిలో సింధు, లక్ష్యసేన్

నేటినుంచి సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవూ: ఇటీవల వరుస ఈవెంట్లలో విఫలమవుతున్న స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్.. స్వదేశంలో జరుగుతున్న సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలోనైనా విజేతలుగా నిలవాలని పట్టుదలగా ఉన్నారు. మంగళవారం ప్రారంభమయ్యే టోర్నీలో సింధు, సేన్‌తో పాటు డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్/సిరాజ్ టైటిళ్లపై కన్నేశారు. మహిళల సింగిల్స్‌లో మాళవికా బన్సోడ్, ఆకర్షి కశ్యప్, రక్షిత శ్రీ, అనుపమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మహిళల డబుల్స్‌లో అశ్విని/తనీషా, గాయత్రి/ట్రీసా జోడీలు ఫేవరెట్లుగా తలపడుతున్నారు.

నాగాలాండ్‌పై ఆంధ్ర గెలుపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ స్పిన్నర్ విజయ్ నాలుగు వికెట్ల (4/8)తో చెలరేగడంతో నాగాలాండ్‌పై ఆంధ్ర జట్టు 8 వికెట్లతో విజయం సాధించింది. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత నాగాలాండ్.. విజయ్, స్టీఫెన్ (3/6) ధాటికి 17.1 ఓవర్లలో 77 రన్స్‌కు ఆలౌటైంది. ఛేదనలో శ్రీకర్ భరత్ (27), అశ్విన్ హెబ్బర్ (43) రాణించడంతో ఆంధ్ర 9.4 ఓవర్లలో 79/2 స్కోరు చేసి గెలిచింది. ఇక, రాజ్‌కోట్‌లో బెంగాల్‌తో తలపడిన హైదరాబాద్ జట్టు ఓటమిపాలైంది. తొలుత హైదరాబాద్ 18.3 ఓవర్లలో 137కు ఆలౌటైంది. కెప్టెన్ తిలక్ వర్మ (57) మినహా అంతా విఫలమయ్యారు. ఛేదనలో బెంగాల్ 17.5 ఓవర్లలో 138/2 స్కోరు చేసి నెగ్గింది.

మహానందమయం

993 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

మళ్లీ 80,000 ఎగువకు సూచీ

24,000పైకి నిఫ్టీ.. 315 పాయింట్లు అప్

2 రోజుల్లో రూ.14.20 లక్షల కోట్ల సంపద వృద్ధి



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వ మహాయుతి కూటమి ఘనవిజయం సాధించడంతో స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరపడంతో సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మళ్లీ 80,000 ఎగువకు చేరింది. నిఫ్టీ 24,000 మైలురాయిని దాటేసింది. సెన్సెక్స్ ఒక దశలో 1,355.97 పాయింట్ల (1.71 శాతం) వృద్ధితో 80,473.08 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 992.74 పాయింట్ల (1.25 శాతం) లాభంతో 80,109.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 314.65 పాయింట్లు (1.32 శాతం) బలపడి 24,221.90 వద్ద ముగిసింది. ప్రామాణిక సూచీలు భారీగా లాభపడటం వరుసగా ఇది రెండో రోజు. గత శుక్రవారం సెన్సెక్స్ 1,961 పాయింట్లు, నిఫ్టీ 557 పాయింట్లు పెరిగాయి. గడిచిన రెండు సెషన్లలో స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14.20 లక్షల కోట్లు పెరిగి రూ.439.58 లక్షల కోట్లకు (5.22 లక్షల కోట్ల డాలర్లు) పెరిగింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 రాణించాయి. బీఎస్ఈలో 4,214 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,675 లాభపడ్డాయి. 1,389 కంపెనీల షేర్లు నష్టపోగా.. 150 యథాతథంగా ముగిశాయి. 206 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠానికి ఎగబాకగా.. 415 అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.

5 అదానీ షేర్లు డౌన్

మార్కెట్ జోరు మీదున్నప్పటికీ అదానీ గ్రూప్‌లోని 5 కంపెనీల షేర్లు నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ మరో 8.05 శాతం క్షీణించగా.. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 3.78 శాతం, అదానీ పవర్ 3.02 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 1.43 శాతం, ఎన్‌డీటీవీ 2.07 శాతం నష్టపోయాయి. కాగా, అదానీ పోర్ట్స్ 2.55 శాతం, ఏసీసీ 2.54 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.26 శాతం, అదానీ విల్మర్ 1.81 శాతం, అంబుజా సిమెంట్స్ 0.88 శాతం పెరిగాయి.

విదేశీ ఇన్వెస్టర్ల రీఎంట్రీ

ఒక్కరోజే రూ.9,948 కోట్ల నికర కొనుగోళ్లు

వరుసగా 38 ట్రేడింగ్ సెషన్ల పాటు భారత స్టాక్ మార్కెట్లో భారీగా అమ్మకాలకు పాల్పడుతూ వచ్చిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మళ్లీ కొనుగోళ్లు మొదలు పెట్టారు. ఎన్ఎస్ఈ ప్రాథమిక సమాచారం ప్రకారం... సోమవారం ఎఫ్ఐఐలు మన ఈక్విటీ మార్కెట్లో రూ.9,948 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. కాగా, 13 సెషన్లుగా భారీగా కొనుగోళ్లు జరిపిన దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) మాత్రం లాభాలు స్వీకరించారు. డీఐఐలు నికరంగా రూ.6,908 కోట్ల షేర్లను విక్రయించారు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎఫ్ఐఐలు మన మార్కెట్ నుంచి నికరంగా రూ.2.84 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. అక్టోబరు ఆరంభం నుంచి గత వారం చివరి వరకు (7 వారాల్లో) ఎఫ్ఐఐలు రూ.1.55 లక్షల కోట్ల అమ్మకాలు జరిపారు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు డీఐఐలు నికరంగా రూ.5.56 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు.

లేహ్‌లో అమర రాజా ఇన్‌ఫ్రా గ్రీన్ హైడ్రోజన్ స్టేషన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఇన్‌ఫ్రా మరో ఘనత సాధించింది. లద్దాఖ్‌లోని అత్యంత శీతల ప్రాంతం 'లేహ్' వద్ద ఎన్‌టీపీసీ కోసం హరిత ఉదజని (గ్రీన్ హైడ్రోజన్) ఫ్యూయల్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసింది. లేహ్‌లో ఇదే తొలి హరిత ఉదజని ఫ్యూయల్ స్టేషన్ అని అమర రాజా ఇన్‌ఫ్రా తెలిపింది. సముద్ర మట్టానికి 3,400 ఎత్తున మైనస్ 25-30 డిగ్రీల శీతల వాతావరణాన్ని తట్టుకుని రెండేళ్లలో ఈ ఫ్యూయల్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసినట్టు పేర్కొంది. రోజుకు 80 కిలోల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్‌లో ఉత్పత్తి అయ్యే గ్రీన్ హైడ్రోజన్‌ను ఎన్‌టీపీసీ రోజూ ఐదు బస్సులకు సరఫరా చేస్తుంది.

భారత్‌లో రూ.84,310 కోట్ల విలువైన ఐఫోన్ల అసెంబ్లింగ్

న్యూఢిల్లీ: భారత్‌లో అసెంబ్లింగ్ చేసే యాపిల్ ఐఫోన్ల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబరు మధ్య కాలంలో మన దేశంలో ఫ్యాక్టరీ గేటు ధర ప్రకారం 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.84,310 కోట్లు) విలువైన ఐఫోన్ల అసెంబ్లింగ్ జరిగింది. అమ్మకాలు, పంపిణీ, మార్కెటింగ్, లాభాలు, లాజిస్టిక్ ఖర్చులు కూడా కలిపితే ఈ ఐఫోన్ల విలువ 1,500 కోట్ల డాలర్ల వరకు ఉంటుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఇందులో 700 కోట్ల డాలర్ల విలువైన ఐఫోన్లను యాపిల్.. భారత్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. ప్రస్తుతం నెలకు 200 కోట్ల డాలర్ల విలువైన ఐఫోన్లు మన దేశంలో అసెంబ్లింగ్ అవుతున్నాయి.

మరింత కఠినంగా సూక్ష్మ రుణాలు

జనవరి 1 నుంచే అమలు

ముంబై: సూక్ష్మ రుణ పరపతి సంస్థలు (ఎంఎఫ్ఐ) అల్పాదాయ వర్గాలకు ఇచ్చే సూక్ష్మ రుణాల నిబంధనలు మరింత కఠినం కానున్నాయి. దీనికి సంబంధించి ఈ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే మైక్రోఫైనాన్స్ ఇనిస్టిట్యూషన్స్ నెట్‌వర్క్ (ఎంఎఫ్ఐఎన్) సోమవారం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచే ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ రుణ సంస్థల ఆగడాలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనేక సార్లు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో ఎంఎఫ్ఐఎన్ ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఇక ఏ వ్యక్తీ, మూడు కంటే ఎక్కువ సూక్ష్మ రుణ సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు వీల్లేదు. రుణ పరిమితి కూడా రూ.2 లక్షలు మించరాదని ఎంఎఫ్ఐఎన్ స్పష్టం చేసింది. ఒక వ్యక్తి చెల్లించాల్సిన సూక్ష్మ రుణ బకాయిలు 60 రోజుల్లోగా వసూలు కాకపోతే ఆ ఖాతాను ఇక మొండి బకాయి (ఎన్‌పీఏ)గా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈ గడువు 90 రోజులుగా ఉంది. ఎన్‌పీఏగా మారిన రుణ ఖాతాదారులకు ఇక ఏ సూక్ష్మ రుణ సంస్థా కొత్త అప్పులు ఇవ్వవని కూడా ఎంఎఫ్ఐఎన్ స్పష్టం చేసింది.

మారుతి సుజుకీ 30 లక్షల కార్ల ఎగుమతులు

2031 నాటికి మరో 7.5 లక్షల కార్ల ఎగుమతి

న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ఎగుమతులపై మరింత దృష్టి పెడుతోంది. గత ఆర్థిక సంవత్సరం ఎంఎస్ఐ 2.83 లక్షల కార్లను ఎగుమతి చేసింది. ఈ ఏడాది ఏప్రిల్-అక్టోబరు మధ్య కాలంలో 1,81,444 కార్లను ఎగుమతి చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 17 శాతం ఎక్కువని కంపెనీ ఎండీ, సీఈఓ హిసాషి టకెయుచీ తెలిపారు. 2031 నాటికి తమ వార్షిక ఎగుమతులు 7.5 లక్షల యూనిట్లకు చేరతాయని తెలిపారు. కాగా 1986 నుంచి ఇప్పటి వరకు 100కుపైగా దేశాలకు 30 లక్షల కార్లను ఎగుమతి చేసినట్టు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం భారత్ నుంచి ఎగుమతవుతున్న కార్లలో 40 శాతం వాటా తమదేనన్నారు. మేకిన్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా తాము ఈ ఎగుమతులను చేపట్టినట్లు హిసాషి తెలిపారు.

2030 నాటికి సీకేడీ కార్ల ఎగుమతులు రెండింతలు

కియ ఇండియా టార్గెట్



పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): భారత్ నుంచి కంప్లీట్లీ నాక్‌డ్ డౌన్ (సీకేడీ) కార్ల ఎగుమతులను 2030 నాటికి రెండింతలు పెంచుకోవాలని కియ ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా పశ్చిమాసియా, ఆఫ్రికా మార్కెట్లపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు ప్రకటించింది. కాగా 2020లో ఆంధ్రప్రదేశ్, అనంతపురం ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు లక్ష సీకేడీ యూనిట్లను ఎగుమతి చేసినట్లు కియ ఇండియా చీఫ్ సేల్స్ ఆఫీసర్ జున్సు ఛో తెలిపారు. లక్ష యూనిట్లను ఎగుమతి చేసిన సందర్భంగా సోమవారం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం యర్రమంచి సమీపంలోని కియ ప్లాంట్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సీకేడీ యూనిట్ల ఎగుమతుల్లో కియ ఇండియా వాటా 50 శాతంగా ఉందని జున్సు తెలిపారు. ఈ ఏడాది ఉజ్బెకిస్తాన్, ఈక్వెడార్, వియత్నాం మార్కెట్లకు 38,000 సీకేడీ యూనిట్లను ఎగుమతి చేయాలని భావిస్తోందన్నారు.

లంచం ఆరోపణల కేసు తేలేవరకు అదానీలో కొత్త పెట్టుబడులు పెట్టం..

స్పష్టం చేసిన టోటల్‌ఎనర్జీస్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన లంచం ఆరోపణల కేసు తేలేవరకు అదానీ గ్రూప్ కంపెనీల్లో కొత్త పెట్టుబడులు పెట్టబోమని ఫ్రాన్స్ ఇంధన దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ సోమవారం స్పష్టం చేసింది. ఈ ఆరోపణల గురించి తమకు ముందుగా అవగాహన లేదన్నది. అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన అతి పెద్ద విదేశీ ఇన్వెస్టర్లలో టోటల్‌ఎనర్జీస్ ఒకటి. సిటీ గ్యాస్ సరఫరా కంపెనీ అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్‌తో పాటు పునరుత్పాదక ఇంధన సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌లో టోటల్‌ఎనర్జీస్ గతంలోనే వాటాలు కొనుగోలు చేసింది.

అదానీ కంపెనీల్లో పెట్టుబడులు కొనసాగిస్తాం: జీక్యూజీ

ప్రవాస భారతీయ ఇన్వెస్టర్ రాజీవ్ జైన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్.. అదానీ గ్రూప్ కంపెనీల భవిష్యత్‌పై తనకున్న విశ్వాసాన్ని పునరుద్ఘాటించింది. అదానీ కంపెనీ షేర్లలో తమ పెట్టుబడులను విక్రయించబోమని సోమవారం విడుదల చేసిన ఐదు పేజీల ప్రకటనలో స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ వివాదం అనంతర కాలంలో అదానీ గ్రూప్ కంపెనీల్లో జీక్యూజీ పార్ట్‌నర్స్ వాటాలు కొనుగోలు చేసింది.

వ్యాపార వృద్ధికి విదేశీ రుణాల అవసరం లేదు: అదానీ

ఆర్థికంగా బలంగానే ఉన్నామని, విదేశాల నుంచి రుణాలు సేకరించాల్సిన అవసరం లేకుండానే వ్యాపార వృద్ధిని కదం తొక్కించగలమని అదానీ గ్రూప్ ధీమా వ్యక్తం చేసింది. రుణాలు తిరిగి చెల్లించడంతో పాటు వ్యాపార వృద్ధికి సరిపడా నగదు నిల్వలున్నాయని, కంపెనీలు మెరుగైన లాభాలను ఆర్జిస్తున్నాయంటూ ఇన్వెస్టర్ ప్రజెంటేషన్‌లో గ్రూప్ పేర్కొంది. అమెరికాలో గ్రూప్ చైర్మన్‌పై నేరాభియోగాలు నమోదైనప్పటికీ కంపెనీ వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా సాగుతున్నాయంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,550 ▼	72,000 ▼	1,00,500 ▼
ముంబై	77,081 ▼	70,606 ▼	89,445 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	595
వరంగల్	587	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	103
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	82
కర్నూలు	107	నెల్లూరు	82
విశాఖపట్నం	120	అనంతపురం	82
గోదావరి	103		

● **లీ హెల్త్ నుంచి వి-ఫెరిన్**

హైదరాబాద్‌కు చెందిన లీ హెల్త్ డొమైన్.. మహిళల్లో వచ్చే జననేంద్రియ ఇన్ఫెక్షన్ల చికిత్సకు 'వి-ఫెరిన్' పేరుతో ప్రొబయోటిక్ సప్లిమెంట్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. లాక్టోఫెర్రిన్ పెప్టైడ్, క్రాన్‌బెర్రీ పండ్లతో ప్రీ-ప్రొబయోటిక్స్ లాక్టోబాసిల్లస్ అసిడోఫిలస్ మిశ్రమాలతో ఈ క్యాప్సూల్స్‌ను రూపొందించినట్లు తెలిపింది.


ఫైబర్ టెక్‌లో లక్షకు పైగా కొలువులు: టీమ్‌లీజ్

ముంబై: ఫైబర్ కేబుల్ రంగంలోనూ పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఈ రంగంలో ఎంత లేదన్నా లక్షకు పైగా కొత్త కొలువులు ఏర్పడతాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా. ఇప్పటికే ఈ రంగంలో ఐదు లక్షల మంది పని చేస్తున్నారు. దేశంలో శరవేగంగా విస్తరిస్తున్న బ్రాడ్‌బ్యాండ్, 5జీ నెట్‌వర్క్‌ల విస్తరణ ఇందుకు దోహదం చేస్తాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ అధికారి (సీఎస్ఓ) పీ సుబ్బురతినం తెలిపారు. ప్రస్తుతం 4,861 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.4.09 లక్షల కోట్లు) ఉన్న దేశీయ టెలికాం పరిశ్రమ 2029 నాటికి 7,616 కోట్ల డాలర్ల స్థాయికి చేరుతుందని కూడా టీమ్‌లీజ్ అంచనా వేసింది. కంపెనీలు, ప్రభుత్వం ఫైబర్ మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి పెట్టడంతో ఫైబర్ టెక్నీషియన్లకూ డిమాండ్ పెరిగింది.

7.1 శాతం పెరగనున్న ఉద్యోగులు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో అర్థ భాగం కొలువుల మార్కెట్‌కు బాగానే కలిసి రానుంది. 2024 అక్టోబరు- 2025 మార్చి మధ్య కాలంలో నియామకాలు 7.1 శాతం పెరగనున్నాయి. లాజిస్టిక్స్, ఈ-కామర్స్, తయారీ రంగాల్లో ఈ ఆరు నెలల్లో నియామకాలు జోరందుకుంటాయని టీమ్‌లీజ్ తెలిపింది.

నవ్య | చిత్రజ్యోతి

వేసవికి వస్తున్న 'కన్నప్ప'



డాక్టర్ మోహన్‌బాబు భారీ వ్యయంతో నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం రిలీజ్ డేట్ ప్రకటించారు. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 25న విడుదల చేయనున్నారు. ఉజ్జయినీ మహాకాళేశ్వర్ దేవాలయాన్ని సందర్శించిన 'కన్నప్ప' టీమ్ అక్కడే విడుదల తేదీ వెల్లడించింది. ఈ సినిమా విడుదల లోపు పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శిస్తామని విష్ణు ఇంతకుముందే వెల్లడించారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'కన్నప్ప' చిత్రంలోని మేజర్ పార్ట్‌ను న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఇచ్చే విధంగా తయారవుతున్న ఈ సినిమాలో మహాదేవ శాస్త్రిగా మోహన్‌బాబు ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు.

ఎనిమిది గంటల పెళ్లి



నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ళ డిసెంబరు 4న ఒక ఇంటివారవుతున్న సంగతి తెలిసిందే. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న వీరి వివాహం పూర్తిగా బ్రాహ్మణ సంప్రదాయాల ప్రకారం దాదాపు ఎనిమిది గంటల పాటు జరగనుందట. శోభిత తల్లితండ్రుల కోరిక మేరకే ఈ పద్ధతిలో వీరి పెళ్లి జరుగుతోందని తెలిసింది. డిసెంబరు 4న రాత్రి 8:13 నిమిషాలకు పెళ్లి ముహూర్తాన్ని నిశ్చయించారని తెలుస్తోంది. నయనతార, విఘ్నేశ్ శివన్‌ల మాదిరిగానే వీరి పెళ్లి స్ట్రీమింగ్ హక్కులనూ ఓ ఓటీటీ సంస్థకు ఇస్తున్నారట. కాగా, ఇటీవలే జరిగిన నాగచైతన్య పుట్టినరోజు వేడుకల్లో శోభిత పాల్గొన్న ఫొటోలను సుశాంత్ షేర్ చేశారు.

సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్



'సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్ కొత్తగా ఉంది. కంటెంట్ కూడా ఆసక్తికరంగా ఉంది. ఇటువంటి చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్న దర్శకనిర్మాత వడ్లపట్ల మోహన్‌ను అభినందిస్తున్నా' అని అన్నారు. ఇండియన్ మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్(ఐఎంపీపీఏ) వైస్ ప్రెసిడెంట్ అతుల్. దర్శకనిర్మాత వడ్లపట్ల మోహన్ తెరకెక్కించిన 'ఎంఫోర్ఎం' చిత్రం హిందీ ట్రైలర్‌ను గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ఇఫ్ఫి కళా అకాడమీ వేదికపై అతుల్ రిలీజ్ చేశారు. చిత్ర హీరోయిన్ జో శర్మ మాట్లాడుతూ 'సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్ కొత్తగా, చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది' అని అన్నారు. దర్శక నిర్మాత వడ్లపట్ల మోహన్ మాట్లాడుతూ 'మోటివ్ ఫర్ మర్డర్ తెలిసినప్పుడు మైండ్ బ్లో అవుతుంది. అనూహ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నాను. త్వరలో ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం' అని అన్నారు.

ఆ కామెంట్స్ చాలా ఇబ్బంది పెట్టాయి



అటు వెబ్ సిరీస్‌లు.. ఇటు సినిమాలతో దూసుకుపోతున్నారు బాలీవుడ్ నటి అనన్యా పాండే. 'లైగర్' చిత్రంతో తెలుగువారికి సుపరిచితమైన అనన్య.. ఇటీవల ప్రముఖ జర్నలిస్ట్ బర్ఖా దత్‌తో 'వియ్ ద విమెన్' ఫెస్టివల్ ఏడవ ఎడిషన్‌లో మాట్లాడారు. అందులో బర్ఖా 'మీకు ఎదురైన అత్యంత ఘోరమైన ట్రోలింగ్ ఏంటి' అని అడిగారు. అనన్య బదులిస్తూ 'ట్రోలింగ్ సమస్య నాకెన్నో సార్లు ఎదురైంది. కెరీర్ ఆరంభంలో ఎన్నో అవమానాలు ఎదురయ్యాయి. సోషల్ మీడియాలో నా పేరుతో ఓ వ్యక్తి ఫేక్ అకౌంట్ తయారు చేసి అందులో నా గురించి లేనిపోనివి రాసేవాడు. అవి చూసిన నేను .. ఈ కాలంలో ఇవన్నీ ఎవరు నమ్ముతారులే అనుకునేదాన్ని. అయితే వాటిని అందరూ గమనిస్తుంటారని తర్వాతే అర్థమైంది. ఒక చిన్న విషయం.. అది అబద్ధమో.. నిజమో తెలిసేలోపు సోషల్ మీడియాలో వైరల్ అయిపోతుంటుంది. అంతేకాకుండా కెరీర్ తొలినాళ్లలో తరచూ నాపై నెగెటివ్ కామెంట్స్ వచ్చేవి. వాటిని మొదట్లో పట్టించుకోకపోయినా కొంతకాలం తర్వాత గుర్తొచ్చి ఇబ్బంది పెట్టేవి. తట్టుకోలేక థెరపీ కూడా తీసుకున్నా. దాంతో నేను బెటర్‌గా ఫీల్ అయ్యేదాన్ని. నా స్కూలింగ్ డేస్‌లో కూడా నన్ను బాడీ షేమింగ్ చేసేవారు' అని చెప్పారు.

డిటెక్టివ్‌గా వెన్నెల కిశోర్



వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో నటించిన క్రైమ్, కామెడీ థ్రిల్లర్ చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. ఇప్పటికే చిత్రబృందం రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్, సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. డిసెంబరు 25న సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటిస్తూ పోస్టర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పోస్టర్‌లో వెన్నెల కిశోర్ షార్ప్ డిటెక్టివ్‌గా కనిపించారు. మూవీలో సీయా గౌతమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, స్నేహ గుప్తా, రవితేజ మహాదాస్యం, బాహుబలి ప్రభాకర్, మురళీధర్ గౌడ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సునీల్ కశ్యప్ సంగీతం సమకూర్చారు.

మానవతా విలువల మాణిక్యం



నంద పెరియసామి దర్శకత్వంలో సముద్రఖని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మిస్టర్ మాణిక్యం'. జీపీ రేఖా రవి కుమార్, చింతా గోపాలకృష్ణారెడ్డి, రాజా సెందిల్ నిర్మాతలు. 'సీతారామం' ఫేమ్ విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూర్చారు. ఈ చిత్రం డిసెంబరు 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ఏషియన్ సునీల్ నారంగ్ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేసి మాట్లాడుతూ 'నిర్మాతల్లో ఒకరైన రవి నాకు మంచి స్నేహితుడు. అతను నిర్మించిన మొదటి సినిమా 'మిస్టర్ మాణిక్యం' ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కంటెంట్‌ని నమ్మి నిర్మించిన సినిమా ఇది. మానవతా విలువలకు పట్టం కట్టే విధంగా ఈ సినిమా కథాంశం ఉంది' అని అన్నారు. సముద్రఖని మాట్లాడుతూ 'విమానం తర్వాత నేను ప్రధాన పాత్రలో నటించిన సినిమా ఇది. నటుడిగా నాకు మంచి పేరు తెచ్చిన సినిమా 'విమానం'. 'మిస్టర్ మాణిక్యం' అంతకు మించి మంచి పేరు తెస్తుందన్న నమ్మకం ఉంది. మానవతా విలువల ప్రధానాంశంగా రూపొందిన చిత్రమిది' అని తెలిపారు.

ఇన్ ప్రోగ్రెస్

తెలంగాణ సంప్రదాయ నేపథ్యం



సుమన్, మురళీగౌడ్, అన్నపూర్ణ ముఖ్య పాత్రలు పోషించిన 'మన కుటుంబం' చిత్రం ఆడియోను సోమవారం విడుదల చేశారు. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి ఆకుల రాఘవ దర్శకుడు. ఆడియో వేడుకలో సుమన్, మురళీగౌడ్, సంగీత దర్శకుడు భానుప్రసాద్, దర్శకుడు రాఘవ తదితరులు పాల్గొన్నారు. అనుబంధాలు, ఆత్మీయతలు, తెలంగాణ సాంప్రదాయలు కలబోసి చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు చెప్పారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాత హేమలత తెలిపారు.

యాక్షన్ థ్రిల్లర్



స్వీయ దర్శకత్వంలో పూర్వాజ్ హీరోగా నటిస్తున్న సెన్సేషనల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. చేతిలో రివాల్వర్‌తో పూర్వాజ్ కనిపిస్తున్నారు. ప్రతి పోస్టర్‌తో 'కిల్లర్' మూవీ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది.

సీరియస్ కథాంశంతో...



రాజేంద్రప్రసాద్ మనవరాలు సాయి తేజస్విని నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఎర్రచీర - ద బిగినింగ్'. సుమన్ బాబు స్వీయ దర్శకత్వంలో నటిస్తూ.. ఎన్.వి.వి. సుబ్బారెడ్డితో కలసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ హర్రర్ యాక్షన్ ఎంటర్టైనర్ డిసెంబర్ 20న విడుదలవుతోంది. ఇటీవలే ఈ చిత్రం నుంచి 'తొలి తొలి ముద్దు' పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత సుమన్ బాబు మాట్లాడుతూ "సీరియస్ కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది" అని అన్నారు.

సోషల్ డ్రామా



సుమన్‌తేజ్, అనుశ్రీ జంటగా నటిస్తున్న చిత్రం 'వశిష్ఠ'. హరీశ్ చావా దర్శకత్వంలో నేరి నాగేంద్రప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రాన్ని మేకర్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీశ్ మాట్లాడుతూ "గ్రామీణ నేపథ్యంలో సాగే సోషల్ డ్రామా ఇది. వినోదాత్మకంగా ఉంటుంది" అని చెప్పారు. "ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచే చిత్రమిది" అని నిర్మాత నేరి నాగేంద్రప్రసాద్ అన్నారు.

కిక్కిరిసిన సెంట్రల్ జైల్



విశాఖపట్నం సెంట్రల్ జైలు

సామర్థ్యం 914 మంది.. ప్రస్తుతం ఉన్నది 2,036 మంది.. వీరిలో 1,609 మంది రిమాండ్ ఖైదీలే

- వారిలోనూ గంజాయి కేసుల్లో పట్టుబడిన 1,400 మంది
- రోజూ 20 మంది లోపలికి.. 15 మంది బయటికి
- పర్యవేక్షణ, వసతుల కల్పన సిబ్బందికి సవాలే
- విశాఖలో ఇదీ పరిస్థితి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ కేంద్ర కారాగారం ఖైదీలతో కిక్కిరిసిపోతోంది. ఇక్కడ జైలు సామర్థ్యానికి రెండింతలకుపైగా ఖైదీలు ఉంచడం గమనార్హం. ఈ జైల్లో మొత్తం 14 బ్యారక్‌లు ఉన్నాయి. వీటి మొత్తం సామర్థ్యం 914 మంది కాగా, ప్రస్తుతం 2,036 మందిని ఉంచారు. వీరిలో వివిధ కేసుల్లో నేరారోపణలు రుజువవడంతో కోర్టులు శిక్ష విధించినవారు 427 మంది మాత్రమే. మిగిలిన 1,609 మంది రిమాండ్ ఖైదీలు. వీరిలో 1,400 మంది గంజాయి కేసుల్లో నిందితులు. ఇటీవల గంజాయి కేసులు పెరుగుతున్నాయి. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్ నిమిత్తం వారిని కేంద్ర కారాగారానికి తరలిస్తున్నారు. రోజుకు సగటున 20 మంది వరకూ రిమాండ్ ఖైదీలు వస్తుండగా.. సుమారు 15 మంది బయటకు వెళతున్నారు. బయటకు వెళ్లేవారి కంటే లోపలకు వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో జైలు కిక్కిరిసిపోతోంది. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సైతం ఇటీవల జైలును సందర్శించి.. ఇక్కడ పరిమితికి మించి, అందులోనూ గంజాయి కేసుల్లో పట్టుబడినవారే 90 శాతం ఉండడం చూసి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. సామర్థ్యానికి మించి ఖైదీల సంఖ్య బాగా ఎక్కువగా ఉండడంతో పర్యవేక్షణ, వసతుల కల్పన సిబ్బందికి తలనొప్పిగా మారుతోంది. దీనిపై జైలు సూపరింటెండెంట్ ఎన్.కిషోర్‌కుమార్‌ను ప్రశ్నించగా, సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రంలోని జైళ్లలో సదుపాయాల కల్పనకు కేంద్ర హోంశాఖ నిధులు కేటాయించిందన్నారు. 500 మంది ఖైదీలకు సరిపోయేలా జీ+1 భవన నిర్మాణం కోసం రూ.26 కోట్లు, 200 మంది ఓపెన్ ఎయిర్ జైలు ఖైదీల కోసం ప్రత్యేకంగా భవన నిర్మాణం కోసం రూ.15 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఇవన్నీ అందుబాటులోకి వస్తే జైలులో భద్రత మరింత పటిష్ఠం అవ్వడంతోపాటు ఖైదీలకు కూడా సౌకర్యంగా ఉంటుందన్నారు. అలాగే, విశాఖ కేంద్ర కారాగారంలో భద్రతను పటిష్ఠం చేసేందుకు సీసీ కెమేరాలు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ల ఏర్పాటు, వాకీటాకీలు, బాడీవార్న్ కెమెరాల కొనుగోలుకు రూ.73 లక్షలు కేటాయించిందని తెలిపారు.

10న సీపీఎస్ ఉద్యోగుల 'చలో విజయవాడ'

- పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని ఏపీసీపీఎస్ఈఏ పిలుపు

విజయవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరుతూ డిసెంబరు 10న విజయవాడలో 'చలో విజయవాడ' తలపెట్టామని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్, ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల మరియదాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఎస్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సీపీఎస్ ఉద్యోగి పదవీ విరమణ తర్వాత సర్వీసు పెన్షన్‌గా రూ. 1,000- రూ. 2,000 మాత్రమే అందుకుంటున్నాడన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పెన్షన్ రూ.4 వేల కంటే తక్కువగా సీపీఎస్ ఉద్యోగుల పెన్షన్ రావటం దారుణమన్నారు. మానవ హక్కుల దినోత్సవమైన డిసెంబరు 10న విజయవాడలో చలో విజయవాడ తలపెట్టాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్సీ అశోక్‌బాబులను ఆహ్వానిస్తున్నామన్నారు.

ఏపీకి గత ఐదేళ్లు ఎన్‌పీసీఏ నిధులివ్వలేదు

- రాష్ట్ర ప్రభుత్వం ఐఎంపీఎస్ సమర్పించకపోవడమే కారణం
- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు గత ఐదేళ్లలో జల పర్యావరణ వ్యవస్థల సంరక్షణ జాతీయ ప్రణాళిక(ఎన్‌పీసీఏ) కింద నిధులు విడుదల చేయలేదని కేంద్రప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్స్(ఐఎంపీఎస్) సమర్పించకపోవడమే దీనికి కారణమంది. ఏపీలో ఎన్‌పీసీఏ కింద పునరుద్ధరించిన చిత్తడి నేలలు, సరస్సుల వివరాలు, అలాగే గత ఐదేళ్లలో ఈ ప్రణాళిక కింద ఏపీకి విడుదల చేసిన వివరాలు తెలపాలని టీడీపీ ఎంపీలు కలిశెట్టి, దగ్గుమళ్ల, బీకే పార్థసారథి, కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కాగా, పీఎంశ్రీ పథకం కింద ఏపీలోని 855 పాఠశాలలను ఎంపిక చేసినట్లు కేంద్రం తెలిపింది. ఈ పథకం కింద ఆ పాఠశాలలో 2023-24, 2024-25లో కేంద్ర, రాష్ట్ర వాటాలతో కలిపి మొత్తం రూ.1056.44 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొంది. ఈ మొత్తంలో కేంద్రం వాటా రూ.633.88 కోట్లు అని టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

'ఉపాధి'లో అవినీతికి పాల్పడితే జైలే!

రూ.లక్ష కంటే ఎక్కువ నిర్ధారణ అయితే ఎఫ్ఐఆర్

జీఓ నెం.52కు పదును పెడుతున్న విజిలెన్స్ విభాగం

- గత 'అవినీతి' వివరాలు పంపాలని జిల్లా అధికారులకు లేఖ
- అక్రమాలను అరికట్టాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవినీతిని అరికట్టాలని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ స్కీమ్‌లో కీలకమైన విజిలెన్స్ విభాగం గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం కావడంతో దానికి జవసత్వాలు నింపాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సిబ్బందిలో జవాబుదారీతనం పెంచే ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా పోలీసు అధికారిని నియమించారు. కొత్తగా వచ్చిన చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష.. నిఘా విభాగాన్ని తిరిగి క్రియాశీలం చేసేందుకు చర్యలు ప్రారంభించారు. విజిలెన్స్ విభాగం అసలు లక్ష్యాలను సాధించేందుకు ఉన్న అధికారాలను వినియోగించాలని నిర్ణయించారు. ఉపాధి పథకంలో సోషల్ ఆడిట్ విభాగం తనిఖీలు చేపడితే.. రికవరీ వసూలు చేసే అతి స్వల్ప పాత్ర మాత్రమే పోషిస్తున్న విజిలెన్స్ విభాగం అసలు విధులను అమల్లోకి తీసుకోవాలని యోచిస్తున్నారు. విజిలెన్స్ విభాగం ఆవిర్భావం సమయంలో తెచ్చిన ఉత్తర్వులన్నింటినీ సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా భారీగా అవినీతికి పాల్పడిన సిబ్బందిపై రాష్ట్రంలో ఎక్కడా కేసులు నమోదు చేసిన దాఖలాల్లేవని అంటున్నారు. జీఓ నెం.52 ప్రకారం ఉపాధి హామీ పథకంలో రూ.లక్ష కంటే అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణ అయితే.. వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేయాలని పేర్కొన్నారు. ఆ జీఓను ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో.. చీఫ్ విజిలెన్స్ అధికారి దానిపై దృష్టి పెట్టారు. ఆయనకు గతంలో విజిలెన్స్, ఏసీబీ తదితర విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉండటంతో.. తప్పు జరిగిన తీరు, దానికి కారణాలను అన్వేషించి అక్రమార్కులపై కేసులు నమోదు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.



మార్గదర్శకాల కచ్చిత అమలుతో అవినీతి కట్టడి

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు ఎంత మంది రూ.లక్ష కంటే ఎక్కువ అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్ నిర్ధారించింది? వారిలో ఎంత మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు? ఎంత మందిపై ఇప్పటి వరకు కేసులు నమోదు చేయలేదు? అందుకు కారణాలేంటి? అనే తదితర వివరాలను అందించాలని అన్ని జిల్లాల విజిలెన్స్ అధికారులకు లేఖలు రాశారు. అదేవిధంగా ఇప్పటి వరకు ఆర్ఆర్ యాక్ట్ ఎన్ని చోట్ల వినియోగించారు? పరారీలో ఉన్న అక్రమార్కులకు సంబంధించిన వివరాలు, తొలగించిన సిబ్బంది వివరాలను కూడా పంపించాలని ఆదేశించారు. దీంతో తప్పుచేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. విజిలెన్స్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా అవినీతిని పూర్తిస్థాయిలో నిర్మూలించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. సోషల్ ఆడిట్ తేల్చిన తప్పులపై మూడు రోజుల్లోపు చర్యలు తీసుకోవాలని జీఓ నెం.52లో ఉంది. అయితే నెలల తరబడి అవినీతిపరులపై చర్యలు తీసుకోవడం లేదని విజిలెన్స్ అధికారుల పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ప్రొసీడింగ్స్‌ను కచ్చితంగా అమలు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. కంచే చేను మేసినట్లుగా అక్రమార్కుల భరతం పట్టాల్సిన సోషల్ ఆడిట్ విభాగం కొన్ని చోట్ల కమీషన్లు వసూలు చేయడంపైనా దృష్టి పెట్టారు. ఈ విభాగాన్ని గాడిలో పెట్టాలని భావిస్తున్నారు. దీంతోపాటు అంబుడ్స్‌మెన్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలకు కూడా పదును పెట్టే యోచనలో గ్రామీణాభివృద్ధి శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. ఏదేమైనా కేసులు నమోదు చేయడం ద్వారా ఉపాధి పథకంలో అవినీతికి పాల్పడితే జైలుకెళ్లక తప్పదన్న భయం కల్పించాలని యోచిస్తోంది.

మెప్మాకు 14.24 కోట్లు

- చెక్కు అందజేసిన సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ స్వయం సహాయక బృందాలకు రివాల్వింగ్ ఫండ్ కింద ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.14.24 కోట్ల చెక్కును అందజేశారు. సోమవారం మున్సిపల్ శాఖ సమీక్షలో భాగంగా 13 వేల స్వయం సహాయక సంఘ సభ్యులకు ఒక్కో ఎస్ఎల్ఎఫ్‌కు రూ.50 వేల చొప్పున 249 ఎస్ఎల్ఎఫ్‌లకు పంపిణీ చేశారు. పీ4లో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన 'పూర్ టు రిచ్' పథకం కింద ఈ నిధులు అందజేశారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతానికి, వారి జీవనోపాధిని మెరుగుపరచుకోవడానికి బ్యాంకు లింకేజీ ఏర్పాటు చేయడం కోసం ఈ రివాల్వింగ్ ఫండ్ సహాయకారిగా ఉంటుంది. సమీక్షలో మున్సిపల్ మంత్రి నారాయణ, మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్ పాల్గొన్నారు

షార్‌లో మరో విదేశీ ఉపగ్రహ ప్రయోగం

- 4న యూరప్ శాటిలైట్ ప్రోబా-3 నింగిలోకి
- సిద్ధమవుతున్న పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మరో విదేశీ ఉపగ్రహ ప్రయోగానికి తిరుపతిలోని శ్రీహరికోట వేదిక కానుంది. డిసెంబరు 4న యూరోపియన్ స్పేస్ ఏజన్సీ (ఈఎస్ఏ)కి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో సన్నాహాలు మొదలయ్యాయి. ఈ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నారు. రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. రాకెట్ శిఖర భాగంలో ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియ జరుగుతోంది. రాకెట్‌లో నింపే ఇంధనాన్ని సోమవారం తమిళనాడులోని ఇస్రో సెంటర్ మహేంద్రగిరి నుంచి రెండు ప్రత్యేక వాహనాల్లో రోడ్డు మార్గాన షార్‌కు తరలించారు. షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం చేపట్టనున్నారు.

ఇలాగైతే వ్యాపారం ఎలా?

- ప్రభుత్వం చెప్పినదాంట్లో సగమే వస్తోంది
- ప్రభుత్వ పెద్దలను కలవాలని మద్యం లైసెన్సీల నిర్ణయం

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారంలో ఆశించినంతగా ఆదాయం రావడంలేదని మద్యం వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చెప్పిన దాంట్లో సగమే మార్జిన్(లాభం) వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. 20శాతం మార్జిన్ ఇస్తామని మద్యం పాలసీలో ప్రభుత్వం పేర్కొనగా, లైసెన్సీలకు 11శాతమే చేతికి అందుతోందని చెబుతున్నారు. వైన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాయల సుబ్బారావు నేతృత్వంలో మద్యం లైసెన్సీలు సోమవారం విజయవాడలో సమావేశమయ్యారు. ఎక్సైజ్ స్టేషన్‌కు ఒకరు చొప్పున 200 మంది లైసెన్సీలు పాల్గొన్న ఈ సమావేశంలో పలువురు వ్యాపారులు మాట్లాడుతూ.. ఇష్యూ ప్రైస్‌పై 20శాతం మార్జిన్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఇష్యూ ప్రైస్ అనేదానికి అర్థం మార్చేసిందన్నారు. ఇష్యూ ప్రైస్ అంటే అందులో తమకు ఇచ్చే మార్జిన్ తప్ప అన్ని రకాల పన్నులు ఉండేవని, కానీ ఇప్పుడు కీలకమైన అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్ఈటీ)ని కలపకుండా ఇష్యూ ప్రైస్ అంటున్నారని వాపోయారు. దీంతోపాటు టీసీఎస్, రౌండ్ ఆఫ్, డ్రగ్ కంట్రోల్ సెస్ కూడా ఇష్యూ ప్రైస్ అనంతరం విధిస్తున్నారన్నారు. ఆ నాలుగు రకాల పన్నుల్లో లైసెన్సీలకు వాటా రావట్లేదని, ఫలితంగా మార్జిన్ 11శాతానికి పడిపోయిందని తెలిపారు. ఇలాగైతే వ్యాపారం ఎలా చేయగలమని ప్రశ్నించారు. దీనిపై కోర్టుకు వెళ్దామని కొందరు లైసెన్సీలు అనగా, తొలుత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామని మరికొందరు అభిప్రాయపడ్డారు. గతంతో పోలిస్తే భారీగా లైసెన్స్ ఫీజులు పెంచారు. మార్జిన్ 20శాతం చేసినందున లైసెన్స్ ఫీజులు పెంచి ఉంటారని వ్యాపారులు భావించి షాపులు దక్కించుకున్నారు. తీరా చెప్పినదాంట్లో సగమే వస్తుండటంతో ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు.

ఆర్నెల్ల తర్వాత నింపాదిగా!

- రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పాత సభ్యుల రాజీనామాలు ఆమోదం
- కొత్త వారి ప్రమాణానికి తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్ అండ్ బీ శాఖ నిర్ణయం

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఆర్‌డీసీ)కు నియమితులైన చైర్మన్, సభ్యుల రాజీనామాల ఆమోదం విషయంలో రోడ్లు, భవనాల శాఖ దాదాపు ఆర్నెల్ల పాటు నాన్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం కొత్త సభ్యులను నియమించిన నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో ఆ రాజీనామాలను ఆమోదించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో ఏపీఆర్‌డీసీ ఉంది. కార్పొరేషన్‌కు చైర్మన్, 12 మంది సభ్యులు ఉంటారు. వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన చైర్మన్, కొందరు సభ్యులు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీనామాలు చేశారు. వాటిని ఆర్‌అండ్‌బీ వెంటనే ఆమోదించాల్సి ఉంది. రాజీనామా ఆమోదించిన మరుక్షణం నుంచి వారికి వేతనాలు, రాయితీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ ఆర్‌అండ్‌బీ ఆ పని చేయలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏపీఆర్‌డీసీకి కొత్త చైర్మన్, సభ్యులను నియమించింది. దీంతో ఈనెల 6న మిగతా ముగ్గురు సభ్యులు కూడా రాజీనామా చేశారు. పోనీ అప్పుడయినా రాజీనామాలు ఆమోదించిందా? అంటే అదీ లేదు. కొత్తగా నియమితులైన సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారాలు చేయాలంటే.. గత సభ్యుల రాజీనామాలు ఆమోదించాల్సి ఉన్న నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో ఆ ఆమోదాల ప్రక్రియ ముందుకు కదిలింది. ఆర్‌అండ్‌బీలో నిర్లక్ష్యం పరాకాష్ఠకు చేరుకుందని, కీలక అంశాల్లో నిర్ణయాలు తీసుకోవడం లేదన్న విమర్శలకు ఈ వ్యవహారం మరింత ఊతమిచ్చేలా ఉంది.

వైష్ణవి డెయిరీపై సిట్ దృష్టి

- క్షుణ్నంగా రికార్డుల పరిశీలన
- టీటీడీకి నెయ్యి సరఫరాపై కీలక సమాచార సేకరణ
- నేడు యాజమాన్యాన్ని విచారించే చాన్స్
- శ్రీవారి ఆలయంలో పోటు పరిశీలన
- రెండో రోజు పూర్తిగా తిరుపతి, తిరుమలలో సిట్ అధికారుల మకాం

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వివాదానికి సంబంధించి సుప్రీం కోర్టు నియమించిన సిట్ బృందం సోమవారమంతా పూర్తిగా వైష్ణవి డెయిరీ కార్యకలాపాలపై దృష్టి సారించింది. ఆ డెయిరీ నుంచీ ఆదివారం సేకరించిన రికార్డులను క్షుణ్నంగా పరిశీలించింది. డెయిరీ యాజమాన్యాన్ని మంగళవారం సిట్ కార్యాలయానికి పిలిపించి విచారించే అవకాశముంది. నాణ్యత లేని నెయ్యి సరఫరా చేసింది సాంకేతికంగా ఏఆర్ డెయిరీ అయినప్పటికీ ఆ డెయిరీ వైష్ణవి నుంచీ నెయ్యి సేకరించి దాన్నే టీటీడీకి సరఫరా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గతంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ అధికారులు కూడా పలు ఆధారాలు సేకరించారు. ఏఆర్ డెయిరీ ట్యాంకర్లు దిండిగల్ వెళ్లకుండా వైష్ణవి డెయిరీ ప్లాంట్‌కు వెళ్లి నెయ్యి లోడ్ చేసుకుని టీటీడీకి సరఫరా చేసినట్టు టోల్‌గేట్ల వద్ద నమోదైన వివరాలు వెల్లడించినట్టు అప్పట్లోనే విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీనిపై జీఎస్టీ అధికారులు కూడా లోతుగా విచారణ జరిపి ఆధారాలన్నీ ప్రభుత్వానికి అందజేశారు కూడా. దీంతో సిట్ కూడా ప్రధానంగా వైష్ణవి డెయిరీపైనే దృష్టి సారించింది. ఆదివారం డెయిరీని తనిఖీ చేసి సేకరించిన సమాచారం మేరకు టీటీడీకి సొంతంగా నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం వైష్ణవి డెయిరీకి లేదని సిట్ నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. రెండువేర్వేరు డెయిరీల నుంచీ నెయ్యి సేకరించి, దాన్నే టీటీడీకి సరఫరా చేసినట్టు సిట్ గుర్తించిందని తెలిసింది. దీన్ని మరింత బలంగా నిర్ధారించుకోవడం కోసం ఆ డెయిరీ రికార్డులను సిట్ అధికారులు క్షుణ్నంగా పరిశీలించారు. ఎప్పటి నుంచీ వైష్ణవి డెయిరీ టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది? ఆయా సందర్భాల్లో ఎంత పరిమాణంలో నెయ్యి సరఫరాకు అగ్రిమెంట్లు జరిగాయి? అందుకు తగిన సామర్థ్యం డెయిరీకి ఉందా? నాణ్యత బాగా లేదని టీటీడీ ఎన్నిసార్లు వైష్ణవి డెయిరీ నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించింది? ఆయా సందర్భాలలో ఆ డెయిరీ యాజమాన్యం లేదా అధికారులపై కేసులేమైనా నమోదయ్యాయా? తిరస్కరణకు గురైన ట్యాంకర్ల నంబర్లు, వాటిని నడిపిన డ్రైవర్ల వివరాలు వంటి అంశాలతో పాటు టీటీడీకి నెయ్యి సరఫరా మొదలు పెట్టినప్పటి నుంచీ కల్తీ నెయ్యి ఆరోపణలు వచ్చే వరకూ వైష్ణవి డెయిరీ మొత్తం లావాదేవీలపై సిట్ సమాచారం సేకరించే పనిలో పడింది. అందులో భాగంగా డెయిరీ యాజమాన్యాన్ని, మేనేజర్ సహా సిబ్బందిని సిట్ కార్యాలయానికి పిలిపించి విచారించనున్నట్టు తెలిసింది. బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకు టెండర్ ఎందుకు కోట్ చేశారు? ఆ ధరకు నాణ్యమైన నెయ్యి ఎలా సరఫరా చేయగలిగారు? అన్న ప్రశ్నలను ప్రధానంగా సంధించే అవకాశముందని తెలిసింది.

శ్రీవారి పోటు పరిశీలించిన సిట్

సిట్‌కు చెందిన ఇద్దరు డీఎస్పీలు, ఓ సీఐ సహా కొందరు సిబ్బంది సోమవారం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పోటును సందర్శించారు. లడ్డూల తయారీకి వినియోగించే నెయ్యి టిన్నుల్లో ఉండగా వాటిని పరిశీలించారు. నెయ్యి నిల్వ విధానం, లడ్డూల తయారీ విధానం, నెయ్యి నాణ్యత వంటి వాటిపై అక్కడి సిబ్బంది నుంచి ప్రాథమిక సమాచారం సేకరించారు. మిగిలిన రెండు బృందాలు సిట్ కార్యాలయంలోనే మకాం వేసి ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, చెన్నై ఎస్ఎంఎస్ ల్యాబ్‌ల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించుకునే పనిలో నిమగ్నమయ్యాయి. విచారణ మొదలయ్యాక రెండో రోజు సిట్ అధికారులు తిరుపతి, తిరుమలకే పరిమితమయ్యారు.



నేడు టీటీడీ మార్కెటింగ్ కార్యాలయంలో తనిఖీ

తిరుపతిలో అలిపిరి సమీపంలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం, గోదాములను మంగళవారం సిట్ అధికారులు తనిఖీ చేయనున్నారు. సోమవారమే సిట్ అధికారులు పరిశీలిస్తారని సమాచారం అందడంతో రోజంతా మార్కెటింగ్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా గడిపారు. అయితే సిట్ అధికారులు అక్కడికి వెళ్లలేదు. మంగళవారం తనిఖీ చేస్తారని కార్యాలయ అధికారులకు సమాచారం అందింది. శ్రీవారి నైవేద్యాలు, లడ్డూ ప్రసాదాలతో పాటు అన్నప్రసాదాల తయారీకి అవసరమైన ముడి సరుకులన్నింటినీ మార్కెటింగ్ విభాగమే టెండర్లు పిలిచి సేకరిస్తోంది. గత ప్రభుత్వంలో నిర్వహించిన టెండర్లు, వాటి నిబంధనలు, నాణ్యతా పరంగా ఎక్కడైనా రాజీపడ్డారా? నిబంధనలు సడలించడం లేదా ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం వంటివి జరిగాయా? నెయ్యి తదితర ముఖ్యమైన ముడిసరుకుల నాణ్యత ఎలా నిర్ధారిస్తున్నారు? దానికి ప్రమాణాలేమిటి? తగిన పరికరాలు ఉన్నాయా? ల్యాబ్ పరిస్థితి ఏవిటి? వంటి కోణాల్లో సిట్ అధికారులు పరిశీలన జరిపే అవకాశముంది. అలాగే సంబంధిత రికార్డులన్నింటినీ తనిఖీ చేసే వీలుంది.

టీడీపీ @ 50 లక్షలు



- 29 రోజుల్లో అరకోటి దాటిన సభ్యత్వాలు
- సమర్థులకు, విధేయులకు పదవులు ఇవ్వడం వల్లే!
- రికార్డు సాధించిన నేతలకు లోకేశ్ ఫోన్లు
- 83 వేలతో అగ్ర స్థానంలో రాజంపేట
- 82 వేలతో రెండో స్థానంలో కుప్పం

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కొత్త రికార్డుల దిశగా పరుగెడుతోంది. సోమవారం రాత్రికి ఆ పార్టీ సభ్యత్వం 50 లక్షల మార్కును దాటేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించిన 29 రోజుల్లోనే అర కోటి రికార్డును ఆ పార్టీ శ్రేణులు అధిగమించడం విశేషం. పార్టీ ఆవిర్భవించిన ఈ 43 ఏళ్లలో ఇంత వేగంగా సభ్యత్వం పూర్తి కావడం ఇదే ప్రథమమని టీడీపీ వర్గాలు తెలిపాయి. ప్రతి రెండేళ్లకోసారి పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తోంది. ఈసారి గత నెల 26న ప్రారంభించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పెద్ద డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉన్న 21 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఆ రోజు సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో ఉన్న 20 నియోజకవర్గాలు, నమోదైన సభ్యత్వం వివరాలు అందులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పం, లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గాల కంటే అధికంగా మరి కొన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వం నమోదు కావడం విశేషం. అన్నమయ్య జిల్లా రాజంపేట ఇప్పటివరకూ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంది. ఇటీవలి ఎన్నికల్లో ఆ నియోజకవర్గంలో వైసీపీ గెలిచింది. కానీ ఇప్పుడు 83 వేల సభ్యత్వ నమోదుతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని ఆశిస్తున్న ముగ్గురు నేతలు సుగవాసి బాలసుబ్రమణ్యం, జగన్మోహన రాజు, మేడా బాబు సభ్యత్వ నమోదులో పోటీపడుతుండడంతో అక్కడ వేగం పెరిగిందని పార్టీ వర్గాల్లో వినవస్తోంది. రెండో స్థానంలో కుప్పం ఉంది. అక్కడ 82 వేల మంది టీడీపీ సభ్యులుగా నమోదయ్యారు. మూడో స్థానంలో అనంతపురం జిల్లా కల్యాణదుర్గం, నాలుగో స్థానంలో మంత్రి రామానాయుడు నియోజకవర్గం పాలకొల్లు, ఐదో స్థానంలో మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి ఉన్నట్టు టీడీపీ వర్గాలు తెలిపాయి. మంగళగిరిలో 65 వేల మంది సభ్యులుగా చేరారు. సభ్యత్వ నమోదులో చురుగ్గా ఉండి ఫలితం చూపిస్తున్న నియోజకవర్గాల నేతలకు లోకేశ్ ఫోన్లు చేసి అభినందనలు చెబుతున్నారు. దీంతో పోటీ పెరిగింది. ఈసారి రాష్ట్ర స్థాయి నేతలతోపాటు ద్వితీయ శ్రేణి నేతలు కూడా సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పాల్గొంటున్నారని, దీనివల్ల నమోదు వేగంగా జరుగుతోందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

5 లక్షల బీమా

టీడీపీలో సభ్యత్వ నమోదు రుసుము రూ.వందగా నిర్ణయించారు. గతంలో పార్టీ సభ్యులకు రూ.2 లక్షల ప్రమాద బీమా ఉండేది. ఇప్పుడు రూ.5 లక్షలకు పెంచారు. పోయినసారి తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు పెద్దగా సాగలేదు. ఈసారి అక్కడ కూడా జోరుగా జరుగుతోందని పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యకర్తల అవసరాలు చూడడానికి పార్టీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ పెట్టారు. దీని ద్వారా గత ఐదేళ్లలో పార్టీ శ్రేణులకు రూ.185 కోట్లు సాయంగా అందించారు. కష్టపడిన కార్యకర్తలను గుర్తించడానికి ఈసారి కొత్త విధానం ఏర్పాటు చేస్తున్నారు. సాంకేతికతతో బాగా పనిచేసిన వారిని గుర్తించి ఆ వివరాలు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఇటీవల నామినేటెడ్ పదవుల భర్తీలో ఈ సమాచారం ఆధారంగా కింది స్థాయిలో కష్టపడిన వారిని గుర్తించి పదవులు ఇవ్వడం వల్ల మంచి సంకేతం వెళ్లిందని, సభ్యత్వ నమోదు చురుగ్గా జరగడానికి ఇది కూడా కారణమని టీడీపీ కేంద్ర కార్యాలయ వర్గాలు అంటున్నాయి.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించండి

చాగంటి కోటేశ్వరరావుకు సీఎం చంద్రబాబు వినతి

అమరావతి, తాడేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భారతీయ కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చదువు, ఉద్యోగం, భవిష్యత్తుతోపాటు నైతిక విలువలు కూడా అవసరమని, అప్పుడే మంచి సమాజం ఆవిష్కృతమవుతుందని చెప్పారు. ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన తర్వాత తొలిసారిగా చాగంటి కోటేశ్వరరావు సోమవారం అమరావతి సచివాలయంలో సీఎంను కలిశారు. విద్యార్థులు, యువతలో నైతిక విలువలు పెంచేందుకు ప్రయత్నించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లో ప్రవచనాలు, ప్రత్యేక కార్యక్రమాల ద్వారా యువతలో మంచి పెంచే ప్రయత్నం చేయొచ్చన్నారు. సుమతి, వేమన శతకాలు, నీతి కథలు, మంచి మాటలు, ప్రత్యేక క్లాసుల ద్వారా విద్యార్థులు, యువతలో విలువలు పెంచేందుకు ప్రయత్నం చేస్తామని, విద్యాశాఖలో చేపట్టే కార్యక్రమాలపై ఇప్పటికే మంత్రి లోకేశ్‌తో చర్చించానని చాగంటి తెలిపారు. అలాగే, ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్‌ను చాగంటి మర్యాదపూర్వకంగా కలిశారు. 'మహిళలు, పెద్దలు, గురువులపై విద్యార్థుల్లో గౌరవం పెంపొందించేలా పాఠ్యాంశాల రూపకల్పనకు మీ అమూల్యమైన సలహాలు అవసరం' అని లోకేశ్ పేర్కొనగా, తనవంతు సలహాలు, సహకారం అందిస్తానని చాగంటి తెలిపారు.

'మన్యం'లో కంటైనర్ ఆస్పత్రి

- గిరిజనుల కోసం రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి
- గిరిశిఖర గ్రామాల్లోనూ స్థానికంగా వైద్య సేవలు

సాలూరు/సాలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిశిఖర గ్రామాల్లో గిరిజనులకు స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందించి.. డోలీ మోతలను తప్పించే లక్ష్యంతో కూటమి సర్కారు రాష్ట్రంలో తొలిసారిగా కంటైనర్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కరడవలస గిరిశిఖర గ్రామంలో కంటైనర్ ఆస్పత్రి (గిరి ఆరోగ్య కేంద్రం)ని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజనులకు స్థానికంగా మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో రాష్ట్రంలో మొదటిసారిగా గిరి ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు.


పార్వతీపురం మన్యం జిల్లా కరడవలస గ్రామంలో కంటైనర్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి సంధ్యా రాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తదితరులు

ఇకపై ప్రాథమిక వైద్యసేవల కోసం గిరిజనులు కొండలు ఎక్కి, దిగాల్సిన అవసరం లేదన్నారు. ఈ కంటైనర్ ఆస్పత్రిలో వారానికి రెండు సార్లు ఓ వైద్యాధికారి ఓపీ సేవలు అందిస్తారని తెలిపారు. నెలలోని నాలుగు బుధవారాల్లో 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఇక్కడకు వస్తుందని, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు వారానికి మూడు సార్లు ఇక్కడ ఓపీ సేవలు నిర్వహిస్తారని వెల్లడించారు. షుగర్, బీపీతో పాటు సుమారు 105 రకాల రోగాలకు ఇక్కడ మందులు అందుబాటులో ఉంటాయన్నారు. గర్భిణులకు కూడా వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, హెపటైటీస్, హెచ్ఐవీ, టీబీ-సెల్ల, ఓడీస్, యూరిన్, కంటి చూపు మొదలైన 14 రకాల పరీక్షలు చేస్తారని తెలిపారు. చిన్నపిల్లలకు టీకాలు కూడా వేస్తారని చెప్పారు.

ఆలస్యంగా వచ్చిన ఐసీడీఎస్ పీడీపై మంత్రి అసహనం


కరడవలస గిరి-శిఖర గ్రామంలో ఏర్పాటు చేసిన కంటైనర్ ఆసుపత్రి

గిరిశిఖర గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆలస్యంగా హాజరైన ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణిపై మంత్రి సంధ్యారాణి అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు జిల్లా అధికారులు మంత్రి కంటే ఆలస్యంగా హాజరైతే ఎలా అని ప్రశ్నించారు.


ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బెడ్లు, టీవీ

భవన నిర్మాణ అనుమతులు ఈజీ

- త్వరలో 'సింగిల్ విండో' విధానం.. అన్ని అనుమతులూ ఒకే చోట
- లే అవుట్లలో రోడ్ల పరిధి తగ్గింపు.. మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేస్తున్నట్టు మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. డిసెంబరు 31 నుంచి వివిధ భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను సింగిల్ విండో విధానంలో ఇవ్వనున్నట్టు చెప్పారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సంస్కరణలపై వేసిన కమిటీ ఇచ్చిన నివేదికకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారని చెప్పారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 15 మీటర్ల(సుమారు 5 అంతస్తులు) ఎత్తులో భవనాలను కట్టుకునే వారి ఇళ్లకు సంబంధించిన ప్లాన్‌ను లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆన్‌లైన్‌లో పెట్టి సొమ్ము కడితే అది డీమ్డ్ అప్రూవల్ అవుతుందన్నారు. మళ్లీ ప్రత్యేకంగా అనుమతి అవసరం లేదన్నారు. ఈ ప్రక్రియను టాస్క్‌ఫోర్స్ పరిశీలిస్తుందన్నారు. ఫలితంగా 95 శాతం మంది నిర్మాణాలకు అనుమతుల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని చెప్పారు. భవన నిర్మాణ అనుమతుల కోసం అన్ని శాఖల సర్వర్లను ఇంటిగ్రేట్ చేస్తున్నామన్నారు. "ప్రస్తుతం ఉన్న విధానంలో రెవెన్యూ నుంచి నాలా సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి వ్యాల్యుయేషన్, ఈసీలు తెచ్చుకోవాలి. ఫైర్, మైనింగ్ డిపార్ట్‌మెంట్, రైల్వే ట్రాక్, ఇరిగేషన్ శాఖల నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. అయితే, తాజా మార్పులతో ఇక నుంచి ఆ అవసరం లేదు. ఇవన్నీ డిసెంబరు 31 నుంచి అమల్లోకి వస్తాయి" అని మంత్రి వివరించారు. అయితే సర్వేయర్లు అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ లే అవుట్లలో ప్రస్తుతం 12 మీటర్ల వరకు(సుమారు 40 అడుగులు) స్థలాన్ని రోడ్డుకు కేటాయించాల్సి ఉందని మంత్రి నారాయణ తెలిపారు. అయితే, వివిధ రాష్ట్రాల్లో అది 9 మీటర్లుగా(సుమారు 30 అడుగులు) ఉందన్నారు. ఈ నేపథ్యంలో అదే విధానాన్ని రాష్ట్రంలో కూడా అనుసరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే భవనాలకు సంబంధించి సెల్లార్ పార్కింగ్‌కు అనుమతులు ఇస్తామన్నారు. 120 మీటర్ల కంటే ఎత్తయిన భవనాల సెట్ బ్యాక్ పరిమితిని 20 మీటర్లకు కుదించినట్టు తెలిపారు. 10 అంతస్తుల కంటే ఎత్తయిన భవనాల్లో రిక్రియేషన్‌కు ఒక అంతస్థు ఉండేలా అనుమతి ఇస్తామన్నారు.

జగన్ నిర్వాకంతో 9 కోట్లు నష్టం

అమరావతి నిర్మాణాల విషయంలో జగన్ అనుసరించిన తీరు కారణంగా తాజాగా రూ.9 కోట్లు నష్టపోయినట్టు మంత్రి నారాయణ తెలిపారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే టెండర్లు రద్దు చేయడంతో నార్మన్ సంస్థ ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించిందన్నారు. దీంతో రూ.9 కోట్లు చెల్లించామన్నారు. కాగా, అమరావతిని రాజధానిగా పేర్కొంటూ కేంద్రం గెజిట్ ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

కోస్తా రోడ్ల పునర్నిర్మాణం!

- ఇందుకోసం 650 కోట్ల నాబార్డు నిధులు
- ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ
- ప్రజలపై భారం లేకుండా టోల్ వసూలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్రలో మరమ్మతులకు కూడా వీల్లేని విధంగా రోడ్లు దెబ్బతిన్నాయని.. ఈ నేపథ్యంలో 1,447 కిలోమీటర్ల మేర వాటిని పునర్నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం రూ.650 కోట్ల నాబార్డు నిధులు అందించేందుకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ రహదారుల పునర్నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని రోడ్లు-భవనాల శాఖకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రోడ్లపై సోమవారం రాత్రి సచివాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, అధికారులతో సమీక్షచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లపై గుంతలు పూడ్చేందుకు వివిధ పద్దుల కింద రూ.861 కోట్లు కేటాయించారు. ఆర్అండ్‌బీ ఇప్పటి వరకు 1,991 కిమీ మేర గుంతలు పూడ్చినట్లు మంత్రి జనార్దన్ రెడ్డి సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చారు. జగన్ పాలనలో దెబ్బతిన్నవి, ఇటీవలకురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమై మరమ్మతులకు ఏమాత్రం వీలుకాని రోడ్లు 1,447 కిమీ వరకు ఉన్నాయని.. వాటిని పునర్నిర్మిస్తే తప్ప ప్రజలకు రహదారి సదుపాయం మెరుగ్గా కల్పించలేమని నివేదించారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని కొన్ని రోడ్లు దారుణంగా ఉన్నాయని, వాటిపై ద్విచక్రవాహనాలు కూడా నడిపే పరిస్థితి లేనంతగా ధ్వంసమయ్యాయని.. వాటిని మళ్లీ నిర్మించడమే ఏకైక ప్రత్యామ్నాయమని క్వాలిటీ కంట్రోల్ నిపుణులు తేల్చారని ఫొటోలు, వీడియో క్లిప్స్ ద్వారా సీఎంకు వివరించారు. ఆ రహదారులు కోస్తా ప్రాంతానికి కీలకమైనవన్నారు. వీటికి నిధులెలా సమకూర్చాలన్న అంశం చర్చకొచ్చింది. ప్రభుత్వం వద్ద ఉన్న నాబార్డు నిధుల్లో నుంచి 650 కోట్లు ఇస్తామని సీఎం తెలిపారు. 'ఉత్తరాంధ్ర అయినా, కోస్తాంధ్ర అయినా, రాయలసీమలో రహదారులు దెబ్బతిన్నా యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలి. పైగా వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు చాలా ముఖ్యం. జగన్ పాలనలో ఐదేళ్లు వేటినీ పట్టించుకోలేదు. కాబట్టి ఇదే స్పీడులో వాటిని కూడా బాగుచేద్దాం' అని ఆయన అన్నట్లు తెలిసింది. కాగా.. రాష్ట్రంలో రోడ్లపై గుంతల పూడ్చివేత కార్యక్రమాన్ని సంక్రాంతి నాటికి పూర్తిచేసి, ప్రజలకు పండుగ కానుకగా గుంతల రహిత రోడ్లు ఇవ్వాలని సీఎం ఆర్అండ్‌బీని ఆదేశించారు. క్వాలిటీ తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.


రహదారుల పనులపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులు

భారీ వాహనాల నుంచే టోల్!

రాష్ట్ర ప్రధాన రహదారుల(స్టేట్ హైవేస్)ను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలన్న అంశంపైనా సీఎం సమక్షంలో చర్చ జరిగింది. గతంలో జాతీయ రహదారులను బాగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి టోల్ గేట్లు ఏర్పాటుచేస్తే ప్రజలు స్వాగతించారని గుర్తుచేశారు. స్టేట్ హైవేలను కూడా అభివృద్ధి చేసి భారీ వాహనాల నుంచి మాత్రమే టోల్ వసూలు చేసేలా ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లకు రుసుము ఉండకూడదన్నారు.

'పవర్'హౌస్

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంలో స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేయాలని పిలుపు ఇచ్చారు. సౌర విద్యుత్తును పూర్తిస్థాయిలో వినియోగించేందుకు అవసరమైన ప్రణాళికలను సత్వరం అమల్లోకి తేవాలన్నారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం 132 గ్రామాలను సోలార్ విద్యుత్తు వినియోగ మోడల్ గ్రామాలుగా మారుస్తామని, ఈ గ్రామాల్లో వంద శాతం సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ వినియోగిస్తారని సీఎం చెప్పారు. రాష్ట్రంలో సోలరైజేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల గృహాలకు సోలార్ విద్యుత్ సౌకర్యంపై సమీక్షించారు. వారి ఇళ్లపై సోలార్ విద్యుత్తు పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు. పూర్తి సోలరైజేషన్ కార్యక్రమంలో భాగంగా కుప్పంను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టడంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

సోలార్‌కు కుప్పం అనుకూలం

కుప్పం నియోజకవర్గంలో వంద శాతం సౌర విద్యుత్తు పథకాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. కుప్పంలో 50,314 ఇళ్లు సోలార్ విద్యుత్‌కు అనుకూలంగా ఉన్నాయని, 2,66,15,521 చదరపు అడుగుల విస్తీర్ణంలో సోలార్ రూఫ్ టాప్ విద్యుదుత్పత్తికి అవకాశం ఉందని వెల్లడించారు. కుప్పం రెస్కో ప్రాజెక్టుకు మొత్తం రూ.286 కోట్ల వ్యయం అవుతుందని, ఇందులో రూ.114 కోట్లను లబ్ధిదారులు రుణంగా పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటిపై సోలార్ పలకలు ఏర్పాటు చేసి వాటికి సౌర విద్యుత్తును అందిస్తామని చంద్రబాబు తెలిపారు. దీనివల్ల 100 మెగావాట్లకు సుమారుగా రూ.349 కోట్ల నుంచి రూ.379 కోట్ల మేర ఆదా అవుతుందన్నారు. లక్ష యూనిట్లకు పైగా విద్యుదుత్పత్తి లక్ష్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం 2,186 ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించామన్నారు. 19,53,369 చదరపు మీటర్ల పరిధిలో సౌర విద్యుత్తు పలకలు ఏర్పాటు చేస్తే ఏడాదికి రూ. 262.25 కోట్ల వ్యయం అవుతుందని సీఎం చెప్పారు. ఎన్టీపీసీ విద్యుత్తు వ్యాపార్ నిగమ్ లిమిటెడ్ దీన్ని చేపట్టనున్నదని, దీనికి ప్రభుత్వ గ్యారెంటీ ఇవ్వనుందని చెప్పారు. కాగా, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటులో పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. వ్యవసాయ పంపుసెట్ల కోసం పీఎం కుసుమ్‌ను అమలు చేస్తామన్నారు.

30 లక్షల ఇళ్లలో పీఎంఎస్జీఎంబీవై

పీఎం సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ యోజన పథకంలోకి కోటి గృహాలను తేవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లకు ఈ పథకాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు రూ.50,000 ఖర్చు అవుతుండగా.. కేంద్రం రూ. 30,000 సబ్సిడీ ఇస్తోంది. అదే విధంగా 3 కిలోవాట్‌లకు పెట్టుబడి రూ.1.45 లక్షలకుగాను కేంద్రం రూ.78,000 సబ్సిడీ ఇస్తుంది. రాష్ట్రంలో ఈ పథకానికి సమ్మతి తెలుపుతూ ఇప్పటి వరకూ 6,33,045 మంది గృహ విద్యుత్తు వినియోగదారులు రిజిస్టర్ చేసుకున్నారని అధికారులు తెలిపారు. వీరిలో పీఎం సూర్య ఘర్ పథకానికి 70,110 దరఖాస్తు చేసుకున్నారని, 4,961 గృహాలపై సోలార్ ప్యానల్స్ అమర్చడం పూర్తయిందని వివరించారు.

ఏం చేసినా స్కామే!

(మొదటి పేజీ తరువాయి)

బయటపడింది. దీంతో జగన్ జమానాలో పనులు దక్కించుకున్న సంస్థలు.. వాటికి అప్పగించిన కాంట్రాక్టులపై విచారణ జరపాలన్న డిమాండ్ ప్రజల్లో క్రమంగా ఉధృతమవుతోంది.

అదా.. నీ కహానీ

భారతీయ వ్యాపార సామ్రాజ్యంలో గౌతం అదానీ ఓ దిగ్గజ పారిశ్రామికవేత్త. అయితే ఆయన వ్యాపార విస్తరణపై తొలి నుంచి విమర్శలు ఉన్నాయి. 2019లో ముఖ్యమంత్రిగా జగన్ పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి అదానీతో ఆయన కహానీ బాగా నడిచింది. ఇటీవల రూ.1750 కోట్ల లంచాల వ్యవహారం బయటపడటంతో ఇతర వ్యవహారాలపై కూడా అందరి దృష్టి పడింది. గంగవరం పోర్టు అదానీకి అప్పగించడంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా పది శాతం రూ. 680 కోట్లనూ వదిలేసుకున్నారు. ఇప్పుడు ఈ వాటా విలువ రూ. 2,500 కోట్లకు పైగానే ఉంటుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిన ఈ డీల్‌లో ఎంత ప్రయోజనం ఆశించారో అంటూ రాజకీయ పక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఉత్తరాంధ్ర వాసి, వైసీపీ సీనియర్‌నేత బొత్స సత్యనారాయణతో సహా.. ఇతర నేతలెవరైనా గంగవరం పోర్టు అంశం వచ్చేసరికి నాలుక మడతపెట్టేస్తారు. ఇక కృష్ణపట్నం పోర్టు నవయుగ నుంచి అదానీ పరమవ్వడం వెనుక చాలా తంతు దాగి ఉందంటూ మొదటి నుంచి ప్రచారం సాగుతోంది. కృష్ణపట్నం పోర్టును ఆనుకుని ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రం కూడా అదానీకి అప్పగించేలా జగన్ పావులు కదిపారు. ఈ డీల్‌ను వ్యతిరేకిస్తూ అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అధికారుల్లోనూ, రాజకీయవర్గాల్లోనూ కదలిక తెచ్చాయి. ఉద్యమాలు ఉధృతమవ్వడంతో చేసేదిలేక కృష్ణపట్నం థర్మల్ విద్యుత్కేంద్రం అప్పగింత వ్యవహారం ఆపేశారు. ఇక వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్కేంద్రాలను అదానీకి జగన్ కట్టబెట్టారు. కడప జిల్లా గండికోటలో 1,000 మెగావాట్లు, శ్రీసత్యసాయిజిల్లా చిత్రావతిలో 500 మెగావాట్లు, పార్వతీపురం మన్యం జిల్లా కురుకుట్టిలో 1200 మెగావాట్లు, కర్రివలసలో 1000 మెగావాట్లు, అనకాపల్లి జిల్లాలో పెదకోటలో 1500 మెగావాట్లు, విజయనగరం జిల్లా రైవాడలో 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను నిబంధనలకు విరుద్ధంగా అప్పగించేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు.. పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను కేటాయించాలి. రాష్ట్రానికి ఎవరు ఎక్కువ లబ్ధి చేకూరిస్తే వారికి ప్లాంటు స్థాపనకు అవకాశం ఇవ్వాలి. కానీ ఆ నిబంధనలేవీ పాటించలేదు. ఇక పట్టణ ప్రాంతాలో గృహాలకు విద్యుత్తు మీటర్లను అమర్చే బాధ్యతను పూర్తిగా అదానీకే ఇచ్చేశారు.

షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కు ఎనలేని మేళ్లు


జగన్ పాలనలో అత్యధిక ప్రాధాన్యం షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ అధినేత విశ్వేశ్వరరెడ్డికి దక్కింది. అప్పటి వరకు అనామక సంస్థగా ఉన్న షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ జగన్ సీఎం అయిన వెంటనే పెద్దపెద్ద కాంట్రాక్టులు దక్కించుకుంది. పొరుగు రాష్ట్రం తెలంగాణ కంటే రెట్టింపు ధరలకు షిర్డీసాయి నుంచి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను జగన్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. అవసరం లేకపోయినా ఇలా కొనుగోలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తినా జగన్‌కు చీమకుట్టినంత కూడా అనిపించలేదు. పైగా.. కొత్త కాంట్రాక్టులు కట్టబెడుతూనే ఉన్నారు. షిర్డీసాయి, ఇండోసోల్ సంస్థలకు కడప జిల్లాలో పైడిపాలెం నార్త్‌లో 1000 మెగావాట్లు, పైడిపాలెం ఈస్ట్‌లో 1200 మెగావాట్లు, సోమశిల వద్ద 900 మెగావాట్లు, ఎర్రకాలువ వద్ద 1200 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలు ఇచ్చేశారు. అదానీకి పట్టణ ప్రాంతాల్లో విద్యుత్తు మీటర్ల బాధ్యతలను అప్పగిస్తే .. షిర్డీసాయికి వ్యవసాయ విద్యుత్తు మోటార్ల బిగింపు బాధ్యతను జగన్ కట్టబెట్టారు.

కడప స్టీల్ ప్లాంట్ కథేంటో?

కడప స్టీల్ ప్లాంట్‌కు జగన్ రెండు సార్లు శంకుస్థాపనలు చేశారు. దాన్ని నిర్మించేందుకు తొలుత ముందుకొచ్చిన జేఎస్‌డబ్ల్యూ సంస్థ అప్పటికే ఆర్థికంగా దివాలా తీసింది. తమకు ఆదుకోవాలంటూ ఇంగ్లండ్ ప్రభుత్వానికి ఆ సంస్థ చేసిన అభ్యర్థనలు ఫలించలేదు. అలాంటి దివాలా తీసిన కంపెనీతో నిర్మాణానికి జగన్ శంకుస్థాపన చేయించారు. తర్వాత ఎన్నికలకు ముందు 2023 ఫిబ్రవరి 16న సజ్జన్ జిందాల్‌తో కడపలో దశ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి మరోసారి శంకుస్థాపన చేయించారు. రెండున్నరేళ్లలో 3000 కోట్లతో మొదటి పూర్తి చేస్తామని అప్పట్లో జగన్ ప్రకటించారు. ఇలా శంకుస్థాపనలు చేయడం వెనుక కథేంటోనని కడప జిల్లా వాసులు చర్చించుకుంటున్నారు.

బైజూస్‌కు బాధ్యతలా?

రాష్ట్రంలో అరబిందోకు పోర్టులూ, ఆరోగ్య సేవలు, 108 వాహన నిర్వహణ వంటి వాటిని జగన్ అప్పగించేశారు. ఇక ఆర్థికంగా చితికిపోయిన బైజూస్ చేతిలో రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తును పెట్టేశారు. ఈ సంస్థకే విద్యార్థులకు ట్యాబులను సరఫరా చేసే బాధ్యతనూ అప్పగించారు. ఈ ట్యాబులు అధిక ధరకు కొనుగోలు చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. దేశీయంగా కార్యక్రమాలను నిలిపివేస్తూ వస్తోన్న బైజూస్‌కు రాష్ట్ర విద్యార్థుల బాధ్యతలను అప్పగించడంపై జగన్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయినా.. ఆయన ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా ఆ సంస్థను బహిరంగ సభల్లో జగన్ వెనుకేసుకొచ్చారు. ఇలా దివాలా అంచుల నున్న సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టడం, అయాచిత లబ్ధిని చేకూర్చడం వెనక మర్మమేంటో అమెరికాలోని అభియోగ పత్రంతో బహిర్గతమైందని ప్రజలు అభిప్రాయం పడుతున్నారు. ఈ కాంట్రాక్టులు, పనుల అప్పగింత వెనుక ఎన్ని కోట్లు చేతులు మారాయోనని చర్చించుకుంటున్నారు.



'సెకీ' ఒప్పందంపై సంతకం పెట్టలేదు!

- నా డిజిటల్ సంతకం వాళ్లే పెట్టేశారేమో!!
- బాంబు పేల్చిన బాలినేని
- ఆ ఒప్పందంతో నాకు సంబంధమే లేదు
- 'ఆంధ్రజ్యోతి'తో మాజీ మంత్రి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా 'సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)'తో చేసుకున్న ఒప్పందంపై నాటి విద్యుత్ మంత్రి బాలినేని. శ్రీనివాసరెడ్డి సంతకం చేయలేదా! వాస్తవానికి విద్యుత్ మంత్రే సంతకం చేయాలి. అయితే తాను సంతకం పెట్టలేదని ఆయన తాజాగా బాంబు పేల్చారు. తన డిజిటల్ సంతకాన్ని వాళ్లే పెట్టేశారేమోనని వ్యాఖ్యానించారు. దీనిపై త్వరలోనే స్పష్టత ఇస్తానన్నారు. సోమవారం హైదరాబాద్‌లో తన నివాసంలో బాలినేని 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. అసలు సెకీతో సౌర విద్యుత్ సరఫరా ఒప్పందం గురించే తనకు తెలియదని, ఆ వ్యవహారంతో తనకు సంబంధం లేదన్నారు. ఉందని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని చెప్పారు. అసలు సెకీ విషయంలో జగన్ తనతో ఎప్పుడూ చర్చించలేదన్నారు. ఆ శాఖ కార్యదర్శి వచ్చి ఒప్పందం జరుగుతుందని చెప్పారు తప్పితే.. ఎప్పుడూ తనతో చర్చించలేదని తెలిపారు. సీఎం కార్యాలయం అర్ధరాత్రి ఫైలు పంపి సంతకం పెట్టాలంటే.. పెట్టలేదన్నారు. తర్వాతి రోజు సంతకంతో కేబినెట్‌కు ఫైలు వెళ్లిందని, దానిపై మంత్రివర్గంలోనే చర్చించామన్నారు. కానీ ఒప్పందంతో తనకు సంబంధం లేదని.. అసలు సెకీ వాళ్లు వచ్చినప్పుడు తనను సమావేశానికి పిలువలేదని చెప్పారు. తాను సంతకం పెట్టింది సెకీతో ఒప్పందం ఫైలుపై కాదన్నారు. ఆ సమయంలో విద్యుత్ శాఖ కార్యదర్శిగా ఉన్న అధికారిని అడిగితే అన్ని విషయాలూ తెలుస్తాయని చెప్పారు. ఈ వ్యవహారంలో జగన్ ముడుపులు తీసుకున్నారో లేదో తనకెలా తెలుస్తుందన్నారు. నిజంగా అలా తీసుకుని ఉంటే విచారణలో తేలుతుందని, తప్పని రుజువైతే.. ప్రజలకు అన్యాయం చేసినట్లేనని స్పష్టం చేశారు. సెకీ విషయంలో తనకు అణువంత కూడా తెలియదని, వాళ్లు పంపిన ఫైలుపై సంతకం పెట్టి పంపానని.. తనకు అంతవరకే తెలుసని పునరుద్ఘాటించారు. విద్యుత్ శాఖను నడిపిందంతా సీఎంవోయేనని చెప్పారు. సీఎండీలను నియమించిన ఫైలు కూడా తన వద్దకు రాలేదని, సంబంధిత శాఖ మంత్రిగా తనకు తెలియకుండానే నియమించారని తెలిపారు. సీఎంవోతో పాటు ఒక కాంట్రాక్టరు సీఎండీలను కూడా ప్రభావితం చేసేవారని.. ఇంకా ఇలాంటి విషయాలు చాలానే ఉన్నాయని, అవన్నీ త్వరలోనే చెబుతానని తెలిపారు. ఏం తప్పుచేశానని తనను మంత్రివర్గం నుంచి పక్కనపెట్టారని జగన్‌ను ప్రశ్నించారు. మంత్రి పదవి ముఖ్యం కాదని, గౌరవం చాలా ముఖ్యమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గనుల మంత్రిగా నాలుగేళ్లు పనిచేసిన తనకు వైసీపీలో గౌరవం దక్కలేదని వాపోయారు.

ఆ విషయం పవన్‌కు చెప్పా..

తనకు రాజకీయ భిక్ష పెట్టింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డేనని.. జనసేనలో చేరే సమయంలో పవన్ కల్యాణ్‌తో ఇది చెప్పానని బాలినేని అన్నారు. వైఎస్ కుమారుడిగా జగన్ వైసీపీ ఏర్పాటుచేయగానే.. అప్పటివరకు ఉన్న పదవులను వదులుకుని ఆ పార్టీలోకి వెళ్లి పనిచేశానని చెప్పారు. తాను జగన్‌తో ఉన్నప్పుడు అసలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ఎక్కడున్నాడని నిలదీశారు. అలాంటి వ్యక్తి తన గురించి మాట్లాడే స్థాయికి వచ్చాడా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు, పవన్ మెప్పు కోసమే తాను మాట్లాడుతున్నానని ఆయన అంటున్నారని.. అంటే సెకీ ఒప్పందంలో తనకు సంబంధం లేకపోయినా ఉందని ఒప్పుకోవాలనేది వారి ఉద్దేశమా అని ప్రశ్నించారు. జగన్ మెప్పు కోసం చెవిరెడ్డిలాగా ఎవరి కాళ్లుచేతులు తాను పట్టుకోలేదని, భజన కూడా చేయలేదన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి.. చంద్రబాబును తిట్టలేదనే.. ఆ టికెట్ చెవిరెడ్డికి ఇచ్చారన్నారు. అదే మాగుంట టీడీపీలో ఉన్న సమయంలో జగన్‌ను తిట్టలేదని గుర్తుచేశారు.

గ్రానైట్లు, పోర్టుల్లో దోచుకునేందుకే చెవిరెడ్డి వచ్చారు

'వైసీపీ ఓడిపోయాక నన్ను ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఉండాలని జగన్ చెప్పారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి తెలియజేశారు. రాజకీయంగా, ఆర్థికంగా నష్టం, అన్యాయం జరిగాక ఇంకా ఎలా అధ్యక్షుడిగా ఉంటానని చెప్పగానే.. మీరు ఉండనంటే.. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమిస్తామన్నారు. ఎక్కడో చిత్తూరు జిల్లా వ్యక్తిని ప్రకాశం జిల్లాకు అధ్యక్షుడిగా ఎలా పెడతారని అడిగా. ఇలాంటి పరిస్థితి భారతదేశంలో మరే పార్టీలో ఉండదు. ప్రకాశం జిల్లాకు రీజినల్ కో-ఆర్డినేటర్‌గా మిథున్‌రెడ్డి నియామకాన్ని కూడా చెవిరెడ్డి అడ్డుకున్నారు. సంతనూతలపాడులో గ్రానైట్లు, కందుకూరులో పోర్టులను దోచుకునేందుకే ఆయన జిల్లాకు వచ్చారు. ఆయన వచ్చే సమయంలోనే ఆర్టీసీ స్థలాలు తీసుకున్నారు. ఇది నేను అడగ్గానే రద్దు చేసుకుంటానని చెప్పారు. నిజాయితీగా తీసుకుని ఉంటే ఎందుకు రద్దు చేసుకోవాలి' అని బాలినేని ప్రశ్నించారు. పార్టీ నుంచి తాను ఎందుకు బయటకు వెళ్లాల్సి వచ్చిందో.. అసలు ఈ ఐదేళ్లలో ఏం జరిగిందో బహిరంగంగా చర్చించేందుకు దమ్ముంటే రావాలని చెవిరెడ్డికి సవాల్ విసిరారు. తన జోలికి రావొద్దని.. వస్తే వాళ్ల వ్యక్తిగత విషయాలు మాట్లాడాలంటే చరిత్ర చాలా ఉందన్నారు. నిజంగానే వైఎస్‌పై ప్రేమ ఉంటే.. షర్మిల, విజయమ్మలపై ఇష్టారీతిన ఎందుకు పోస్టులు పెట్టిస్తున్నారని, పెట్టిన వారిపై ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. జగన్, షర్మిల విషయం కుటుంబ వ్యవహారం కాబట్టి అందులోకి తాము వెళ్లలేదన్నారు. దీనిని పరిష్కారం చేయాల్సింది, చూపాల్సింది విజయమ్మేనని చెప్పిన వ్యక్తిని కూడా తానొక్కడినేనని తెలిపారు.

చంద్రబాబు మంత్రి పదవి ఇస్తానన్నారు..

ఎన్నికలకు ముందే వైసీపీ నుంచి బయటకు వెళ్దామనుకున్నానని, ఇదే విషయంపై చంద్రబాబుతో కూడా మాట్లాడానని బాలినేని తెలిపారు. ఆయన కూడా టీడీపీలోకి ఆహ్వానించడంతో పాటు మంత్రి పదవి కూడా ఇస్తామన్నారని చెప్పారు. 'నా రాత బాగోలేక అప్పుడు పార్టీ వీడలేదు. ఏనాడూ పదవుల కోసం ఆరాటపడలేదు. జగన్‌తో రాజకీయ ప్రయాణం వల్ల చివరకు మొత్తం ఆస్తిని అమ్ముకోవలసిన పరిస్థితికి తీసుకొచ్చారు' అని ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ పదవి కోసం జనసేనలోకి చేరలేదని, ఎలాంటి పదవీ ఇవ్వకపోయినా కలిసి ప్రయాణం చేస్తానని, తనవల్ల కూటమిలో ఎలాంటి ఇబ్బందీ రాదని, వైసీపీలో ఇబ్బంది పడి.. అక్కడ ఉండలేక వస్తున్నానని పార్టీలో చేరే సమయంలోనే పవన్‌తో చెప్పానన్నారు. ఆయన కూడా అదే స్థాయిలో తనకు గౌరవం ఇచ్చారని చెప్పారు.

జగన్ ముడుపులపై సీబీఐ దర్యాప్తు చేయాలి

- అదానీతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు షర్మిల లేఖ



అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అదానీతో జగన్ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నీ రద్దుచేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అదానీ నుంచి జగన్‌కు అందిన ముడుపులు, అర్ధరాత్రి అనుమతులపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అదానీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల రాష్ట్రంపై రూ.లక్షన్నర కోట్ల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ సీఎంకు ఆమె సోమవారం బహిరంగ లేఖ రాశారు. ఈ ఒప్పందాల్లో గౌతమ్ అదానీ నుంచి జగన్ రూ.1,750 కోట్ల ముడుపులు అందుకున్నట్లుగా వచ్చిన ఆరోపణలపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. లంచాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని, ఆర్థికంగా నష్టాల్లోకి. కష్టాల్లోకి నెట్టేశారని ఆరోపించారు. అదానీ, జగన్ మధ్య జరిగిన వ్యాపార లావాదేవీలు మొత్తం రాష్ట్ర సహజ వనరులను దోచుకునే భారీ కుంభకోణంగా పీసీసీ భావిస్తోందన్నారు. సెకీ ద్వారా అదానీతో గత ప్రభుత్వం 25 ఏళ్లకు చేసుకున్న ఒప్పందం రాష్ట్రానికి భారమన్నారు. అదానీతో ఒప్పందాల రద్దుతో పాటు ఆ కంపెనీని తక్షణమే బ్లాక్‌లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు అమ్మకంపైనా విచారణ చేపట్టాలన్నారు. జగన్ ముడుపులపై దర్యాప్తు చేయిస్తారా లేదంటే అదానీతో అంటకాగుతారా అని చంద్రబాబును షర్మిల ప్రశ్నించారు.

జగన్‌పై చర్యలు తీసుకోవాలి: రాఘవులు

అదానీ విద్యుత్తు ముడుపుల వ్యవహారాన్ని ఒక అంతర్జాతీయ కుంభకోణంగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అభివర్ణించారు. దీనిపై జేపీసీ లేదా ఉన్నత స్థాయి న్యాయ విచారణకు ఆదేశించాలని, ఈ వ్యవహారంలో జగన్‌ను విచారణ చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బాలోత్సవ్ భవన్‌లో రాఘవులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.1.99 లకు వచ్చే విద్యుత్తును రూ.2.49లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకోవడం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.లక్ష కోట్లకు పైగా భారం పడుతుందన్నారు.

అదానీకి అనంతలో స్థలం లీజు రద్దు చేయాలి

- ఆర్టీసీ ఎండీకి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ లేఖ

అనంతపురం జిల్లా రామగిరిలో అదానీకి లీజుకు ఇచ్చిన స్థల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సుందరయ్య, జిలానీ బాషా ఆర్టీసీ ఎండీకి లేఖ రాశారు.

అదానీని అరెస్టు చేయాలి: సీపీఐ రామకృష్ణ

గన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఒప్పందాల్లో ముడుపులు చెల్లించిన అదానీని అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం కృష్ణా జిల్లా గన్నవరం సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలవరం ఎత్తు తగ్గించే విషయంలో చంద్రబాబుపై జగన్ నెపం వేయడం విడ్డూరంగా ఉందన్నారు.

జగన్ తప్పించుకోలేడు: గోనె ప్రకాశరావు

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అదానీ కేసులో జగన్ తప్పించుకోలేడని ఉమ్మడి రాష్ట్ర ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు అన్నారు. విజయవాడలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ తప్పు చేయకపోతే అమెరికా కోర్టుకు వెళ్లి నిరూపించుకోవాలన్నారు. తప్పు చేసినట్లు రుజువైతే ఇద్దరి అరెస్టు ఖాయమన్నారు.

ఆరోపణలపై విచారణ జరపాలి: ఈఏఎస్ శర్మ

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అదానీ ముడుపుల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులు, అధికారులపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరుతూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ సోమవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ అక్రమ వ్యవహారంలో భాగస్వామ్యమైన కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు.



సంద్రంపై సయ్యాట!

విశాఖపట్నంలోని రుషికొండ బీచ్‌కు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంది. సముద్రంలోకి వెళ్లడానికి పర్యాటక శాఖ స్పీడ్ బోట్లు ఏర్పాటు చేయడంతో పర్యాటకులు సంద్రంలోకి రయ్యిన దూసుకుపోతున్నారు.
- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



నిత్య విద్యార్థి.. డిగ్రీల్లో అర్ధ సెంచరీ!

» డాక్టర్ కర్రి రామారెడ్డి ఘనత.. తాజాగా 13 కోర్సుల్లో ఉత్తీర్ణత



రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 25: ఒకటి.. రెండు డిగ్రీలు చేయాలంటేనే మనం చాలా కష్టంగా ఫీలవుతాం. కొంతమంది మరింత కష్టపడి 5-10 డిగ్రీలు సాధిస్తారు. అయితే.. రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, డాక్టర్ కర్రి రామారెడ్డి మాత్రం డిగ్రీల్లో అర్ధ సెంచరీ మార్కు అందుకున్నారు. వైద్య వృత్తిలో చాలా బిజీగా ఉన్నా.. నిత్య విద్యార్థిలా చదువు కొనసాగిస్తున్న ఆయన సోమవారం 50 డిగ్రీల మార్కు చేరుకున్నారు. 72 ఏళ్ల వయసులో తాజాగా 13 కోర్సులు పూర్తిచేసిన రామారెడ్డి అందులో ఆరు కోర్సుల్లో టాపర్‌గా నిలిచారు. రాజమహేంద్రవరం దానవాయిపేట మానస ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఇప్పటి వరకూ 50 డిగ్రీలు పూర్తి చేసినట్టు తెలిపారు. చదవడం అంటే తనకు ఎంతో ఇష్టమని, నేర్చుకోవాలనే తపన ఉంటే డిగ్రీలు సాధించడం పెద్ద కష్టమేమీ కాదని అన్నారు. మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ.. విభిన్న రంగాల్లో ఇన్ని డిగ్రీలు చేయడం మామూలు విషయం కాదన్నారు. నిరంతర విద్యాప్రయాణానికి రామారెడ్డి ప్రేరణగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గురుప్రసాద్, ఓలేటి సత్యనారాయణ, పీవీఎస్‌.కృష్ణారావు పాల్గొన్నారు.

వర్రా రిమాండ్ పొడిగింపు

» పోలీసు కస్టడీ పిటిషన్‌పై నేడు విచారణ

కడప రూరల్, నవంబరు 25: వైసీపీ సోషల్ మీడియా కడప జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి జ్యుడీషియల్ రిమాండ్‌ను న్యాయస్థానం మరో 14 రోజులు పొడిగించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహా మరికొందరిపై వర్రా సోషల్‌మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఈ వ్యవహారంలో పులివెందుల పోలీసులు వర్రాను అరెస్టు చేసి 11న కోర్టులో హాజరుపరచగా జడ్జి 25వ తేదీ వరకు రిమాండ్‌కు ఆదేశించారు. రిమాండ్ గడువు సోమవారం ముగియడంతో కడప నాల్గవ అదనపు జిల్లా కోర్టు (ఎస్సీ, ఎస్టీ కోర్టు) మరో రెండు వారాలు పొడిగించింది. అతడిని విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు వేసిన పిటిషన్‌పై విచారణ జరుపనుంది. దీనిపై 20న జరిగిన విచారణలో ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయాధికారి దీనబాబు తదుపరి ఆదేశాల కోసం 22వ తేదీకి వాయిదా వేశారు. అయితే ఆయన సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జిని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన సదరు కేసు పూర్వాపరాలను పూర్తిగా తెలుసుకోవడానికి 26వ తేదీకి వాయిదా వేశారు. కాగా.. కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వర్రా రవీంద్రరెడ్డిపై కాకినాడ కోర్టులో నడుస్తున్న కేసుకు సంబంధించి అక్కడి న్యాయాధికారి సోమవారం అతడిని వర్చువల్‌గా విచారించినట్లు తెలిసింది. ఇంకోవైపు.. కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను కడప ఎస్సీ, ఎస్టీ కోర్టు(నాల్గవ అదనపు జిల్లా కోర్టు) బుధవారానికి వాయిదా వేసింది.

పులివెందుల స్టేషన్‌లో వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్లు

కడప క్రైం, చీరాలటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, వారి కుటుంబసభ్యులు, మహిళా నేతలు, జనసేన, కాంగ్రెస్ నేతలపై అసభ్యకరమైన పోస్టింగులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్లను పోలీసులు విచారిస్తున్నారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో కడప సైబర్‌క్రైం పోలీసుస్టేషన్‌లో సోమవారం విజయవాడకు చెందిన ఆనం నరేంద్రరెడ్డి, తిరుపతికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డిలను పోలీసులు విచారించారు. ఇప్పటికే వర్రా రవీంద్రారెడ్డి అతడికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డిల కోసం ప్రత్యేక టీంలతో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం కూడా ఆనం నరేంద్రరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలను విచారించనున్నారు. కాగా సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో ఇప్పటికే పులివెందుల పోలీసులు పలువురికి నోటీసులు జారీచేశారు.

బాపట్ల జిల్లా పోలీసుల అదుపులో మరో నిందితుడు

తాడేపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త మేకా వెంకటరావిఎరెడ్డిని బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించారు. ప్రస్తుతం ఒంగోలు జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అసభ్యకర పోస్టులు పెట్టడంతో అతనిపై కేసులు నమోదయ్యాయి.

165 కోట్లు మాయం!

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడుల శాఖ (ఐ అండ్ ఐ), ఎనర్జీ, ఆర్థిక శాఖలకు తెలియకుండానే పీఏవో రూ.165.72 కోట్లను ఏపీఐఐసీ బ్యాంకు ఖాతాకు బదిలీ చేసింది. ఏపీఐఐసీ ద్వారా ఆ డబ్బు ఎవరి జేబుల్లోకి చేరిందనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. విమానాశ్రయ పనులు అనుకున్న మేరకు పూర్తయితేనే ఐ అండ్ ఐ గానీ, ఎనర్జీ శాఖ గానీ పరిపాలనాపరమైన అనుమతులు ఇస్తాయి. దీనికీ ఒక పకడ్బందీ పద్ధతి ఉంది. ముందుగా పనులు పూర్తయినట్లు క్షేత్ర స్థాయి అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకోవాలి. వాటిని జిల్లా స్థాయి అధికారులు ధ్రువీకరించాలి. తర్వాత సచివాలయ స్థాయిలో కార్యదర్శి పరిపాలనా అనుమతులు జారీ చేస్తేనే పీఏవో నుంచి నిధులు విడుదల అవుతాయి. కడప విమానాశ్రయ పనుల్లో ఈ ప్రక్రియ జరగనే లేదు. నిజంగా ఆ పనులు పూర్తయి ఉంటే అనుమతులు తీసుకునే బిల్లులు పాస్ చేసే వాళ్లు. పనులు చేయలేదు కనుకనే ఆ రెండు శాఖలను పక్కకు తప్పించి... నేరుగా పీఏవో ద్వారా బిల్లు పాస్ చేయించుకుని రూ.165.72 కోట్లను ఏపీఐఐసీ జేబులో వేసుకుందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజానికి 2023 మేలో రూ.202 కోట్లతో కడప విమానాశ్రయ పనులకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఇచ్చారు. ఇందులో రూ.37 కోట్ల పనులు, నిధులపై స్పష్టత లేదు. 165.72 కోట్లను ఏపీఐఐసీ ద్వారా 'ఖర్చు' చేసేశారు.

అన్ని నిబంధనలకు పాతర...

పరిపాలనా అనుమతులు లేకుండా బిల్లులు పాస్ చేయడం ససేమిరా కుదరదు. పాస్ అయిన బిల్లు ఓపెన్ చేయగానే పరిపాలనాపరమైన అనుమతులు కనపడాలి. ప్రభుత్వంలోని 33 శాఖల్లో ప్రజల సొమ్ముతో అనేక పనులు జరుగుతుంటాయి. బిల్లులు పరిశీలించే బాధ్యతను ఆయా శాఖలకే అప్పజెప్పడం సరికాదని భావించి... దానిని ఆర్థిక శాఖ పరిధిలో ఉండే పీఏవోకు అప్పగించారు. కానీ పీఏవో కూడా బిల్లుల పరిశీలనలో గోల్‌మాల్‌కి పాల్పడడం దారుణం! కడప విమానాశ్రయం పనుల బిల్లుకు సంబంధించి 2023 మే 25వ తేదీన ఆర్థిక శాఖ బీఆర్‌వో విడుదల చేసింది. 2006లో ఆర్థిక శాఖ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్న విధంగా సంబంధిత అన్ని శాఖల నుంచి పరిపాలనాపరమైన అనుమతులు తీసుకోవాలని ఆ బీఆర్‌వోలో స్పష్టంగా పేర్కొన్నారు. దీని ప్రకారం ఐ అండ్ ఐ, ఎనర్జీ శాఖల అధిపతులు (హెచ్‌ఓడీలు), సచివాలయ శాఖల నుంచి ఆమోదం తప్పనిసరని తెలిపారు. కానీ 165.72 కోట్ల బిల్లుకు సంబంధించి పరిపాలనాపరమైన అనుమతులు లేవని ఆడిటర్ జనరల్(ఏజీ) గుర్తించింది. ఇలాంటి బిల్లు ఎందుకు పాస్ చేశారంటూ పీఏవోను వివరణ కోరింది ఇది తీవ్రమైన నియమాల ఉల్లంఘన అని ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిపాలనాపరమైన అనుమతుల్లేకుండా ఈ బిల్లు చెల్లించడంతో పాటు ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి రాకుండా ఆపడం గమనార్హం. పూర్తికాని, జరగని పనులకు కూడా జగన్ హయాంలో వందల కోట్ల బిల్లులు చెల్లించారు. కడప విమానాశ్రయంలోనూ ఇదే కథ నడిచిందనే అనుమానాలున్నాయి. ఈ దుర్వినియోగంపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందో చూడాలి.

ఈ-విధాన్ అమలుకు ఓకే

» కేంద్రంతో ఏపీ శాసన వ్యవస్థ ఒప్పందం



కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోని శాసన వ్యవస్థలన్నింటినీ ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకొచ్చే నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్ (ఎన్‌ఈవీఏ) ప్రాజెక్టులో భాగస్వామి అయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖతో ఏపీ శాసన వ్యవస్థ ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏపీ శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి సత్యప్రకాశ్ ఈ ఒప్పందంపై సభాపతుల సమక్షంలో సంతకాలు చేశారు. నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్ అనేది కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 44 మిషన్ మోడ్ ప్రాజెక్టుల్లో ఒకటి. దేశంలోని మొత్తం 31 శాసనసభలు, 6 శాసన మండళ్లను ఒకే డిజిటల్ వేదిక మీదకు తెచ్చేందుకు ఈ ప్రాజెక్టును ప్రారంభించింది. దీనిలో భాగంగా రాష్ట్రాల శాసన వ్యవస్థలను డిజిటలైజ్ చేస్తారు. ప్రాజెక్టుకయ్యే ఖర్చులో 60:40 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్‌లో ఆంధ్రప్రదేశ్ చేరినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏపీ భవన్‌లో తెలిపారు. సభా కార్యక్రమాలు, ప్రశ్నోత్తరాలన్నీ ఇక ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ విధానంలో జరుగుతాయని చెప్పారు.

ఈ-విధాన్ కాగిత రహితం

- శాసన వ్యవస్థ కార్యకలాపాలను పూర్తిగా కాగిత రహితంగా నిర్వహించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.
- ఈ ప్రాజెక్టు అమలైతే సభా కార్యకలాపాలన్నీ డిజిటల్ రూపంలోనే నిర్వహించుకోవచ్చు.
- ప్రశ్నలకు నోటీసులివ్వడం, వాటిని ప్రభుత్వానికి పంపడం, మంత్రుల నుంచి జవాబులు అందుకోవడం, విభిన్న పత్రాలు సభకు సమర్పించడం, సభ్యుల నుంచి నోటీసులు స్వీకరించడం, బిల్లులు ప్రవేశపెట్టడం, వాటిని ఆమోదించడం, కమిటీల నివేదికలు, బులిటెన్ల జారీ, సభలో ఓటింగ్, పుస్తకాలు.. అన్నీ డిజిటల్ రూపంలోనే జరుగుతాయి.

ప్రతిభ ఆధారంగానే సీట్ల భర్తీ

» కౌన్సెలింగ్‌లో అందరికీ అవకాశం

» కర్నూలు, కోనసీమ వైద్య కాలేజీల్లో మెడికల్ సీట్లపై హైకోర్టు ఉత్తర్వులు

» విచారణ నేటికి వాయిదా

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ ఫౌండేషన్, కర్నూలులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలలో పెరిగిన 75 సీట్లను నీట్ పరీక్షలో ప్రతిభ ఆధారంగానే భర్తీ చేయాలని హైకోర్టు పేర్కొంది. వీటితోపాటు తమ ఆదేశాలతో కర్నూలు మెడికల్ కాలేజీలో నిలిపి ఉంచిన ఒక సీటును కూడా ప్రతిభావంతులకే కేటాయించాలని తెలిపింది. అదేవిధంగా ఆయా సీట్ల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అందరికీ అవకాశం కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. నీట్‌లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులందరికీ ఈ 76 సీట్ల భర్తీలో అవకాశం ఇవ్వకుంటే ప్రయోజనం ఉండదని, అంతగా ప్రతిభలేని వారికి ఈ సీట్లు దక్కుతాయని పేర్కొంది. ఈ ఉత్తర్వుల కాపీలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) డైరెక్టర్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జి. నరేందర్, జస్టిస్ ఎం. కిరణ్మయితో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను మంగళవారానికి(నేడు) వాయిదా వేసింది. వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తయ్యాక.. కోనసీమ వైద్య, పరిశోధన కళాశాలలో 25 సీట్లు, కర్నూలులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో 50 సీట్లు పెంచుతూ ఎన్ఎంసీ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ 75 సీట్ల భర్తీకి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్పెషల్ 'స్ట్రే వెకెన్సీ' విధానంలో కౌన్సెలింగ్ చేపట్టి, సీట్లను కేటాయించింది. ఈ ప్రక్రియను సవాల్ చేస్తూ నలుగురు విద్యార్థులు సోమవారం హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది వై. రాగూర్‌యాదవ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్టీఆర్ వర్సిటీ నిర్వహించిన రెగ్యులర్ కౌన్సెలింగ్‌లో ఇద్దరు పిటిషనర్లు బీడీఎస్, యాజమాన్య కోటా కింద మరో ఇద్దరు ఎంబీబీఎస్ సీట్లు పొందారన్నారు. పెరిగిన 75 సీట్లకు పిటిషనర్లను అనుమతించకుండా స్ట్రే వెకెన్సీ విధానంలో భర్తీ చేయడం వల్ల తక్కువ మార్కులు వచ్చిన వారికి కాంపిటెంట్ కోటా కింద ఎంబీబీఎస్ సీట్లు దక్కుతున్నాయని వివరించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తరఫున న్యాయవాది టీవీ శ్రీదేవి వాదనలు వినిపిస్తూ.. పెరిగిన సీట్లను 'స్ట్రే వెకెన్సీ' విధానంలో భర్తీ చేయాలని ఎన్ఎంసీనే ఆదేశించిందన్నారు.

సుప్రీంలో విజయపాల్‌కు ఎదురుదెబ్బ

» ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

» రఘురామపై కస్టోడియల్ హింస కేసు

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ అధికారి ఆర్ విజయపాల్‌కు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నరసాపురం మాజీ ఎంపీ, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ హింస కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ విజయపాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సోమవారం సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 2021లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌పై రఘురామ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని రఘురామ నివాసం నుంచి ఆయన్ను బలవంతంగా గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. ఆ రోజు రాత్రి కస్టడీలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నానికి పాల్పడ్డారని రఘురామ ఈ ఏడాది జూలై 11న గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఎం జగన్‌తో పాటు నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్, నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, సీఐడీ అదనపు ఎస్పీ విజయపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న విజయపాల్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీంతో అక్టోబరు 1న విజయపాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. అయితే సోమవారం ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం... ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం విజయపాల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

జగన్.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడొచ్చుగా..!

» నన్ను కొట్టించిన పెద్దలెవరో త్వరలో తెలుస్తుంది: రఘురామ

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ ఇంట్లో కూర్చుని మాట్లాడే బదులు.. శాసనసభకు వచ్చి మాట్లాడొచ్చని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు అన్నారు. ఆయనకు ప్రతిపక్ష హోదాను కూడా ప్రజలు తిరస్కరించారని, ఆ హోదా ఇస్తేనే సభకు వస్తానని మారం చేయడం సబబు కాదని పేర్కొన్నారు. సోమవారం ఇక్కడి ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. గుజరాత్, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ ప్రతిపక్ష హోదాలు లేవని, ఇప్పుడు మహారాష్ట్రలో కూడా ఏ పార్టీకి ప్రతిపక్ష హోదా రాదన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అన్ని పార్టీలకు రెండు ప్రశ్నల చొప్పున అవకాశం ఉంటుందని, జగన్ సభకు వస్తే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో దారుణంగా హింసించారని, చంపాలని కూడా చూశారని ఆరోపించారు. మిలటరీ ఆస్పత్రి నివేదికలు కూడా ఉన్నాయని, న్యాయం గెలుస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. కస్టడీలో తనను హింసించడం వెనుక ఉన్న పెద్దలెవరో త్వరలో బయటకు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పటి పెద్దలు చెప్పడంతోనే తనపై రాజద్రోహం కేసు పెట్టారని అన్నారు. తన కస్టోడియల్ హింస కేసులో సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని రఘురామ స్వాగతించారు. తాను ఇప్పుడు ఏ పార్టీపై విమర్శలు చేయనని, అయితే తన కేసు గురించి మాట్లాడే హక్కు ఉందని అన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా.. శాసనసభ్యులందరికీ గౌరవం ఇస్తానని అన్నారు. ఇటీవల శాసనసభా సమావేశాలు సంతృప్తికరంగా జరిగాయని పేర్కొన్నారు.

పర్యాటకాంధ్ర



పర్యాటక రంగ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పటికే పర్యాటక రంగ అభివృద్ధికి కీలక నిర్ణయాల తీసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో టెంపుల్, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి కార్యాచరణ, పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ఇచ్చిన హామీల అమలుపై సహచర మంత్రులు, అధికారులతో పవన్ కల్యాణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవాలి. కర్నూలు జిల్లా ఆదోని, దొండపాడు, ఉమ్మడి కడప జిల్లా సిద్ధవటం లాంటి ప్రాంతాల్లో విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్క్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఎకో టూరిజానికి సంబంధించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాం" అన్నారు.

రాష్ట్రంలో అడ్వెంచర్ థీమ్ పార్కులు

"కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్క్‌లు ఏర్పాటు చేశారు. అలాంటి థీమ్ పార్క్‌లు మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. నంద్యాలలో ఏనుగుల క్యాంపులు ఉన్నాయి. గండికోట, హార్స్‌లీహిల్స్‌లో అద్భుతమైన కొండ ప్రాంతాలున్నాయి. సినిమాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు సులువుగా ప్రచారం కల్పించవచ్చు. ఒక సినిమాలో ఒక స్పాట్‌ను ప్రమోట్ చేస్తే అదే కరపత్రంగా మారుతుంది. కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక వెళ్లినపుడు ఆ రాష్ట్ర అటవీశాఖ మంత్రి శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తుల ప్రస్తావన తెచ్చారు. వారికి గతంలో ఉండే సౌకర్యాలు ప్రస్తుతం తీసేశారని ఆయన చెప్పారు. సీఎంతో సమావేశం సందర్భంగా అటవీశాఖ అధికారులు మా దృష్టికి తెచ్చిన టూరిజం పోలీసింగ్ అంశం కూడా చర్చకు వచ్చింది. మన దగ్గర దేవాలయాలు అంటే పిక్నిక్ స్పాట్స్‌లా మారిపోయాయి. ఆలయాల పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకోవాలి. ఆలయ ప్రాంగణాల్లో క్రమశిక్షణ, డ్రెస్‌కోడ్ వంటి వాటిపై అవగాహన కల్పించాలి. హెరిటేజ్ ప్రాంతాలను గత పాలకులు తమ స్వార్థానికి తవ్వేశారు. వాటిని గుర్తించి, కాపాడుకోవాలి. ముఖ్యంగా పర్యాటకుల భద్రత చాలా అవసరం" అని పవన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, పర్యాటక శాఖ సెక్రటరీ వి.వినయ్ చంద్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏనుగులు పొలాల్లోకి రాకుండా కందకాలు తవ్వాలి: పవన్

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏనుగులు పంట పొలాల్లోకి రాకుండా కందకాలు తవ్వాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఈ పనులు చేపట్టాలన్నారు. సోమవారం అటవీశాఖ ఉన్నతాధికారులతో వన్యప్రాణుల సంరక్షణపై డిప్యూటీ సీఎం సమీక్షించారు. వన్యప్రాణులు, ఏనుగులు విద్యుదాఘాతానికి గురికాకుండా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోలార్ కంచెలను వేలాడదీసే వినూత్న పరిష్కార మార్గాలను అమలు చేయాలని సూచించారు.



'కుడా' చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు, చిత్రంలో మంత్రులు టీజీ భరత్, ఫరూక్, మాజీ మంత్రి కేఈ కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు

'కుడా' చైర్మన్‌గా సోమిశెట్టి ప్రమాణం

కర్నూలు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సోమిశెట్టి చేత మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రమాణం చేయించారు. సోమిశెట్టి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆశీస్సులతోనే 25 ఏళ్ల పాటు టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగానని, గ్రూపు రాజకీయాలు, వర్గపోరుకు ఆస్కారం లేకుండా ఉండటంతోనే ఇది సాధ్యమైందన్నారు.

ఏపీఐడీసీ చైర్మన్‌గా డేగల బాధ్యతల స్వీకరణ



ఏపీఐడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డేగల ప్రభాకరరావు

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలకు చిరునామాగా మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని, ప్రతీ ఇంటిలో ఒక ఎంటర్‌ప్రెన్యూర్ ఉండాలనే సీఎం చంద్రబాబు లక్ష్య సాధన కోసం పనిచేస్తానని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) చైర్మన్ డేగల ప్రభాకరరావు అన్నారు. తాడేపల్లిలోని ఏపీఐడీసీ కార్యాలయంలో సోమవారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత అప్పగించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పరారీలో రామ్‌గోపాల్ వర్మ!

» సోషల్ మీడియాలో పోస్టులపై కేసు

» బెయిల్‌పై నేడు హైకోర్టులో విచారణ





హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో ఉన్న రాంగోపాల్‌వర్మ నివాసం వద్ద పోలీసులు

ఒంగోలుక్రైం/బంజారాహిల్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అజ్ఞాతంలోకి వెళ్లారు. సోషల్ మీడియాలో పోస్టుల కేసులో పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో ఆయన తప్పించుకు తిరుగుతున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా సోమవారం ఆయన ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌కు హాజరుకావాల్సి ఉంది. అయితే, విచారణకు డుమ్మా కొట్టారు. దీంతో ప్రకాశం జిల్లా పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి వర్మను అరెస్టు చేసేందుకు హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లారు. అయితే, అప్పటికే ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. ఈ సందర్భంగా వర్మ తరఫు న్యాయవాది పోలీసులతో మాట్లాడుతూ.. ఆర్జీవీ ఇంట్లో లేరని చెప్పారు. రెండోసారి నోటీసులు ఇచ్చినప్పుడే విచారణకు మరింత సమయం కావాలని తాము కోరామని, అయినప్పటికీ అరెస్టు చేసేందుకు ఎందుకు వచ్చారని నిలదీశారు. వర్చువల్‌గా విచారించేందుకు అవకాశం ఉందని, ఆ మాధ్యమంలో ప్రశ్నిస్తే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాగా, ఇదే విషయాన్ని వర్మ కూడా వాట్సాప్ ద్వారా పోలీసులకు తెలిపారు. వర్చువల్ విచారణకు అనుమతి ఇవ్వాలని విచారణాధికారిని కోరారు. దీనిపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇంతలో పోలీసులకు మరో సమాచారం అందింది. వర్మ తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్నట్టు తెలిసింది. ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో తమిళనాడులోని కోయంబత్తురులో ఉన్నట్టు వర్మ ఫొటోలు పోస్టు చేయడం దీనికి బలాన్నిచ్చింది. దీంతో ఆ దిశగా పోలీసులు దృష్టిసారించి, తమిళనాడు పోలీసులతో మాట్లాడారు. ఈ క్రమంలో మరో పోలీసు బృందాన్ని చెన్నైకి పంపేందుకు సిద్ధమవుతున్నారు.

మధ్యంతర ఉత్తర్వులకేనా?

ఈ నెల 10న ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలోని మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో టీడీపీ నాయకుడు మత్తనపల్లి రామలింగం ఫిర్యాదు మేరకు రామ్‌గోపాల్ వర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి గతంలో తన ట్విటర్‌లో పోస్టు చేశారని రామలింగం తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అధికారిగా ఒంగోలు రూరల్ సీఐ ఎన్. శ్రీకాంత్‌బాబును నియమించారు. ఈ నేపథ్యంలో వర్మకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 19న ఒంగోలు రూరల్ స్టేషన్‌లో విచారణకు హాజరుకావాలని కోరారు. అయితే, తాను ముందస్తు షూటింగ్ షెడ్యూల్ ప్రకారం 19న రాలేనని, వారం రోజులు గడువు కావాలని కోరుతూ విచారణాధికారికి వర్మ వాట్సాప్ మెసేజ్ చేశారు. అదేవిధంగా తన న్యాయవాది ద్వారా లేఖను పంపించారు. ఈ క్రమంలో విచారణాధికారి ఈ నెల 25న విచారణకు హాజరుకావాలని కోరుతూ వర్మకు మరోసారి నోటీసులు అందించారు. ఈక్రమంలో వర్మ న్యాయపోరాటం చేస్తూనే పోలీసులకు సహకరిస్తానని చెబుతూ వచ్చారు. తొలుత తనపై ఉన్న కేసును కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. న్యాయమూర్తి దానిని కొట్టేయడంతో, అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వర్మ మరో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై మంగళవారం హైకోర్టులో విచారణ జరగనుంది.







అన్నదాత 'చి'వరి' ప్రయత్నం!

వరిచేలు కోత దశకు వచ్చాయి. సెప్టెంబరు నుంచి సరిగా వర్షాలు లేకపోవడంతో చివరి దశలో ఉన్న చేలకు నీరందించి.. పంటను దక్కించుకునేందుకు అన్నదాతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం గొర్లపేట రైతులు పప్పల రామినాయుడు, అప్పన్న, శ్రీనివాసరావు 300 మీటర్ల దూరంలోని చెరువు నుంచి పైపులు వేసి వరి పంటకు తడి అందించేందుకు ఇలా శ్రమిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.